మేయర్ ముందే మ్యాన్‌హోల్లో పడిన వ్యక్తి..



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 25 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 170 | పేజీలు:12 | వెల రూ.5

అయోధ్య విరాళాల నిర్వహణలో వైఫల్యం!



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

## ‘మనం’కు నీరా‘జనం’



05-04-2026 తేదీన మనం దినపత్రికలో ప్రచురితమైన ‘గన్ వదలని గణపతి’ ప్రత్యేక కథనానికి పాఠకుల నుంచి అనూహ్యమైన ఆదరణ లభించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఈ కథనాన్ని సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌లో పంచుకోగా, ఇప్పటివరకు 1.43 లక్షల (143K) మందికి పైగా వీక్షించారు. ఒక ప్రాంతీయ దినపత్రికలో ప్రచురితమైన కథనాన్ని ఇంత భారీ సంఖ్యలో పాఠకులు వీక్షించడం నిజంగా అరుదైన విషయమే. అలాగే ఈ కథనాన్ని వందలాది మంది స్పందించగా, అనేక మంది తమ మిత్రులతో పంచుకోవడం ద్వారా విస్తృత చర్చకు దారితీసింది. ఈ స్పందన పాఠకులు నాణ్యమైన, విశ్లేషణాత్మక జర్నలిజాన్ని ఎంతగా ఆదరిస్తారో మరోసారి నిరూపించింది. కథనాన్ని చదివి, ఆదరించి, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పంచుకున్న ప్రతి పాఠకుడికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ ప్రత్యేక కథనాన్ని ప్రచురించినందుకు మనం దినపత్రిక సంపాదకులు, యాజమాన్యానికి వ్యాస రచయిత కాలగిరి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

**వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు.. మోడీకి పిలుపు** 9

# నిర్లక్ష్యాన్ని సహించం

- పది రోజుల సమయం ఇచ్చి చూస్తాం
- అవసరమైతే మంత్రులు, ఎమ్మెల్యేలను మారుస్తాం
- ‘సర్’పై జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి
- పార్టీ శ్రేణులు ఓటర్ల హక్కులు కాపాడాలి : పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్, జూన్ 24 ( మనం బ్యూరో ) :** ‘సర్’ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదని పని చేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోమని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తామనీ, అవసరమైతే మంత్రులు, ఎమ్మెల్యేలను సైతం మారుస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గురువారం నుంచి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్) ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ‘సర్’ చాలా సీరియస్ అంశమనీ, దీనిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొందరు నాయకులు ‘సర్’పై నిర్లక్ష్యంగా ఉంటున్నారనీ, పార్టీకి నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు.‘సర్’ అవగాహన సదస్సులపై జిల్లాల వారీగా నివేదిక నా దగ్గర ఉంది.ఈ విషయంలో సరిగా వ్యవహరించకపోతే పేదల ఓట్లు పోతే వాళ్ల ఆధార్ కార్డు, రేషన్ కార్డు పోతుందనీ, వాళ్లకు అన్యాయం జరగనివ్వొద్దని స్పష్టం చేశారు. ఎవరైనా పార్టీ ఆదేశాలను పాటించాల్సిందేననీ, పార్టీ సర్పంచ్‌లతో గ్రామాల్లో ప్రచారం చేయించి అవగాహన కలిగించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ మాట్లాడుతూ ఓటర్ల



హక్కులు కాపాడటంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదనీ, దేశవ్యాప్తంగా బీజేపీ రాజకీయ వ్యూహాలను గమనించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల నిర్వహణ విషయంలో జరిగిన పరిణామాలను ప్రస్తావించిన పీసీసీ అధ్యక్షుడు లౌకిక వాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే ప్రమాదం ఉందనీ, ప్రతి అర్హత కలిగిన ఓటు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు కూడా అత్యంత కీలకంగా పని చేయాలని సూచించారు.

## నేడు హోసపేటకు సీఎం రేవంత్ రెడ్డి


### తుంగభద్ర డ్యామ్ 33 స్పిల్‌వే గేట్ల ప్రారంభం



**హైదరాబాద్, జూన్ 24 (మనం బ్యూరో):** సీఎం రేవంత్ రెడ్డి గురువారం కర్ణాటకలోకి విజయనగరం జిల్లా హొసపేటకు వెళ్లనున్నారు. తుంగభద్ర డ్యామ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 33 స్పిల్‌వే గేట్ల ...మిగతా 2లో

## సీఎం రేవంత్‌కు హైకోర్టులో ఊరట

### కీలక కేసు కొట్టివేత



**హైదరాబాద్,జూన్ (మనం,ప్రత్యేక ప్రతినిధి):** సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2021లో జరిగిన హుజూరాబాద్ నియోజకవర్గ ఉపఎన్నికల సమయంలో ...మిగతా 2లో

## కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు



### రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు

**హైదరాబాద్, జూన్ 24 ( మనం బ్యూరో ) :** రాష్ట్ర ప్రభుత్వ తదుపరి ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కేంద్ర సర్వీసులలో ఉన్న ఆయనను ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు రాష్ట్రానికి పంపుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుండగా, కొత్త ప్రధాన కార్యదర్శి కోసం ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులు జయేశ్ రంజన్, వికాస్ రాజ్ పేర్లను పరిశీలించింది. అయితే సీఎం రేవంత్ చివరకు సంజయ్ జాజు వైపే మొగ్గు చూపినట్లు సమాచారం. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్ ఉమ్మడి ఏపీలో విజయవాడ సబ్ కలెక్టర్‌గా, పశ్చిమ గోదావరి కలెక్టర్‌గా, హైదరాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా పని చేశారు. 2014 నుంచి కేంద్ర సర్వీసులో కొనసాగుతున్నారు. కాగా, జాజు నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు రెండు మూడు రోజుల్లో వెలువడే అవకాశం ఉంది. ఆయన 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో ఉంటారు.

## తుంగభద్ర జలాల్లో హక్కులను కాపాడుకుంటాం

- నికర జలాల వాటా వినియోగంపై భాగస్వామ్య రాష్ట్రాలతో కేంద్రం సమన్వయం సాధించాలి
- ఆర్డీఎస్ పరిస్థితి, తుంగభద్ర బోర్డు కార్యకలాపాలపై సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్, జూన్ 24 ( మనం బ్యూరో ) :** తుంగభద్ర నుంచి రాష్ట్రానికి రావాల్సిన నికర వాటా జలాల వినియోగానికి భాగస్వామ్య రాష్ట్రాలతో సమన్వయ సాధనకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తుంగభద్ర డ్యామ్, నది ప్రవాహం నుంచి రాష్ట్రానికి హక్కుగా 15.9 టీఎంసీలు హక్కుగా రావాల్సి ఉండగా, ఐదారు టీఎంసీలకు మించి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం జలసౌధలో తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్, నదీ జల వివాదాలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మూడు రాష్ట్రాల భాగస్వామ్యం ఉన్నందున కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ-ఏపీ-కర్ణాటక నీటి వాటాల సమర్థ వినియోగానికి కేంద్ర జల సంఘం సారథ్యంలో తుంగభద్ర బోర్డును పటిష్టం చేయాలని కోరారు. ఆర్డీఎస్ ఆనకట్ట అత్యంత ప్రమాదకరంగా మారిందనీ, భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన పనులను అత్యవసరంగా గుర్తించాలని కోరారు. ఆర్డీస్ కెనాల్ ఆధునీకరణకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.59 కోట్లు డిపాజిట్ చేసిందనీ, అయినప్పటికీ పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. నిలిచిపోయిన ప్యాకేజీ 1, 2 పనులు ఇప్పటికీ చేపట్టలేదనీ, ఈ పనులను వెంటనే చేపట్టాలని గురువారం కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో ముగ్గురు సీఎంలతో జరిగే సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించాలని నిర్ణయించారు.



పూడికతీతతో పాటు 2004లో నిపుణుల కమిటీ ఇచ్చిన సూచనలను అమలు చేయాలని కేంద్రానికి వినతి పత్రం అందించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. తుంగభద్ర ఎత్తిపోతల పథకంలో భాగంగా నీటిని వినియోగించుకునే ప్రత్యామ్నాయాలు పరిశీలించాలనీ, తుమ్మిళ్ల నుంచి నీటిని వినియోగించుకునేందుకు కీలకమైన మల్లమ్మకుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కెపాసిటీ పెంచాలని, వీలైనంత వేగంగా పనులను చేపట్టాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

## నేటి నుంచి ‘సర్’

- ఓటర్ జాబితాపై ఫోకస్
- అప్రమత్తమైన అన్ని రాజకీయ పార్టీలు

**హైదరాబాద్, జూన్ 24, మనం బ్యూరో :** ఓటర్ల జాబితా సవరించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం అధికారులు సిద్ధమయ్యారు. సర్ ప్రక్రియలో భాగంగా జులై 24 వరకు ఇంటింటి గణనకు వచ్చే బీఎల్‌వోలు ఒక కుటుంబంలో ఎంత మంది ఓటర్లు ఉంటే అన్ని ఎన్యుమరేషన్ ఫారాలు విడివిడిగా ఇస్తారు. వీటిని ఓటరు విధిగా తన పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను జత చేసి పుట్టిన తేది, ఆధార్ కార్డు నెంబర్, ఫోన్ నెంబర్, తల్లిదండ్రుల వివరాలు, వారి ఓటు హక్కు వివరాలను నింపి అందజేయాల్సి ఉంటుంది లేదా నేరుగా ఎన్నికల సంఘం యాప్‌లో అప్లోడ్ చేయవచ్చు. ఒకవేళ ఇంటి వద్ద లేని పక్షంలో ఫారం డౌన్ లోడ్ చేసుకోవడం లేదా జూలై 24 లోగా అప్లోడ్ చేసి ఎక్నాలెడ్జిమెంట్‌ను బీఎల్‌వోలకు అందజేయాలి. అలా చేసిన ఎన్యూమరేషన్ ఫారమ్‌ను బీఎల్‌వోలు క్షుణ్ణంగా పరిశీలించి ఓటును నిర్ధారిస్తారు. ఇందుకు గాను హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో 4,062 పోలింగ్ స్టేషన్లలో 47,36,669 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో ఇప్పటికే 22 లక్షల 9 వేల 647 మంది ఓటర్లు మ్యాపింగ్ చేశారు. ఇంకా 25 లక్షల 27 వేల 22 మంది ఓటర్లను మ్యాపింగ్ చేయాల్సి ఉంది. వీరందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసేందుకు జిల్లావ్యాప్తంగా 4,062 మంది బీఎల్‌వోలను నియమించారు. అలాగే వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన 10,901 మంది బీఎల్‌ఏలను నియామకం పూర్తి చేసి వారికి తగిన శిక్షణ ఇచ్చారు. కాగా, హైదరాబాద్లో ఓటు వేయాలంటే ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశాన్ని ...మిగతా 2లో

## ముందంజలో ఉన్నాం.. వెనుకంజ వేయొద్దు



- స్మార్ట్ పోలీసింగ్ మరింత బలోపేతం
- ఆన్‌లైన్ ఫిర్యాదులపై వెంటనే ఎఫ్ఐఆర్ చేయాలి
- రాష్ట్ర పోలీసులకు డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు

**హైదరాబాద్, జూన్ 24(మనం,ప్రత్యేక ప్రతినిధి);** దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాత్యులతో ముందంజలో ఉన్న తెలంగాణ పోలీసు శాఖ మరింత బలోపేతం చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ ...మిగతా 2లో

## తెలంగాణ ఆత్మను ప్రతిబింబించేలా బోనాలు

- జూమ్ మీటింగ్ ద్వారా ఆషాఢమాస బోనాల సమన్వయ సమావేశంలో మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్,జూన్24(మనం న్యూస్):** తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, జానపద వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ...మిగతా 2లో

## గ్రీన్‌కార్డ్ హోల్డర్లు నేరాలు చేస్తే.. దేశ బహిష్కరణే

### అమెరికా సుప్రీం కోర్టు తీర్పు

**వాషింగ్టన్, జూన్ 24:** డిపోర్టేషన్ (దేశ బహిష్కరణ) విషయంలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువడింది. నైతిక



దుష్ప్రవర్తనకు పాల్పడితే శాశ్వత నివాసితులు, గ్రీన్‌కార్డు హోల్డర్లు అయినా సరే దేశం నుంచి బహిష్కరించేలా ప్రభుత్వానికి ఉన్న అధికారాలను యూఎస్ సుప్రీంకోర్టు సమర్థించింది. అయితే ఆ కేసుల్లో ఆ నేరం జరిగిఉండొచ్చని నమ్మడానికి బలమైన కారణం ఉన్నట్లు అధికారులు నిర్ధరించాల్సి ఉంది. నేరారోపణలు ఎదుర్కొంటున్న శాశ్వత నివాసితులు, గ్రీన్‌కార్డు హోల్డర్లకు ఎంట్రీ పాయింట్ల వద్దే అమెరికా లో ప్రవేశానికి నిరాకరించేలా ఈ తీర్పు అనుమతిస్తోంది. దేశం నుంచి డిపోర్ట్ చేయడానికి బోర్డర్ ఏజెంట్ల అధికారాలకు మరింత బలం చేకూరుస్తోంది.

నకిలీ ట్రేడ్‌మార్క్ సంబంధించి గ్రీన్ కార్డ్ హోల్డర్ అయిన చైనా జాతీయుడు మక్ చోయ్ అభియోగాలు ...మిగతా 2లో

## సముద్రం అడుగున ‘డేటా సెంటర్’



- చైనా వినూత్న ఆవిష్కరణ

**బీజింగ్, జూన్ 24:** డేటా సెంటర్ల అవసరం ఇప్పుడు ఎంతగా ఏర్పడిందో మనందరికీ తెలిసిందే. అదే సమయంలో కృత్రిమ మేధ రంగం సృష్టించిన విప్లవం సరికొత్త ఇంధన సవాళ్లనూ విసురుతోంది. వీటిని ఎదుర్కొనేందుకు చైనా వినూత్న ఆలోచన చేసింది. ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా పవన విద్యుత్తుతో నడిచే డేటా సెంటర్‌ను నీటి అడుగున ఏర్పాటుచేసింది. షాంఘై తీరంలోని ఈ డేటాసెంటర్ భూమిపై ఉన్న డేటాసెంటర్లతో పోలిస్తే ఐదోవంతు తక్కువ విద్యుత్తును వినియోగిస్తుంది. నీటి వినియోగం అత్యల్పం. మే నెలలో ప్రారంభమైన షాంఘై లింగాంగ్ సముద్రగర్భ డేటాసెంటర్ ప్రాజెక్టు 24 మెగావాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రభుత్వ యాజమాన్యంలోని చైనా కమ్యూనికేషన్స్ కన్స్ట్రక్షన్ సంస్థ, హైక్లౌడ్ టెక్నాలజీలు సంయుక్తంగా దీన్ని ఏర్పాటుచేశాయి. షాంఘై తీరానికి 6 మైళ్ల(10 కిలోమీటర్ల) కంటే ఎక్కువ దూరంలో ఉన్న ఈ డేటాసెంటర్, సముద్ర నీటి ఉపరితలానికి 10 మీటర్ల లోతులో మునిగి ఉంది.

సమీపంలోని ఆఫ్‌షోర్ విండ్‌ఫార్మ్ ద్వారా శక్తిని పొందుతుంది. పునరుత్పాదక శక్తితో పనిచేస్తుంది, సముద్రపు నీటిలో మునిగి ఉంటుంది కాబట్టి సహజ శీతలీకరణ గుణంతో విద్యుచ్ఛక్తి అవసరం తగ్గుతుంది. సంప్రదాయ, భూ-ఆధారిత డేటాసెంటర్లో సర్వర్లు వేడెక్కకుండా నిరోధించడానికి వాటి ...మిగతా 2లో

## ఎటువంటి అణు తనిఖీలు లేవు: ఇరాన్

**టెహ్రాన్, జూన్ 24:** ఇరాన్‌లోని అణు శక్తి కేంద్రాల్లో తనిఖీలు చేపడతామంటూ అంతర్జాతీయ అణు శక్తి సంస్థ చీఫ్ గ్రోసీ చేసిన ప్రకటనను ఇరాన్ దౌత్యవేత్తలు ఖండించారు. అమెరికాతో తుది ఒప్పందం కుదిరే వరకు ఎటువంటి తనిఖీలకు అనుమతి లేదని ఆ దేశ మంత్రి కజెమ్ ఘరీబాబాదీ తెలిపారు. ఈ విషయంపై గతంలో గ్రోసీ తమకు విజ్ఞప్తి చేశారని కానీ స్విట్జర్లాండ్‌లో ఆయనతో ఎటువంటి సమావేశం జరగలేదని పేర్కొన్నారు. అణు పదార్థాన్ని పరిశీలించేందుకు అనుమతించే ప్రణాళిక ఏదీ తమ వద్ద లేదని



మీడియాలో హడావిడి సృష్టించడం ద్వారా ఏమీ సాధించలేరని అన్నారు. అమెరికా తీసుకునే ఆచరణాత్మక చర్యలను ...మిగతా 2లో

## ఇరాన్‌కు ప్రయాణం వద్దు : భారత్ అడ్వైజరీ

**టెహ్రాన్, జూన్ 24:** అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం ముగింపు ప్రకటనతో పశ్చిమాసియాలో ఇప్పుడిప్పుడే ఉద్రిక్తతలు చల్లారుతున్నాయి. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ తమ అడ్వైజరీని సవరించింది. అయితే, ఇరాన్‌లో పరిస్థితులు కాస్త మెరుగుపడినప్పటికీ ప్రస్తుతానికి ఈ దేశానికి అనవసర ప్రయాణాలు మానుకోవాలని భారత పౌరులకు ...మిగతా 2లో

# అయోధ్య విరాళాల నిర్వహణలో వైఫల్యం!



- ప్రభుత్వానికి సిట్ నివేదిక
- ఎఫ్ఐఆర్ నమోదుకు సిఫార్సు

**లఖ్‌నవూ, జూన్ 24:** అయోధ్య రామ మందిరానికి అందిన విరాళాల్లో భారీగా అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై విచారణ కీలక దశకు చేరుకుంది. మంగళవారం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన విచారణ నివేదికను ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వానికి అందజేసింది. ఇందులో శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు సిట్ క్లీన్చిట్ ఇచ్చిందా.. ఆరోపణలకు బాధ్యుడిని చేసిందా అన్న దానిపై ఆసక్తి నెలకొంది. మరోవైపు సిట్ నివేదిక ఎలా ఉన్నా ట్రస్టును పునర్వ్యవస్థీకరించే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి.

అయోధ్యకు వచ్చిన విరాళాలను నిర్వహించడంలో వైఫల్యం కనిపిస్తోందని సిట్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. విలువైన వస్తువులపట్ల నిర్లక్ష్యం కనిపించిందని అభిప్రాయపడినట్లు సమాచారం. సరైన పర్యవేక్షణ లేదని తేలిందని సిట్ పేర్కొన్నట్లు తెలిసింది. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. సిట్ విచారణ ప్రాథమిక నివేదికను ఉత్తర్ ప్రదేశ్ హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సంజయ్ ప్రసాద్‌కు లఖ్‌నవూ డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్ అందజేశారు. విచారణ ఇంకా కొనసాగుతోందని, తదుపరి ఆధారాల కోసం అన్వేషిస్తున్నామని సిట్ బృందం వెల్లడించింది. ట్రస్టుకు అందిన విరాళాల దుర్వినియోగం జరిగిందంటూ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ నెల 13న యూపీ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ తుది నివేదికను 10 నుంచి 15 రోజుల్లో ప్రభుత్వానికి సమర్పిస్తామని పంత్ తెలిపారు.

# మేయర్ ముందే మ్యాన్‌హోల్లో పడిన వ్యక్తి.. వీడియో వైరల్!



**ముంబయి, జూన్ 24:** దేశ వాణిజ్య రాజధాని ముంబయి భారీ వర్షాలతో అతలాకుతలమైంది. ఈ క్రమంలో నగరంలో పరిస్థితిని సమీక్షించేందుకు మేయర్ రీతూ తావ్‌డే క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఓ చోట ఆగి అధికారులతో చర్చిస్తున్నారు. అదే సమయంలో పక్కనే ఉన్న మూతలేని మ్యాన్‌హోల్లో ఓ మున్సిపల్ ఉద్యోగి పడిపోయాడు. వెంటనే అప్రమత్తమైన సహచర సిబ్బంది.. ఆయన్ను బయటకు తీశారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్గా మారింది. అయితే, కళ్లముందే ఈ ఘటన చోటుచేసుకోవడంతో బీఎంసీ (బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్) అధికారులపై మేయర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాన్‌హోళ్లు తెరిచి ఉండటం కనిపిస్తే సంబంధిత అధికారిపై సస్పెన్షన్ వేటు విధిస్తామని హెచ్చరించారు. నైరుతి రుతుపవనాల రాకతో ముంబయిలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి భారీ వర్షం కారణంగా అనేక ప్రాంతాలు నీటమునిగాయి. ప్రధాన రహదారులపై నీరు నిలవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదర్, హింద్మాతా, గాంధీ మార్కెట్ ప్రాంతాల్లో పరిస్థితులను సమీక్షించిన మేయర్ రీతూ తావ్‌డే అధికారులకు పలు సూచనలు చేశారు. మ్యాన్‌హోళ్ల దగ్గర ఉండే సూచికలు చూసుకొని జాగ్రత్తగా వెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సముద్రం అడుగున 'డేటా సెంటర్'

(మొదటి పేజీ తరువాయి)

చుట్టూ చల్లటి నీటిని పైపుల ద్వారా పంపించాల్సి ఉంటుంది. దానివల్ల మొత్తం విద్యుత్ డిమాండులో దాదాపు 25-40 శాతం వాటికే ఖర్చవుతుంది. ఇక వాటి నీటి వినియోగమూ ఎక్కువే. అందుకే భూ ఆధారిత డేటా సెంటర్లపై చాలా ప్రాంతాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీనికి విరుగుడుగా చైనా సముద్రం అడుగున డేటా సెంటర్‌ను ప్రారంభించింది. నిజానికి నీటి అడుగున ఉండే డేటాసెంటర్లు అవక్షేపాలను కదిలించడం లేదా సముద్రపు నీటిని వేడి చేయడం ద్వారా సముద్ర జీవావరణ వ్యవస్థలకు కొన్ని ప్రమాదాలను కూడా సృష్టిస్తాయి. అందువల్ల వీటి విషయంలో మరింత జాగ్రత్తలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. బ్రిటన్‌లోని బోర్న్‌మౌత్ విశ్వవిద్యాలయంలో సముద్ర జీవశాస్త్ర ప్రొఫెసర్ రిక్ స్టాఫోర్ మాట్లాడుతూ నీటి అడుగున డేటాసెంటర్ ఏర్పాటు బహుశా ఓ మంచి ఆలోచన అని అన్నారు. సముద్రపు నీటిని ఉపయోగించి చల్లబరచడం వల్ల కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరిగినప్పటికీ అవి ఎక్కువ దూరం విస్తరించవని తెలిపారు.

## గ్రీన్‌కార్డ్ హోల్డర్లు నేరాలు చేస్తే..

# దేశ బహిష్కరణే

(మొదటి పేజీ తరువాయి)

నమోదయ్యాయి. దాంతో 2012లో అతడు చైనా నుంచి అమెరికాకు తిరిగిరాగా దేశంలోకి ప్రవేశించేందుకు అధికారులు నిరాకరించారు. తర్వాత కఠిన షరతులతో ప్రవేశానికి అనుమతించారు. తర్వాత తాను తప్పు చేసినట్లు మక్ చోయ్ అంగీకరించాడు. దాంతో అతడిని దేశం నుంచి బహిష్కించేలా ఆదేశాలు జారీ అయ్యాయి. తాను చేసిన నేరం నైతిక దుష్ప్రవర్తన కిందికి కాదని అతడు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కానీ అతడికి యూఎస్ సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది.



**ఇరాన్ యుద్ధం.. ట్రంప్‌నకు ఎదురుదెబ్బ**

ఇరాన్ యుద్ధం విషయంలో ట్రంప్‌నకు ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమాసియాలో మోహరించిన బలగాలను వెనక్కి తీసుకురావాలని, సైనిక చర్యలను ఆపివేయాలని ఆదేశించే తీర్మానికి అమెరికా సెనెట్ ఆమోదం తెలిపింది. ఈ తీర్మానానికి 50-48 ఓట్ల తేడాతో ఆమోదం లభించింది.

## ముందంజలో ఉన్నాం..

# వెనుకంజ వేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర పోలీసులకు ఆదేశాలిచ్చారు. ముఖ్యంగా దేశ వ్యాప్తంగా ఇండియా జస్టిస్ 2025 సర్వేలో ఆదర్శంగా నిలిచామని ప్రతీ ఒక్క పోలీసు గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలోని పోలీసు కమిషనర్లు, ఐజీలు, ఎస్పీలతో ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ కీలక ఆదేశాలు జారీ చేశారు. దేశ వ్యాప్తంగా ఆన్‌లైన్ ఫిర్యాదులను ఎఫ్ఐఆర్‌గా మార్చడంలో దేశ వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని, ఇదే పంతాను సాగించాలని సూచించారు. ఇతర రాష్ట్రాలలో సైబర్ క్రైమ్‌లపై ఆన్‌లైన్ పిటిషన్లను స్వీకరించినప్పటికీ, నేరాలను నియంత్రించడం, బాధితులకు న్యాయం చేయడంలో తెలంగాణ పోలీసులు అన్ని రాష్ట్రాల కన్నా ముందంజలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో నేర నిరోధంలో పటిష్టమైన విధానాన్ని అమలుచేస్తున్నామని, ప్రతి ఉల్లంఘనను రికార్డులోకి తీసుకు రావాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర పోలీసులు అన్ని అన్నింటిపై ఎఫ్ఐ ఆర్ నమోదును చేయాలని ఆదేశాలిచ్చారు. దేశం మొత్తంలో ఆదర్శంగా నిలిచిన తెలంగాణ పోలీసులు మరింత భాధ్యతతోఅద్భుతమైన ఫలితాలు సాధించాలన్నారు.'ముఖ్యంగా తీవ్ర నేరాల కట్టడిలో రాష్ట్ర పోలీసులుసరికొత్త వ్యూహాలను అమలు చేయాలని, నిందితులకు శిక్షణ పడేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ నేపథ్యంలో నేరాలపై కేసులు నమోదు చేసి సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టడంలో రాష్ట్ర పోలీసు శాఖ నిబద్ధత, అమలు చేస్తున్న విధానాలు దేశవ్యాప్తంగా ఆదర్శ నీయంగా మారాయన్నారు. అనేక రాష్ట్రాలు తెలంగాణ పోలీసుల సొమ్మును త్వరితగతిన రికవరీ చేసి వారికి అందించాలన్నారు. నేరాలపై వెంటనే స్పందించి కీలక ఆధారాలు సేకరించడం వల్ల నేరస్థులను న్యాయస్థాన పరిధిలోకి తీసుకొచ్చే అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో సైబర్ నేరాలు అధికంగా నమోద వుతున్నాయని, జార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్కు చెందిన సైబర్ నేరస్థులు సైబర్ నేరాలే లక్ష్యంగా చేసుకొని పనిచేస్తు న్నారని డీజీపీ పేర్కొన్నారు. పోలీసు ఏజెన్సీలు, స్టేక్ హోల్డర్లు మధ్య సైబర్ క్రైమ్ నివారణ, గుర్తింపు ప్రయత్నాలను సమన్వయం చేసేందుకై భారత ప్రభుత్వ హోమ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా ఇండియన్ సైబర్ క్రైమ్స్ కోఆర్డినేషన్ సెంటర్నిఏర్పాటు చేసిందని వివరించారు.

**రికవరీలో అత్యుత్తమం:**

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ, సైబర్ క్రైం పోలీసులు కలిసి సైబర్ నేరాలలో 37శాతం రికవరీతో దేశంలోనే అత్యుత్తమంగా నిలిచారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ పోలీస్ స్టేషన్‌లో సైబర్ బాధితులకు భరోసా కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల ఎస్పీలకు సూచిం చారు. ముఖ్యంగా లోన్ యాప్స్, లాటరీ మోసాలు, ఆధార్ఎనేబుల్ పేమెంట్స్ మోసాలు, చెల్లింపు మోసాలు తదితర దేశవ్యాప్త సైబర్ క్రైమ్ నెట్‌వర్క్‌లను గుర్తించడంతో పాటు వీటిని ఛేదించడంలో రాష్ట్ర పోలీసులు అగ్రస్థానంలో ఉన్నారన్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా నమోదైన వేలాది కేసులకు సంబంధించిన లింక్‌లను రాష్ట్ర పోలీసులు ఛేదించారని, సైబర్ క్రైమ్‌లు, నేరస్థులను ట్రాక్ చేయడానికి రాష్ట్ర పోలీసులు ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన సైక్యాప్స్ సత్ఫలి తాలను



విధి విధానాలను రోల్ మాడల్‌గా తీసుకుని పనిచేస్తున్నాయని వివరించారు.

**సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ :**

రాష్ట్రంలో నేరాల నియంత్రణకు సరికొత్త వ్యూహాల రూపొందించాలని, ముఖ్యంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు పెద్ద పీట వేయాలని రాష్ట్ర పోలీసు అధికారులకు డీజీపీ సూచించారు. స్మార్ట్ పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, ఇటీవల అనూహ్యంగా పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలను నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపాలన్నారు. . సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వైట్ కాలర్ నేరాలకు పాల్పడుతున్న వారిపై నిఘా సారించడంతో పాటు గతంలో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడిన వారి డేటాను పూర్తిస్థాయిలో సేకరించాలని ఆదేశించారు. రాష్ట్రంలో గతంలో తీవ్ర నేరాలకు పాల్పడిన వారు ప్రస్తుతం ఎక్కడున్నారన్న సమాచారం సేకరించాలని, రాష్ట్రంలో నేరాలు చేసేందుకు నేరస్తులు భయపడాలని, ఇందులో భాగంగా నేరం చేసిన నిందితులకు శిక్షపడేంతవరకు పోలీసులు వెంటపడాలని ఆదేశాలిచ్చారు.

**పనితీరుపై సమీక్ష :**

రాష్ట్రంలో సైబర్ నేరాలకు సంబంధించి కేసుల నమోదు, పోలీసుల పనితీరును కేంద్ర హోం శాఖ సైతం క్రమం తప్పకుండాఎప్పటికప్పుడు సమీక్షిస్తోందన్న విషయాన్ని రాష్ట్ర పోలీసులు గుర్తుంచుకోవాలని డీజీపీ సూచించారు. ఆన్‌లైన్ ఫిర్యాదులను ఎఫ్ఐఆర్ లుగా మార్చడంతో పాటు బాధితుల ఇస్తోందన్నారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను దేశంలోని 25 రాష్ట్రాలు ఉపయోగిస్తున్నాయని, ఐటి సైక్యాప్స్ అప్లికేషన్‌కు తెలంగాణ పోలీసు శాఖకు కేంద్ర ప్రభుత్వం మొదటి బహుమతిని అందించిందని డీజీపీ గుర్తుచేశారు. సైబర్ నేరాలలో బాధితులకు ఊరట కలిగేలా రాష్ట్ర పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని డీజీపీ ఆదేశాలిచ్చారు.

**ఓఈలపై ప్రత్యేక దృష్టి :**

రాష్ట్రంలో చోటు చేసుకున్న తీవ్ర, కీలక కేసులకు సంబంధించి(ఓఈ) ఓరల్ ఎంక్వయిరీలను త్వరగా పూర్తి చేయాలని డీజీపీ రాష్ట్ర పోలీసులకు సూచించారు. గంజాయి రవాణా చేసే, విక్రయించే వ్యక్తులపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి, ఎక్కడికక్కడ కేసులు నమోదు చేసి సమూలంగా నిర్మూలించాలన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి రివార్డులు, అవార్డులు అందజేస్తామని స్పష్టంచేశారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. పోక్సో ఎస్సీ ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులోఛార్జ్ షీట్ దాఖలు చేయాలని, ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండడంతో పాటు పూర్తి పారదర్శకంగా కేసును ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు చేయాలి తద్వారా చట్టపరిధిలో నిందితులకి కఠినమైన శిక్షలు పడేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో తరచూ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే వారిని గుర్తించడంతో పాటు డేటా సేకరించి వారి కదలికలపై నిఘా సారించాలన్నారు.

# ఎటువంటి అణు తనిఖీలు లేవు: ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించిన తర్వాత అణు తనిఖీల విషయంలో ఓ నిర్ణయానికి వస్తామన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. టెహ్రాన్‌లోని అణు శుద్ధి కేంద్రాలను తప్పకుండా తమ బృందం సందర్శిస్తుందని ఐక్యరాజ్యసమితి అణు సంస్థ అధిపతి బుధవారం వెల్లడించారు. అయితే, అవి రేపు జరుగుతాయా? మరో వారం రోజుల్లోనా అనేది ముఖ్యం కాదని పేర్కొన్నారు. మరోవైపు, తాము చేసుకున్న ఒప్పందానికి ఇరాన్ కట్టుబడి ఉందో, లేదో ధ్రువీకరించేందుకు అణు తనిఖీ అధికారులు ఇరాన్‌ను సందర్శిస్తారని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇప్పటికే వెల్లడించారు.

# ఇరాన్‌కు ప్రయాణం వద్దు : భారత్ అడ్వైజరీ



(మొదటి పేజీ తరువాయి)

సూచించింది. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ''ఇరాన్‌లోని భద్రతా పరిస్థితులను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఇక్కడ సానుకూల పరిణామాలు నెలకొంటున్నాయి. అయినప్పటికీ ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నాం. స్థానిక పరిస్థితులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు అధికారులు జారీ చేసే సూచనలను కచ్చితంగా పాటించాలి. ఇక, తదుపరి నోటీసులు ఇచ్చేంతవరకు ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు చేయొద్దు. అనివార్య కారణాల వల్ల ఈ దేశానికి రావాలనుకునేవారు ఎంబసీ అధికారులను సంప్రదించి మీ వివరాలను నమోదు చేసుకోండి. ఎంబసీ సోషల్ మీడియా ఖాతాలు, అధికారిక వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు ఫాలో అవుతూ ఉండండి'' అని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం ముగింపునకు సంతకాలు జరిగినప్పటికీ హర్మూజ్ నిర్వహణ, అణు కేంద్రాల పరిశీలన వంటి అంశాల్లో రెండు దేశాల మధ్య భేదాభిప్రాయాలు నెలకొన్నాయి. బాంబు దాడుల్లో దెబ్బతిన్న అణు కేంద్రాల్లో తనిఖీల కోసం అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఏఈఏ) ఇన్స్పెక్టర్లను అనుమతించేందుకు ఇరాన్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఆయన ప్రకటనను ఇరాన్ ఖండించింది. మరోవైపు, హర్మూజ్‌ను మూసేశామని టెహ్రాన్ చెబుతుండగా అది తెరిచే ఉందని అమెరికా అంటోంది. ఈ గందరగోళం నడుమ పశ్చిమాసియాలో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అందువల్ల భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలని భారత దౌత్య కార్యాలయం పేర్కొంది.

# నేడు హోసపేటకు సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభోత్సవంలో సీఎం పాల్గొంటారు. అనంతరం మునిరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే ప్రజా సభకు సీఎం రేవంత్ హాజరవుతారు.

సీఎం రేవంత్‌తో లంబాడి, ఎరుకల, యానాది ప్రతినిధుల భేటీ సీఎం రేవంత్‌తో లంబాడి, ఎరుకల, యానాది తెగల రిజర్వేషన్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ తెగల రిజర్వేషన్ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా గురువారం నుంచి ఆ వర్గాల కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల బస్సు యాత్ర జరుగనుంది. ఈమేరకు ఆ సంఘాల ప్రతినిధులు ఎంపీ బలరామ్‌నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, ఎంఎల్ఏ బాలు నాయక్, ఎంఎస్సీ శంకర్ నాయక్, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ సీఎం రేవంత్‌ను కలిసి బస్సు యాత్ర ఉద్దేశాన్ని వివరించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌కు హైకోర్టులో ఊరట

(మొదటి పేజీ తరువాయి)

మల్కాజిగిరి ఎంపీ, పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి కమలాపూర్‌లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అయితే కోవిడ్-19 సమయంలో నిబంధనలను ఉల్లంఘించి, అనుమతించిన దానికంటే ఎక్కువ మందితో సభ నిర్వహించారనే ఆరోపణలతో స్థానిక కమలాపూర్ పోలీసులు రేవంత్‌రెడ్డిపై ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై హైకోర్టులో సుదీర్ఘంగా విచారణ జరిగింది. కోర్టులో రేవంత్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టులో తమ వాదనలు వినిపిస్తూ.. ప్రచార సమయంలో తన క్లయింట్ అన్ని రకాల జాగ్రత్తలు పాటించారని, రాజకీయంగా ఇబ్బందులకు గురిచేయాలనే దురుద్దేశంతోనే నాటి ప్రభుత్వం ఈ కేసులను నమోదు చేయించిందని కోర్టుకు వివరించారు. వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం రేవంత్ రెడ్డి ఎలాంటి తప్పు చేయలేదని స్పష్టం చేస్తూ ఆయనపై ఉన్న కేసును పూర్తిగా కొట్టేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# తెలంగాణ ఆత్మను ప్రతిబింబించేలా బోనాలు





(మొదటి పేజీ తరువాయి)

సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతున్నదని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. లండన్ పర్యటనలో ఉన్న మంత్రి సురేఖ బుధవారం జూమ్ వేదికగా ఎంసిఆర్ హెచ్ఆర్‌డిలో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొని ఏర్పాట్లపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ ఏడాది ఆషాఢ జాతర ఉత్సవాలు జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని దేవాలయాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు సౌకర్యాల కల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బోనాల ఉత్సవాలకు శ్రీకారం చుట్టే గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి దేవాలయంలో జూలై 16న ప్రారంభమయ్యే ఉత్సవాలు ఆగస్టు 13 వరకు అట్టహాసంగా నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఘటోత్సవాలు, బోనాల సమర్పణ, సాక సమర్పణ, తొట్టెల ఊరేగింపులు, పోతురాజుల వీరంగాలు, రంగం కార్యక్రమాలు,గావుపట్టడం, సాగనంపు వంటి సంప్రదాయ కార్యక్రమాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రభుత్వం నిష్ఠతో కార్యాచరణను అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు.ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ ఉచిత బస్సు ద్వారా బోనాల ఉత్సవాలు జరిగే ప్రాంతాలకు రాష్ట్రం నలుమూలల నుంచి తాకిడి వుండే పరిస్థితుల నేపథ్యంలో ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను కేటాయించినందుకు సీఎంకు మంత్రి సురేఖ ధన్యవాదాలు తెలిపారు.

# నేటి నుంచి 'సర్'

(మొదటి పేజీ తరువాయి)

కల్పించారు. ఓఆర్ఆర్ లోపల ఉండే రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్గిరి నియోజకవర్గాల్లోని ఓటర్ల సమగ్ర సర్వేకు ఆ జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బీఎల్‌వో, బీఎల్ఏలకు శిక్షణ ఇచ్చారు. అయితే తన ఓటు ఎక్కడ ఉంచుకోవాలనేది పూర్తి స్వేచ్ఛ ఓటరుకే ఉందని, అక్కడ మాత్రమే ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వాల్సి ఉందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో చాలా మంది ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఉన్న వారు ఇంతకు ముందు ఓటు హక్కు వినియోగించుకున్న ప్రాంతంలోనే ఎన్యూమరేషన్ చేసుకోవాలి. తుది ఓటరు జాబితాలో వారి పేరు వచ్చాక ఒక వేళ హైదరాబాద్లో ఓటు వేయాలంటే ట్రాన్స్ ఫర్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు. నేటి నుంచి 'సర్' ప్రక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ కూడా అప్రమత్తమయ్యాయి. ముఖ్యంగా తమ పార్టీకి చెందిన కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లు గల్లంతుకాకుండా ఇప్పటికే అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాయి.




# సమాజంలో మార్పు తెచ్చేందుకే విద్యాశాఖను ఎంచుకున్నా!

- మోపిదేవి హైస్కూలు నూతన భవనాల ప్రారంభోత్సవంలో విద్యా శాఖ మంత్రి లోకేష్

(కొక్కిలిగడ్డ (అవనిగడ్డ): జూన్ 24, మనం న్యూస్): సమాజంలో మార్పు తెచ్చేందుకే నేను అత్యంత కఠినమైన విద్యాశాఖను ఎంచుకున్నాను. దీనిని నేను ఛాలెంజ్ గా స్వీకరించాను. విద్యావ్యవస్థలో మార్పు తేవడం ఉపాధ్యాయుల సహకారంతోనే సాధ్యమవుతుంది. దేశంలోనే ఆదర్శవంతంగా ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తీసుకురావాలన్నది నా ధ్యేయం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమవుతుందని రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టిజిఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో పి4 పథకంలో భాగంగా దాతల సహకారంతో రూ.1.4కోట్లతో నూతనంగా నిర్మించిన జెడ్పీ హైస్కూలు నూతన భవనాలను బుధవారం ఉదయం మంత్రి లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ కొక్కిలిగడ్డ హైస్కూలు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ... గత రెండేళ్లలో విద్యావ్యవస్థలో సంస్కరణలన్నీ పూర్తి చేశాం, ఇక ఉపాధ్యాయులంతా పూర్తిగా ఫలితాలపైనే శ్రద్ధ వహించాలని సూచించారు. నేను విద్యామంత్రిగా బాధ్యతలు చేపట్టాక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాం. రాష్ట్రవ్యాప్తంగా హార్డ్ వేర్ (ఇన్‌ఫ్రా) మెరుగైంది, సాఫ్ట్ వేర్ (లెర్నింగ్ అవుట్ కమ్స్) మెరుగు పర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది.

కొక్కిలిగడ్డ హైస్కూలులో లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ తప్ప అన్ని సౌకర్యాలు కల్పించాం. అభ్యసనా ఫలితాల మెరుగుదలపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి. ఫార్మేటివ్, సమ్మేటివ్ టెస్ట్ ఫలితాల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాన్ని మెరుగుపర్చాలి. వెనుకబడిన విద్యార్థుల పనితీరును మెరుగుపర్చేందుకు బ్రిడ్జి కోర్సు మెటీరియల్ ను అందజేస్తాం. వివిధ తరగతుల్లో వెనుకబడిన పిల్లలు ఏ సబ్జెక్టుల్లో బలహీనంగా ఉన్నారో తెలుసుకొని, అటువంటి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టండి. నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు.

## సైబర్ ముఠా గుట్టు రట్టు

# లాభాల ఆశలో మోసాలు

### ఇద్దరు నిందితుల అరెస్ట్

**హైదరాబాద్,జూన్ 24(మనం,ప్రత్యేక ప్రతినిధి):** హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ ముఠా రట్టు చేశారు. ఓ బాధితుడి నుంచి రూ.1.22 కోట్లు నొక్కేసిన కేసులో దేశవ్యాప్తంగా మ్యూల్ ఖాతాలను నిర్వహిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. సైబర్ నేరగాళ్లు ముందుగా బాధితుడిని ఓ నకిలీ వాట్సాప్ ట్రేడింగ్ గ్రూప్‌లో సభ్యునిగా చేర్చారు. అందులో స్టాక్ మార్కెట్, ఐపీవోలలో పెట్టుబడులు పెడితే ఊహించని లాభాలు వస్తాయంటూ నమ్మించారు. ఇందతా నిజమేనని నమ్మిన బాధితుడు, నిందితులు సూచించిన నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్‌లో తన పేరును రిజిస్టర్ చేసుకుని, విడతల వారీగా మొత్తం రూ.1.22 కోట్లు పెట్టుబడి పెట్టాడు.

**లాభాల పేరిట బురిడీ :**

సైబర్ కేటుగాళ్లు తమ నకిలీ వెబ్‌సైట్‌లో ఫేక్ డేటాతో బురిడీ కొట్టించారు. బాధితుడు పెట్టిన రూ.1.22 కోట్ల పెట్టుబడికి ఏకంగా రూ.15.69 కోట్ల లాభం వచ్చినట్లుగా స్క్రీన్‌పై కనిపించేలా చేశారు. అయితే ఆ డబ్బును విత్‌డ్రా చేసుకునేందుకు బాధితుడు ప్రయత్నించగా మరో కొత్త నాటకానికి తెరలేపారు. ఓ ప్రముఖ కంపెనీ ఐపీవో విడుదలవుతోందని, దానిని సబ్‌స్క్రైబ్ చేయాలంటే అదనంగా మరో రూ.35 లక్షలు కట్టాలంటూ డిమాండ్ చేశారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.దీంతో రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ బృందం టెక్నికల్ ఆధారాల సాయంతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుంది. విచారణలో భాగంగా సైబర్ నేరాల ద్వారా వచ్చే బ్లాక్ మనీని దారి మళ్లించేందుకు గాను భారీ ఎత్తున మ్యూల్ బ్యాంక్ ఖాతాల నెట్‌వర్క్ నడుపుతున్నట్లుగా వెల్లడైంది. ఈక్రమంలో నిందితులు వాడిన బ్యాంక్ ఖాతాలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో నమోదైన దాదాపు 44 సైబర్ కేసులతో సంబంధాలు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. నకిలీ ట్రేడింగ్ లింకులు, వాట్సాప్ గ్రూపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

# జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటుతాం



- టీఆర్ఎఫ్ చీఫ్ కవిత

**హైదరాబాద్,జూన్ 24(మనం,ప్రత్యేక ప్రతినిధి):** వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటి ఆ తర్వాత ఖైరతాబాద్ అసెంబ్లీ సీటును గెలుచుకుంటామని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఎంఎస్ మక్తాలో బుధవారం టీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు రాజ్‌భవన్ ఎదురుగా గల రైల్వే గేట్ నుంచి జెండా గద్దె వరకు పాదయాత్ర నిర్వహించి బస్తీలోని ప్రజలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తమ పార్టీ అత్యంత పేదల పక్షాన పోరాడుతుందన్నారు.

తెలంగాణ వచ్చిన 12 ఏళ్ల తర్వాత కూడా ఎంఎస్ మక్తా వాసులకు ఇండ్ల పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు, డ్రెయినేజీలు ఇతర అనేక సమస్యలతో ఇక్కడి ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. టీఆర్ఎస్ ద్వారానే ఈ ప్రాంత ప్రజల సమస్యలు తీరుతాయన్నారు. సాంప్రదాయ పార్టీల మాదిరిగా కాకుండా ప్రజల్లో ఉండి వారికోసం పనిచేయాలని టీఆర్ఎస్ నాయకులకు కవిత సూచించారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాల సాధన కోసం జూలై 2న ఉప్పల్ భగాయత్లో చేపట్టనున్న భూపోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే.. తెలంగాణ బిడ్డలకే ఉద్యోగాలు దక్కాలన్న రాష్ట్ర స్థానికత అంశంపై మళ్లీ కుట్రలు మొదలయ్యాయని అన్నారు. తెలంగాణలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఇక్కడ చదివిన వారినే రాష్ట్ర స్థానికులుగా గుర్తించాల్సి ఉన్నదన్నారు. దానికి విరుద్ధంగా ప్రొఫెషనల్ కోర్సులు ఇక్కడ చదివిన వారిని సైతం స్థానికులుగా పరిగణించాలన్న హైకోర్టు తీర్పు తెలంగాణ బిడ్డలను కలచి వేసిందన్నారు. హైకోర్టు తీర్పుపై లీగల్ ఫైట్ చేయబోతున్నట్లు తెలిపారు. స్థానికత, తెలంగాణ ప్రజల హక్కుల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

**మహిళలకు అవకాశాలు :**

సమర్థత, కష్టపడి పనిచేసే మహిళలకు సరైన అవకాశాలు రావడం లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో వెటా ఇండియా బుధవారం ఏర్పాటు చేసిన మహిళ సాధికారిత సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఈ ప్రపంచమే మహిళకు వ్యతిరేకంగా ఉన్నదన్నారు. ఇప్పటికీ తెలంగాణలో 15-19 ఏళ్ల వయసులోనే తల్లయిన మహిళల సంఖ్య 7.2 శాతంగా ఉన్నదని చెప్పారు. హైదరాబాద్ లాంటి ప్రాంతంలోనూ టీనేజ్ మదర్స్ సంఖ్య 2.7 శాతమన్నారు. లక్ష్య సాధన విషయంలో ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే మీ మాట మీరే వినవద్దని చెప్పారు. అలాగే.. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన బీజేపీ నాయకుడు నెమలికొండ వేణుమాధవ్ తన అనుచరులతో కలిసి బుధవారం తెలంగాణ రక్షణ సేనలో చేరారు.

## అవాస్తవాలు నమ్మకండి.

### మీడియాలో వస్తున్న వార్తలు అబద్ధం.

### వైటీపీఎస్ యాజమాన్యం స్పష్టీకరణ

**హైదరాబాద్,జూన్24(మనం న్యూస్):** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్,కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ పనులను ప్రైవేటికరిస్తున్నారంటు కొన్ని మీడీయా సంస్థలు ప్రచారంచేస్తున్నా వార్తల్లో ఎలాంటి నిజం లేదని వైటీపీఎస్ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. థర్మల్ విద్యుత్ కేంద్రాలలో కొన్ని ఆపరేషన్,మెయింటనెన్స్ పనులను ఔట్‌సోర్సింగ్ ద్వారా నిర్వహించటం కొత్తేమి కాదని ఇది దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థలు అనుసరిస్తున్న విదానమేనని అందులో పేర్కొంది. యాష్ హ్యాండ్లింగ్,కోల్ హ్యాండ్లింగ్ విభాగాలకు సంబంధించిన పనులను గతంలోనే గుత్తేదారులకు అప్పగించినట్టు వివరించారు. కొన్ని పనులను మాత్రమే ఔట్‌సోర్సింగ్ ద్వారా నిర్వహించటం థర్మల్ విద్యుత్ కేంద్రాలలో సాధారణంగా అమలులో ఉన్న విధానమే తప్ప విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు ఇది ఎట్టి పరిస్తితుల్లోనూ సంకేతం కాదని స్పష్టంచేశారు.

ఈ నేపథ్యంలో సంస్థలోని ఉద్యోగులు, ప్రజలు పుకార్లను నమ్మవద్దని ప్రకటనలో వైటీపీఎస్ యాజమాన్యం పేర్కొంది.

# 'బాస్ స్కామ్'మోసాలపై జాగ్రత్త

### రాష్ట్ర సైబర్ బ్యూరో హెచ్చరిక

### వాట్సాప్, ఈమెయిల్‌లో కొత్త మోసం

### ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులే టార్గెట్

### దేశవ్యాప్తంగా 20 రోజుల్లోనే 300 కేసులు




**హైదరాబాద్,జూన్ 24(మనం,ప్రత్యేక ప్రతినిధి):** సైబర్ నేరగాళ్లు మోసాలకు కొత్త దారులు వెతుక్కుంటున్నారు. తాజాగా 'బాస్ స్కామ్', 'సీఈవో ఇంపర్సొనేషన్ ఫ్రాడ్' పేరుతో సరికొత్త సైబర్ మోసాలకు తెగబడుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరికలు జారీ చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, వ్యాపార యజమానులు, పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఈ మేరకు టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ జారీ చేసిన సూచనల ప్రకారం, సైబర్ నేరగాళ్లు ఉన్నతాధికారులు, వ్యాపార యజమానులను లక్ష్యంగా చేసుకుని ఈ మోసాలకు పాల్పడుతున్నారని శిఖా గోయల్ తెలిపారు. అత్యవసర పనుల పేరుతో ఈమెయిల్, వాట్సాప్ ద్వారా మాల్వేర్ ఉన్న ఫైల్స్ పంపిస్తున్నారని వివరించారు.

దేశవ్యాప్తంగా కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఇలాంటి మోసాలకు సంబంధించి 300కు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయని, ఇది పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని ఆమె పేర్కొన్నారు. ఈక్రమంలో మోసగాళ్లు అత్యవసర డాక్యుమెంట్లుగా పంపిస్తారని, వాటిని ఓపెన్ చేయగానే బాధితుల ఫోన్, ́ంప్యూటర్‌లో మాల్వేర్ ఇన్‌స్టాల్ అవుతుందని ఆమె వివరించారు. దీని ద్వారా వాట్సాప్ వెబ్ సెషన్లు, ఇతర సమాచారాన్ని దొంగిలించి, బాధితుల పైఅధికారిలా నటిస్తూ ఉద్యోగులకు, ఆర్థిక వ్యవహారాలు చూసే సిబ్బందికి సందేశాలు పంపుతారని తెలిపారు. అత్యవసరంగా డబ్బు బదిలీ చేయాలని, రహస్య సమాచారం ఇవ్వాలని ఒత్తిడి చేస్తారన్నారు. అనుమానాస్పద ఫైల్స్, 'అత్యవసరంగా స్పందించాలి' వంటి సందేశాలను నమ్మవద్దని అధికారులు సూచిస్తున్నారు. డబ్బుకు సంబంధించిన అభ్యర్థనలు వస్తే, నేరుగా ఫోన్ చేసి నిర్ధారించుకోవాలని, 'బాస్ స్కామ్' అని అనుమానం వస్తే ఫిర్యాదు చేయాలని శిఖా గోయల్ కోరారు.

## ప్రైవేట్ 'సెక్యూరిటీ'పై పోలీసు నజర్

### 7 సెక్యూరిటీ ఏజెన్సీలపై కేసులు నమోదు

**హైదరాబాద్, జూన్ 24(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలపై పోలీసులు నిఘా సారించారు. ఈక్రమంలో ఏలాంటి అనుమతి లేకుండా సెక్యూరిటీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏడు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలపై కేసులు నమోదు చేశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సెక్యూరిటీ సంస్థల నిర్వహణపై పోలీసు బాసులు సమీక్ష నిర్వహించిన విషయం విదితమే. ముఖ్యంగా పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలలో పనిచేసే ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల అనుమతులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఇంటెలిజెన్స్ ఏడీజీ విజయ్ కుమార్ ఆదేశించారు. దీంతో కరీంనగర్ పోలీసులు తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న ఏడు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలపై కేసులు నమోదు చేశారు.సదరు ఏజెన్సీలకు ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ, సంతృప్తికరమైన వివరణ అందించకపోవడంతో కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 318(4)తో పాటు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల నియంత్రణ చట్టం 2005లోని సెక్షన్ 20, 22 కింద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఏడీజీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు ఓఎస్డీ వి.బి. కమలాసన్ రెడ్డి తెలిపారు. పీఎస్ఏఆర్ఏ లైసెన్స్ లేకుండా ఏజెన్సీలు నిర్వహించడం చట్టవిరుద్ధమని, నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులపై ఏడాది వరకు జైలు శిక్ష లేదా రూ.25 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.భద్రతా సిబ్బందిని నియమించుకునే ముందు తప్పనిసరిగా పోలీస్ వెరిఫికేషన్ చేయించడంతో పాటు, వారికి కనీసం 21 రోజుల ప్రాథమిక భద్రతా శిక్షణ అందించిన తర్వాతే విధుల్లోకి తీసుకోవాలని సూచించారు. అలాగే వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థల యజమానులు ప్రభుత్వం గుర్తింపు పొందిన, చెల్లుబాటు అయ్యే విధంగా పీఎస్ఏఆర్ఏ లైసెన్స్ కలిగిన ఏజెన్సీల నుంచే భద్రతా సేవలను పొందాలని వివరించారు.

## రూ.3 కోట్లతో నిర్మించిన విద్యాసంస్థ ప్రారంభం

**చిన్నగొట్టిగల్లు జూన్24మనంన్యూస్:** చిన్నగొట్టిగల్లు మండలంలో విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా ఇంచార్జి మంత్రి, రెవిన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు మండలంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన వి.సిద్ధ రామి రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమల్ల ప్రసాద్ రావు, చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని, పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి లతో కలసి జిల్లా ఇంచార్జి మంత్రి, రెవిన్యూ, రిజిస్ట్రేషన్ ,స్టాంప్స్ శాఖ మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారభించారు.

ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి, రెవిన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి మాట్లాడుతూ.... చిన్నగొట్టిగల్లు మండలంలో విద్యా, సామాజిక అభివృద్ధి కోసం సేవా కార్యక్రమాలు చేపడుతున్న దాతలు, ప్రజాప్రతినిధులను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అభినందించారు. తాము పుట్టి పెరిగిన ప్రాంతాల అభివృద్ధికి ముందుకు వస్తున్న దాతల సేవా భావం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు ఊరట

### కండీషన్ బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు

**హైదరాబాద్,జూన్ 24(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** సింగరేణి సంస్థ, యాజమాన్యంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు హైకోర్టులో ఊరట లభించింది. గతంలో ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీయడంతో సింగరేణి యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమన్‌పై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసుపై విచారణ జరిపిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం బాల్క సుమన్‌కు రూ. 25 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు, ఇద్దరి పూచీకత్తు సమర్పించారు. అలాగే కోర్టు విధించిన నిబంధనలకు కట్టుబడి ఉండాలని, దర్యాప్తునకు సహకరించాలని ఆదేశాలలో పేర్కొంది. గత నెలలో బీఆర్ఎస్ నేతలతో జరిగిన ఓ సమావేశంలో బాల్క సుమన్ నిరసనలు తెలిపేందుకు కార్మికులు, రైతులు రావడంలేదని అవసరమైతే బీఆర్ఎస్ కార్యకర్తలు మిలిటెంట్ తరహా దాడులు చేయాలని పిలుపునిచ్చారు. దీంతో అతనిపై దేశద్రోహంతో పాటు పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో బల్కాసుమన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు చంచల్ గూడ జైలుకు తరలించారు. జైల్లో దాదాపు 25 రోజుల పాటు ఉన్న బల్కాసుమన్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించడంతో ఆయనకు కండీషన్ బెయిల్ లభించింది.

# సారథ్య ఆలోచన... సరికొత్త ఆదాయం




### వ్యాపార విస్తరణకు టీజీఎస్ఆర్టీసీ 'గోల్డెన్ ఛాన్స్'

### అద్దెకు ఖాళీ ఆర్టీసీ కమర్షియల్ కాంప్లెక్స్‌లు

### 'టీజీఎస్ ఆర్టీసీతో చేతులు కలపండి, మీ వ్యాపారాన్ని పెంచుకోండి : ఎండీ వై.నాగిరెడ్డి'

**హైదరాబాద్,జూన్24(మనం న్యూస్):** ఎప్పటికప్పుడు సరికొత్త ప్రయాణ అనుభూతులతో దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, ఇప్పుడు వ్యాపార రంగంలోనూ సరికొత్త వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టింది. కేవలం ప్రయాణికులను చేరవేయడమే కాకుండా, సంస్థ పరిధిలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆదాయాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది.ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ వ్యాపార సముదాయాలను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు సంస్థ సిద్ధమైంది. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి, తమ సంస్థలను విస్తరించుకోవాలనుకునే వారికి ఇది ఒక సధావకాశంగా నిలవనుంది.

**ప్రజాక్షేత్రంలో వ్యాపార సామ్రాజ్యం:**

సాధారణంగా ఏ వ్యాపారానికైనా 'కస్టమర్ల రాక' అనేది అత్యంత కీలకం. ఆర్టీసీ బస్టాండ్లు,కాంప్లెక్స్‌ల నిరంతరం ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. ప్రతిరోజూ లక్షలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే ఈ ప్రాంతాల్లో వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల, ప్రచార ఖర్చులు లేకుండానే వ్యాపారస్తులకు కస్టమర్లు లభిస్తారు. హోటళ్లు, ఫుడ్ కోర్టులు, సూపర్ మార్కెట్లు, బ్రాండెడ్ షోరూమ్‌ల నుండి చిన్న తరహా దుకాణాల వరకు అన్ని రకాల వ్యాపారాలకు ఆర్టీసీ కమర్షియల్ కాంప్లెక్స్ లు అనువైన వేదికలుగా మారనున్నాయి.

**సారథ్య ఆలోచన...సరికొత్త ఆదాయం:**

సంస్థను లాభాల బాట పట్టించడంతో పాటు, స్థానిక నిరుద్యోగులకు, వ్యాపారస్తులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉన్నతాశయంతో టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. పారదర్శకమైన నిబంధనలు, లీజు పద్ధతుల ద్వారా ఈ స్థలాలను కేటాయించనున్నారు.

**వ్యాపారులకు సువర్ణావకాశం :**

తెలంగాణలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలు, డిపోల పరిధిలో ఉన్న ఈ ఖాళీ వ్యాపార సముదాయాల వివరాలను సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న 694 షాపులకు త్వరలో టెండర్లు పిలువబడుచున్నవి.టీజీఎస్ఆర్టీసీ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం అటు రవాణా సంస్థకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తూ, ఇటు వ్యాపార రంగానికి సరికొత్త ఊతాన్ని ఇస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ సువర్ణావకాశాన్ని అందుపుచ్చుకుని వ్యాపారంలో రాణించాలని సంస్థ వర్గాలు కోరుతున్నాయి.

**'ఆర్టీసీ చరిత్రలో కొత్త అధ్యయనానానికి శ్రీకారం'**

ఆర్టీసీ చరిత్రలోనే సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ, పారదర్శకతకు పెద్దపీట వేసేలా సంస్థ పరిధిలోని అన్ని వ్యాపార సముదాయాల వివరాలను యాజమాన్యం అధికారిక వెబ్సైట్లో బహిరంగపరిచింది. ఏ ఏ ప్రాంతాల్లో ఎన్ని వ్యాపార సముదాయాలు ఉన్నాయి... అవి ఖాళీగా ఉన్నాయా లేక నిండిపోయాయా, ప్రస్తుతం ఆ షాప్ లను ఎవరు నిర్వహిస్తున్నారు, వారి లీజు కాలపరిమితి మరియు అద్దె ఎంత అనే పూర్తి సమాచారాన్ని క్లియర్ కట్గా ఆన్లైన్లో అందుబాటులో ఉంచారు.

దళారీ వ్యవస్థకు పూర్తిగా చెక్ పెడుతూ, వ్యాపార ప్రకటనలు మరియు అద్దెదారుల ఎంపికలో డిజిటల్ జవాబుదారీతనాన్ని పెంచేందుకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న ఈ విప్లవాత్మక నిర్ణయం ఇప్పుడు సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. టీజీఎస్ఆర్టీసీ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం అటు రవాణా సంస్థకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తూ, ఇటు వ్యాపార రంగానికి సరికొత్త ఊతాన్ని ఇస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

**'టీజీఎస్ ఆర్టీసీతో చేతులు కలపండి, మీ వ్యాపారాన్ని పెంచుకోండి : ఎండీ వై.నాగిరెడ్డి'**

'ఆర్టీసీ స్థలాల్లో షాప్స్ నిర్వహణ ప్రక్రియను మరింత సరళతరం చేశామని, వ్యాపారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ అవకాశాన్ని వాడుకోవచ్చని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి సూచించారు. 'టీజీఎస్ ఆర్టీసీ కల్పిస్తున్న ఈ సదావకాశం వ్యాపారులకు ఎంతో లాభదాయకమని, దీనిని సద్వినియోగం చేసుకుని వ్యాపార వృద్ధిని సాధించడమే కాకుండా సంస్థ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఎండీ వై.నాగిరెడ్డి కోరారు.'

## అప్పలాయగుంటలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి

# దివ్య బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

### జూన్ 25న ధ్వజారోహణంతో వైభవోత్సవాల ప్రారంభం

### గోవింద నామస్మరణతో మారుమోగనున్న అప్పలాయగుంట



**తిరుపతి జూన్ 24.మనం న్యూస్:** అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా మేదినిపూజ నిర్వహించి, అనంతరం సేనాధిపతి ఉత్సవాన్ని చేపట్టారు.

సంప్రదాయం ప్రకారం శ్రీ విష్వక్సేనులవారు నాలుగు మాడవీధుల్లో విహరించి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించి, అన్ని కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేలా అనుగ్రహిస్తారని భక్తుల విశ్వాసం. అనంతరం యాగశాలలో అంకురార్పణ నిర్వహించి బ్రహ్మోత్సవాలకు మంగళారంభం పలికారు.జూన్ 25న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాల ప్రారంభంజూన్ 25 గురువారం ఉదయం 8.30 గంటల నుండి 9.00 గంటల మధ్య కర్కాటక లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్నారు. రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు.

దివ్య వాహనసేవలతో భక్తులకు ఆధ్యాత్మికానందంబ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు స్వామివారు వివిధ దివ్య వాహనాలపై విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు.జూన్ 25 - ధ్వజారోహణం, పెద్దశేష వాహనం,జూన్ 26 - చిన్నశేష వాహనం, హంస వాహనం,జూన్ 27 - సింహ వాహనం, ముత్యపుపందిరి వాహనం,జూన్ 28 - కల్పవృక్ష వాహనం, కల్యాణోత్సవం, సర్వభూపాల వాహనం,జూన్ 29 - మోహినీ అవతారం, గరుడ వాహనం,జూన్ 30 - హనుమంత వాహనం, గజ వాహనం,జూలై 1 - సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం,జూలై 2 - రథోత్సవం, అశ్వవాహనం,జూలై 3 - చక్రస్నానం, ధ్వజావరోహణం

బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక ప్రసంగాలు, భక్తి సంగీత కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించనున్నారు.

ఈ కార్యక్రమంలో కంకణ భట్టర్ సూర్యకుమార్ ఆచార్యులు, టిటిడి డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, వీజీవో వి.గిరిధర్, అదనపు హెల్త్ ఆఫీసర్ డా. సునీల్, ఏవీఎస్వో రాధాకృష్ణ, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

## తప్పిపోయినప్పుడు

ఎక్కడో దారి తప్పిపోయానని
అనిపించిన క్షణం
నడకను ఆపేయాల్సిందే
నువ్వు చేరుకున్న చోటు నీకు తెలియకపోవచ్చు

కానీ ఆ నేలకు నీ అడుగుల శబ్దం తెలుసు
చెట్టు నీడలో నిలబడిచూడు ఆ చెట్టుకు
నీ పేరు తెలియకపోయినా
అది నీ ఊపిరి వేడిని గుర్తిస్తుంది

గాలి మాట్లాడుతోంది విను
ఆకులు కదులుతున్నాయి అది కేవలం కదలడం
కాదు
నీ భయాన్ని మెల్లగా డస్టర్లా తుడిచేస్తున్నాయి
అడవి ఎప్పుడూ దారి తప్పదు దారి తప్పేది
మనిషే

ఎందుకంటే ప్రతి చెట్టును ఒకే చెట్టుగా
ప్రతి పక్షిని ఒకే పాటగా
ప్రతి రోజునూ ఒకే ఉదయంగా
చూడడం నేర్చుకున్నాం

నిజానికి ఏ రెండు కొమ్మలూ ఒకేలా ఉండవు
ఏ రెండు ఆకులూ ఒకేలా పచ్చదనాన్ని ధరించవు
అయితే మనమే ఎందుకు
ప్రపంచాన్ని ఒకే రంగుతో పూస్తుంటాం?

ఒక్కసారి ఆగి చూడు నీ చుట్టూ ఉన్న నిశ్శబ్దం
నీకు పరాయిది కాదు
అది నీకంటే ముందే ఇక్కడ ఉంది
నీ తర్వాత కూడా
అది ఇక్కడ ఉంటుంది

నువ్వు వెతుకుతున్న దారి
బహుశా నీ వెలుపల ఉండకపోవచ్చు
కొన్నిసార్లు మనిషి తనను
తాను వెతుక్కోవడానికి తప్పిపోవాల్సిందే

నదులు కూడా సముద్రాన్ని చేరే ముందు
ఎన్నో ఎన్నెన్నో మలుపులు తిరుగుతాయి
మేఘాలు కూడా చినుకులుగా మారే ముందు
ఎన్నో దూరాలను ఆకాశాలను దాటేవుంటాయి

అందుకే భయం వద్దు
నీ కాళ్ల కింద ఉన్న నేల నిన్ను మోస్తోంది
నీ తలపై ఉన్న ఆకాశం నిన్ను మరచిపోదు
నిశ్చలంగా ఉండు

ఈ విశ్వానికి నువ్వు కనిపిస్తూనే వున్నావు
నీ గురించి నీ కన్నా ఎక్కువగా తెలిసిన
ఒక వెలుగు ఉంది అది వస్తుంది
నిన్ను పేరు పెట్టి పిలుస్తుంది

అప్పుడు నీకు తప్పకుండా అనిపిస్తుంది
నువ్వు ఎప్పుడూ తప్పిపోలేదని
నీ ఆత్మ ..నిన్ను మళ్లీ కనుగొనడానికి
కొంత సమయం మాత్రమే తీసుకుంది

**- వారాల ఆనంద్**
9440501281

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
**manamlekhalu@gmail.com**
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

**ఈ పేపర్ కోసం**
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి

- ఎడిటర్

# నాయకులకు అధికారమే పరమావధి!?



భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ఓట్లతో ఎన్నుకోబడిన ప్రతినిధుల ద్వారా ప్రభుత్వాలు ఏర్పడతాయి. రాజ్యాంగం నిర్దేశించిన విలువలు, నియమాలకులోబడి పాలన సాగాలి. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు, అసమ్మతి స్వరాలు సహజం. పార్టీ విధానాలతో విభేదిస్తూ నాయకులు బయటకు రావడం కూడా ప్రజాస్వామ్య హక్కే. అయితే అది సిద్ధాంత పరమైన కారణాలతో కాకుండా పదవులు, అధికారాలు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం జరిగితే ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం కలుగుతుంది.

నేడు దేశ రాజకీయాల్లో సిద్ధాంతాల కంటే అధికారం ప్రధాన లక్ష్యంగా మారిన పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో ఒక పార్టీ గుర్తుపై గెలిచి, తర్వాత అధికార ప్రయోజనాల కోసం మరో పార్టీలో చేరడం ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించడమే. ప్రజలు ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, అతడు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ విధానాలను కూడా నమ్మి ఓటు వేస్తారు. అలాంటి విశ్వాసాన్ని ద్రోహం చేయడం ప్రజాస్వామ్య నైతికతకు విరుద్ధం. భారత రాజకీయ చరిత్రలో పార్టీ ఫిరాయింపులు కొత్త విషయం కాదు. స్వాతంత్ర్యం అనంతరం అనేక సందర్భాల్లో ప్రజాప్రతినిధులు తమ రాజకీయ విధేయతలను మార్చుకున్నారు. రాజకీయ విశ్లేషకుల లెక్కల ప్రకారం 1967 తర్వాత దేశవ్యాప్తంగా వేలాది మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీలు మారారు. ఇటీవల కూడా అనేక రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలు ఫిరాయింపుల కారణంగా కుప్పకూలిన సందర్భాలు చూశాం.

పిరాయింపులను అరికట్టేందుకు 1985లో రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అమల్లోకి వచ్చింది. అయితే ఈ చట్టం వ్యక్తిగత ఫిరాయింపులను కొంతవరకు అడ్డుకున్నప్పటికీ, సమూహంగా జరిగే రాజకీయ వలసలను పూర్తిగా నియంత్రించలేకపోయింది. ఫలితంగా అరుణాచల్ ప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో రాజకీయ అస్థిరత ఏర్పడింది.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీ మారిన ప్రజాప్రతినిధులపై త్వరితగతిన నిర్ణయం తీసుకునే స్వతంత్ర వ్యవస్థ అవసరమని అనేక ప్రజాస్వామ్యవాదులు సూచిస్తున్నారు. ప్రజల తీర్పును వక్రీకరించే రాజకీయ వలసలపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజలలో రాజకీయాల పట్ల నమ్మకం క్రమంగా తగ్గిపోతుంది. ప్రతి రాజకీయ పార్టీ ఒక ఆశయం, ఒక సిద్ధాంతం, ఒక సామాజిక అవసరం నుంచి పుట్టుకొస్తుంది. ప్రారంభ దశలో ప్రజలతో మమేకమై పనిచేసే నాయకత్వం కనిపిస్తుంది. కానీ కాలక్రమేణా అధికారానికి చేరువైన కొద్దీ అనేక పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది.

నిజం చెప్పే వారిని పక్కనపెట్టి, నాయకుడికి నచ్చిన మాటలు చెప్పేవారికి ప్రాధాన్యం పెరుగుతుంది. విమర్శలను ద్రోహంగా, ప్రశ్నలను తిరుగుబాటుగా చూడటం ప్రారంభమవుతుంది. క్షేత్రస్థాయి వాస్తవాలు నాయకత్వానికి చేరవు. ఫలితంగా నాయకులు భ్రమల్లో జీవిస్తారు. భారీ సభలు, ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నప్పటికీ కార్యకర్తల్లో నిరాశ పెరుగుతుంది.

వ్యక్తిపూజ పెరగడం, అవినీతి సాధారణమవడం, కష్టపడిన వారికి అవకాశాలు లేకపోవడం, మేధావులు పార్టీని వీడిపోవడం వంటి లక్షణాలు సంస్థాగత క్షీణతకు సంకేతాలు. బయటకు బలంగా కనిపించే పార్టీ లోపల నుంచి క్రమంగా బలహీనపడుతుంది. చరిత్రలో ఎన్నో శక్తివంతమైన రాజకీయ సంస్థలు ఈ కారణాల వల్లే పతనమయ్యాయి.

ఏ సంస్థైనా విమర్శలను అంగీకరించకపోతే, ఆత్మపరిశీలన చేయకపోతే, రెండోస్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించకపోతే దీర్ఘకాలం నిలబడలేక పోతుంది. ప్రజాస్వామ్య విలువలను కాపాడే బాధ్యత ముందుగా రాజకీయ పార్టీలదే.

నాయకత్వం అనేది కేవలం అధికారాన్ని అనుభవించడం కాదు. ప్రజల బాధలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలు చూపించడం. నిజమైన నాయకుడు చప్పట్లతో ఎదగడు. విమర్శల ద్వారా పరిపక్వత సాధిస్తాడు. ప్రజల సమస్యలను వినడం, భిన్నాభిప్రాయాలను గౌరవించడం, కొత్త ఆలోచనలకు స్వాగతం పలకడం నాయకత్వానికి మూల సూత్రాలు.

ప్రజాస్వామ్యానికి ప్రాణం కేవలం ఎన్నికలు కావు. ఎన్నికల తర్వాత కూడా ప్రజల గొంతుక వినిపించే అవకాశం ఉండాలి. అసమ్మతిని సహించే సంస్కృతి, పారదర్శకత, జవాబుదారీ తనం ప్రజాస్వామ్యానికి జీవం పోస్తాయి. ప్రజల తరపున నిలబడే నాయకత్వమే చరిత్రలో నిలిచిపోతుంది.

డబ్బు, అధికారం, ప్రచారం ఏ పార్టీని శాశ్వతంగా నిలబెట్టలేవు. ప్రజల నమ్మకం, కార్యకర్తల అంకితభావం, సిద్ధాంతాల పట్ల నిబద్ధత మాత్రమే రాజకీయ సంస్థలకు నిజమైన బలాలు. ప్రజలతో అనుబంధం కోల్పోయిన పార్టీలు ఎంత బలంగా కనిపించినా ఒక దశలో బలహీనపడక తప్పదు.

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు, నాయకులు ప్రజలకు సేవ చేయడానికి ఉన్న సాధనాలు మాత్రమే; ప్రజలపై ఆధిపత్యం చెలాయించడానికి కావు.

అధికారం శాశ్వతం కాదు. కానీ ప్రజల తీర్పు శాశ్వత పాఠం. సిద్ధాంతాలను తాకట్టు పెట్టి అధికారాన్ని వెంబడించే రాజకీయాలు తాత్కాలిక విజయాలను ఇవ్వొచ్చు; కానీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతాయి. విమర్శలను అంగీకరించే సంస్కృతి, అంతర్గత ప్రజాస్వామ్యం, ప్రజా బాధ్యత, నైతిక రాజకీయాలు పెరిగినప్పుడే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.

పార్టీలకు అధికారమే పరమావధి కాకుండా ప్రజాసేవే పరమ ధ్యేయంగా మారిన రోజే ప్రజాస్వామ్యం తన అసలు అర్థాన్ని సార్థకం చేసుకుంటుంది.



**- మేకిరి దామోదర్**
9573666650

# రిజర్వేషన్‌లపై దాడి?... అస్తిత్వానికి సవాళ్లు



భారత రాజ్యాంగం దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లను కేవలం సంక్షేమ పథకంగా ఇవ్వలేదు. శతాబ్దాలుగా కొనసాగిన సామాజిక అణచివేతకు చారిత్రక పరిహారంగా, సమాన అవకాశాల హక్కుగా వాటిని కల్పించింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దృష్టిలో రిజర్వేషన్ అనేది దానం కాదు; అది న్యాయం. అది కరుణ కాదు. అది రాజ్యాంగ హామీ. ఇలాంటి పరిస్థితిలో గత పదిహేనేళ్లలో జారీ చేసిన అన్ని కుల ధృవీకరణ పత్రాలను మళ్లీ పరిశీలిస్తామని ప్రకటించడం కేవలం పరిపాలనా చర్యగా చూడలేం. ఇది లక్షలాది దళిత, ఆదివాసీ, ఓబీసీ కుటుంబాల జీవితాలను ప్రభావితం చేసే కీలక రాజకీయ నిర్ణయం. నకిలీ కుల ధృవీకరణ పత్రాలను గుర్తించడం ప్రభుత్వ బాధ్యతే. కానీ నకిలీ పత్రాలను అరికట్టే పేరుతో మొత్తం సమాజాన్నే అనుమానితులుగా చూడడం ప్రజాస్వామ్య పద్ధతి కాదు. ఒక విద్యార్థి పదేళ్ల క్రితం పొందిన కుల ధృవీకరణ పత్రంతో చదువు పూర్తి చేశాడు. ఒక ఉద్యోగి ఆ ధృవీకరణ ఆధారంగా ఉద్యోగం పొందాడు. ఇప్పుడు వారందరినీ మళ్లీ తమ అస్తిత్వాన్ని నిరూపించుకోమని అడగడం అనేది కేవలం పరిపాలనా ప్రక్రియ కాదు. అది సామాజిక అవమానానికి దారితీసే ప్రమాదకర ధోరణి.



ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా పౌరసత్వం, ఓటరు జాబితాలు, జనాభా లెక్కలు, గుర్తింపు పత్రాల చుట్టూ వివిధ వివాదాలు చెలరేగాయి. ఇప్పుడు అదే తరహాలో కుల ధృవీకరణ పత్రాల అంశం ముందుకు రావడం యాదృచ్ఛికం కాదు. మార్క్సిస్టు దృక్పథంలో చూస్తే, ప్రజలను వారి వర్గ ప్రయోజనాల చుట్టూ ఐక్యం కాకుండా చేయడానికి పాలక వర్గాలు తరచుగా గుర్తింపు రాజకీయాలను ఉపయోగిస్తాయి. ఒకవైపు నిరుద్యోగం, విద్యా సంక్షోభం, ధరల పెరుగుదల వంటి సమస్యలు తీవ్రమవుతుండగా, మరోవైపు ప్రజల అస్తిత్వాన్నే ప్రశ్నించే కొత్త వివాదాలు సృష్టించబడుతున్నాయి.

దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాల రాజ్యాంగబద్ధ హక్కులను బలహీనపరచే ఏ చర్య అయినా చివరికి భారత రాజ్యాంగ స్ఫూర్తిపైనే దాడి అవుతుంది. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య ప్రతినిధిత్వం అనే మూడు స్తంభాల మీదే భారత రాజ్యాంగం నిలబడి ఉంది. రిజర్వేషన్లు ఈ మూడు లక్ష్యాల సాధనకు ప్రధాన సాధనం.

న్యాయపోరాటం నుంచి ప్రజా ఉద్యమం వరకు సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం కేవలం ఒక న్యాయపరమైన చర్య మాత్రమే కాదు. ఇది సామాజిక న్యాయాన్ని కాపాడే విస్తృత ప్రజాస్వామ్య పోరాటంలో భాగంగా చూడాలి. చరిత్ర చెబుతున్న ఒక సత్యం ఏమిటంటే-హక్కులు ఎప్పుడూ పై నుంచి బహుమతిగా రావు. అవి ప్రజల పోరాటాల ద్వారానే సాధించబడతాయి, పరిరక్షించబడతాయి.

ఈ నేపథ్యంలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. గత పదిహేనేళ్లలో జారీ చేసిన దళిత, ఆదివాసీ, ఓబీసీ కుల ధృవీకరణ పత్రాల పునః ధృవీకరణ (రీ-వెరిఫికేషన్) పేరుతో జరుగుతున్న అసాంవిధానిక చర్యలను సవాలు చేస్తూ కలకత్తా హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (WPA(P)/304/2026) దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి అభిజిత్ మజుందార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు మలయ్ తివారీ పిటిషనర్లుగా వ్యవహరిస్తున్నారు. దళిత, ఆదివాసీ, బహుజన సమాజాల రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించడమే ఈ వ్యాజ్యం లక్ష్యమని పార్టీ స్పష్టం చేసింది. నకిలీ ధృవీకరణ పత్రాలను గుర్తించడం పేరుతో నిజమైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల ప్రజలను అనుమానితులుగా ముద్ర వేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఇది సామాజిక న్యాయ సూత్రాలపై దాడి అని పిటిషన్లో పేర్కొంది. ముఖ్యంగా ఓటరు జాబితాలో పేరు ఉండటాన్ని కుల ధృవీకరణ పత్రాల చెల్లుబాటుతో అనుసంధానించడం చట్టవిరుద్ధమని వ్యాజ్యం వాదిస్తోంది.ఈ న్యాయ పోరాటం కేవలం కోర్టు గదులకే పరిమితం కాదని, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం సమాజంలోని అన్ని ప్రజాస్వామ్య శక్తులు, దళిత-ఆదివాసీ-బహుజన సంఘాలు, విద్యార్థి-యువజన ఉద్యమాలు కలిసి విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పిలుపునిస్తోంది.


దళితులు, ఆదివాసీలు, ఓబీసీల అస్తిత్వాన్ని ప్రశ్నించే ప్రతి చర్యను ప్రజాస్వామ్య శక్తులు అప్రమత్తంగా గమనించాలి. రిజర్వేషన్ అనేది కేవలం ఉద్యోగం లేదా సీటు గురించి కాదు; అది గౌరవం, ప్రతినిధిత్వం, సమానత్వం గురించి. అంబేద్కర్ కలగన్న సామాజిక ప్రజాస్వామ్యం, రాజ్యాంగం హామీ ఇచ్చిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం విలువలను కాపాడుకోవడం నేటి చారిత్రక బాధ్యత. రిజర్వేషన్ హక్కులను కాపాడటం అంటే కేవలం ఒక వర్గాన్ని కాపాడటం కాదు; భారత ప్రజాస్వామ్య ఆత్మను కాపాడటం.

**- మామిండ్ల రమేష్ రాజా**
7893230218

# వర్షపు నీటిని ఒడిసిపడితేనే భద్రత



ప్రకృతి మనకు అందించిన అమూల్యమైన వరాలలో నీరు అత్యంత ముఖ్యమైనది. నీరు లేకుండా జీవం లేదు. మానవులు, జంతువులు, పక్షులు, మొక్కలు ఇలా సమస్త జీవకోటి మనుగడకు నీరే ఆధారం. అయితే నేడు ప్రపంచవ్యాప్తంగా తాగునీటి కొరత, భూగర్భ జలాల తగ్గుదల, వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వంటి సమస్యలు మానవాళిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం చేయగలిగే అత్యంత సులభమైన మరియు సమర్థవంతమైన పని వర్షపు నీటిని ఒడిసిపట్టడం. వర్షాకాలం ప్రకృతి ప్రసాదించే అమూల్యమైన సమయం. ఈ వర్షాకాలంలో కురిసే ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోగలిగితే భవిష్యత్తులో తాగునీటి సమస్యలను అధిగమించవచ్చు. ప్రస్తుతం పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా వర్షపు నీరు ఎక్కువగా కాలువల ద్వారా వృథాగా నదులు, సముద్రాలలో కలిసిపోతోంది. ప్రతి సంవత్సరం వర్షపాతం తగ్గడం, అసమానంగా కురవడం, అటవీ నిర్మూలన, అధికంగా బోర్లు వేయడం వంటి కారణాల వల్ల భూగర్భ జలాల మట్టాలు క్రమంగా పడిపోతున్నాయి. ఫలితంగా వేసవికాలంలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు సాగునీటి కొరతతో పంటలను కోల్పోతున్నారు. వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి బావులు, బోర్లు ఎండిపోకుండా ఉంటాయి. వర్షాకాలానికి ముందు చెరువులను శుభ్రపరచి, పూడిక తొలగించి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచితే భారీగా వర్షపు నీటిని నిల్వ చేసుకోవచ్చు. అలాగే పొలాల్లో చిన్న చిన్న గుంతలు, కందకాలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీరు పొలంలోనే నిలిచి భూమిలోకి ఇంకే అవకాశం ఉంటుంది. ఇది భూసారాన్ని కూడా కాపాడుతుంది. వర్షాకాలం మొక్కలు నాటడానికి అత్యంత అనుకూలమైన సమయం. ఈ కాలంలో నాటిన మొక్కలు సులభంగా భూమిలో స్థిరపడతాయి. మొక్కలు పెరిగి చెట్లుగా మారినప్పుడు వాతావరణంలో తేమను పెంచి వర్షాలను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకుంటే కొద్ది సంవత్సరాల్లోనే పచ్చదనం పెరిగి పర్యావరణ సమతుల్యత మెరుగుపడుతుంది. రైతులు పొలాల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకునే పద్ధతులను అనుసరించాలి. కాంటూర్ బండ్లు, ఫార్మ్ పాండ్లు, చెక్‌డ్యామ్‌లు, నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయవచ్చు. దీని వల్ల భూగర్భ జలాలు పెరిగి పంటలకు అవసరమైన నీరు అందుతుంది. వ్యవసాయ ఉత్పత్తి కూడా మెరుగుపడుతుంది. అలానే అడవులలో విచ్చలవిడిగా చెట్లను నరికివేయడం వల్ల అనేక జంతుజీవరాసులు తమ సహజ ఆవాసాలను కోల్పోతున్నాయి. చెట్లు కేవలం నీడను, ఆహారాన్ని మాత్రమే అందించవు అడవులలోని నీటి వనరులను సంరక్షించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. చెట్లు లేకపోవడంతో వర్షపాతం తగ్గడం, భూగర్భ జలాలు క్షీణించడం, చిన్న చిన్న వాగులు, గుంటలు ఎండిపోవడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జంతువులు కొంతకాలం ఆహారం లేకపోయినా జీవించగలవు, కానీ నీరు లేకుండా ఎక్కువకాలం మనుగడ సాగించలేవు. అడవుల్లో నీటి కొరత ఏర్పడినప్పుడు జంతువులు దాహం తీర్చుకోవడానికి గ్రామాలు, పట్టణాల వైపు రావాల్సి వస్తుంది. అంతేకాకుండా, నీరు అందక అనేక పక్షులు, జంతువులు, ఇతర జీవరాసులు మరణాల బారిన పడే అవకాశం కూడా ఉంది. అందువల్ల అడవుల సంరక్షణ, చెట్ల పెంపకం, వర్షపు నీటి సంరక్షణ వంటి చర్యలు అత్యంత అవసరం. ప్రతి చెట్టు ఒక చిన్న జలాశయం వంటిది. చెట్లు పెరిగితే వర్షాలు పెరుగుతాయి, నీటి వనరులు నిలిచి ఉంటాయి, జీవరాశులకు అవసరమైన ఆహారం, నీరు, ఆశ్రయం లభిస్తాయి. ప్రకృతిని కాపాడటం అంటే కేవలం చెట్లను కాపాడటం మాత్రమే కాదు, సమస్త జీవకోటిని సంరక్షించడం కూడా. ప్రతి పౌరుడి బాధ్యత కూడా. పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, గ్రామపంచాయతీలు కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. వర్షాకాలంలో కురిసే ప్రతి నీటి బొట్టు అమూల్యమైన సంపద నీటిని కాపాడితేనే భవిష్యత్తు తరాలకు ప్రకృతి సంపాదనకు అందించినట్టే, వర్షపు నీటిని ఒడిసిపట్టుదాం నీటి భద్రతతో కూడిన భవిష్యత్తును నిర్మిద్దాం .





**- డాక్టర్. వై. సంజీవ కుమార్**
9393613555

# డిజిటల్ సంకెళ్లలో బాల్యం



సాంకేతిక విప్లవం సృష్టించిన స్మార్ట్‌ఫోన్ నేడు మానవ జీవితంలో ఒక అనివార్య భాగమైంది. అయితే ఇదే సాంకేతికత పసివాళ్ల పాలిట ఒక నిశ్శబ్ద శాపంగా మారుతోంది. ఆటపాటలతో, తోటి పిల్లలతో గడపాల్సిన వయసులో అంతులేని జ్ఞానాన్ని అందించాల్సిన మొబైల్ ఫోన్ నేడు చిన్నారులను తన గుప్పిట్లో బంధించి తీవ్రమైన వ్యసనంగా మారుతోంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా గంటల తరబడి తెరల ముందే మునిగిపోతున్న నేటి తరం పిల్లల పరిస్థితి ప్రతి ఇంటా కనిపిస్తున్న చేదు నిజానికి అద్దం పడుతోంది. చిన్నపిల్లలు మొబైల్కు బానిసలుగా మారడం అనే అంశాన్ని కేవలం ఒక అలవాటుగా కాకుండా, బహుముఖ కోణాల్లో విశ్లేషించాల్సిన అత్యంత కీలకమైన సమయం ఇది.



నిరంతరం మొబైల్ తెరలను చూడటం వల్ల పిల్లల శారీరక ఎదుగుదల తీవ్రంగా ప్రభావితమవుతోంది. రాత్రివేళల్లో చీకటి గదుల్లో మొబైల్ వినియోగం కంటి ఆరోగ్యాన్ని దెబ్బ తీయడంతో పాటు నిద్రకు అవసరమైన హార్మోన్ల ఉత్పత్తిని అడ్డుకుంటుంది. ఫలితంగా పిల్లలు నిద్రలేమితో బాధపడుతున్నారు. ఆరుబయట ఆటలు తగ్గిపోవడం, శారీరక శ్రమ లేకపోవడం వల్ల చిన్న వయసులోనే అధిక బరువు సమస్య పెరుగుతోంది. ఇది భవిష్యత్తులో మధుమేహం, గుండె జబ్బులకు దారితీసే ప్రమాదం ఉంది. అలాగే గంటల తరబడి ఒకే భంగిమలో కూర్చోవడం వల్ల మెడ నొప్పులు, వెన్నెముక సమస్యలు, నరాల బలహీనత వంటి ఇబ్బందులు కూడా చిన్న వయసులోనే ప్రారంభమవుతున్నాయి.

మొబైల్‌లో లభించే తక్షణ వినోదం పిల్లల మానసిక స్థితిని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. వేగవంతమైన చిన్నచిన్న దృశ్యాలు, ఆటలు, వినోద కార్యక్రమాలకు అలవాటుపడిన మెదడు తరగతి గదిలో పాఠాలపై దృష్టి కేంద్రీకరించలేకపోతోంది. ఫలితంగా ఏకాగ్రత తగ్గిపోతోంది. నిరంతరం మొబైల్ ఫోన్లలోనే గడపడం వల్ల నిజ జీవితంలో మనుషులతో ఎలా మెలగాలో, భావాలను ఎలా వ్యక్తపరచాలో కొంతమంది పిల్లలకు తెలియడం లేదు. కొందరిలో మాట్లాడటంలో ఆలస్యం, స్పందనలో లోపం వంటి లక్షణాలు కూడా కనిపిస్తున్నాయి. అదేవిధంగా, ఆన్‌లైన్ ఆటల్లోని హింసాత్మక దృశ్యాలు పిల్లల్లో చిరాకు, కోపం, మొండితనం, దూకుడు ప్రవర్తన పెరగడానికి కారణమవుతున్నాయి.

మానవుడు సంఘజీవి. కానీ డిజిటల్ వ్యసనం పిల్లలను క్రమంగా ఒంటరితనంలోకి నెడుతోంది. తోటి పిల్లలతో కలిసి ఆడుకోవడం, గెలుపు- ఓటములను అంగీకరించడం, పరస్పర సహకారం వంటి సామాజిక విలువలను వారు కోల్పోతున్నారు. మొబైల్ తెరే వారి ప్రపంచంగా మారుతోంది. ఇతరుల పట్ల జాలి, కరుణ, పంచుకునే గుణం వంటి మానవీయ విలువలు కూడా క్రమంగా తగ్గిపోతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఈ సంక్షోభానికి కేవలం పిల్లలను మాత్రమే బాధ్యులను చేయలేం. ఇందులో కుటుంబ వ్యవస్థ, జీవనశైలి మార్పులు కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. పిల్లలు ఏడుస్తున్నారని, అల్లరి చేస్తున్నారని చేతిలో ఫోన్ పెట్టడం నేటి తల్లిదండ్రులలో పెరుగుతున్న అలవాటుగా మారింది.

ఈ డిజిటల్ మహమ్మారి నుంచి పిల్లలను కాపాడాలంటే కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి పనిచేయాలి.రోజులో కొంత సమయం లేదా వారంలో ఒక రోజు మొబైల్లకు పూర్తిగా దూరంగా ఉండే అలవాటు కుటుంబ సభ్యులందరూ పెంచుకోవాలి. భోజన సమయంలో, నిద్రకు ముందు మొబైల్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలి. పిల్లలను సైక్లింగ్, ఈత, చిత్రలేఖనం, పుస్తక పఠనం, సంగీతం, క్రీడలు వంటి సృజనాత్మక కార్యకలాపాల వైపు మళ్లించాలి. ప్రకృతి, ఆటలు, స్నేహబంధాలే నిజమైన ఆనందాన్ని ఇస్తాయని వారికి అనుభవపూర్వకంగా తెలియజేయాలి. రెండేళ్ల లోపు పిల్లలకు మొబైల్ తెరలను పూర్తిగా దూరంగా ఉంచాలి. చిన్నారుల తెర సమయాన్ని ఖచ్చితంగా నియంత్రించాలి. పాఠశాలల్లో మొబైల్ వ్యసనంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పిల్లల్లో తీవ్రమైన ప్రవర్తనా మార్పులు కనిపిస్తే నిపుణుల సలహా తీసుకోవాలి.

మొబైల్ ఫోన్ ఒక అద్భుతమైన జ్ఞాన సాధనం. కానీ అది బాల్యాన్ని బంధించే సంకెళ్లుగా మారకూడదు. పచ్చని ప్రకృతి ఒడిలో, స్నేహితుల నవ్వుల మధ్య, ఆటపాటలతో వికసించాల్సిన బాల్యాన్ని డిజిటల్ గోడల మధ్య ఖైదు చేయడం భవిష్యత్తు సమాజానికే ప్రమాదకరం. పిల్లలకు ఖరీదైన పరికరాల కంటే విలువైన సమయం, ప్రేమ, ఆప్యాయతలను బహుమతిగా అందిద్దాం. నేటి బాల్యాన్ని కాపాడుకోవడం అంటే రేపటి సమాజానికి బలమైన పునాదులు వేయడమే. డిజిటల్ యుగంలో పిల్లలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ఎంత ముఖ్యమో, దానికి హద్దులు పెట్టడం అంతకంటే ముఖ్యమనే విషయాన్ని ప్రతి కుటుంబం గుర్తించాల్సిన అవసరం ఉంది.

**- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి**
9010128884

# జిల్లా కేంద్రంలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు తీయాలి

- **ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కలెక్టర్‌కు విజ్ఞప్తి**




సంగారెడ్డి జూన్ 24 మనం ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని తక్షణమే ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్కు లేఖ రాశారు. లేఖను బుధవారం నాడు. జరిగిన దిశ మిటింగ్ లో అందజేశారు.. కేంద్ర ప్రభుత్వం 2024లో తెలంగాణ రాష్ట్రానికి మంజూరు చేసిన ఏడు కొత్త జవహర్ నవోదయ విద్యాలయాలలో ఒకటి సంగారెడ్డి జిల్లాకు కేటాయించబడిందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు విద్యాలయం ప్రారంభం కాలేదని, దీంతో విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సంగారెడ్డి మండలం , కంది మండలం, కొండాపూర్ మండలాల పరిధిలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, 2026-27 విద్యా సంవత్సరంలోనే విద్యాలయం ప్రారంభించేందుకు అవసరమైన భూ కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ను కోరారు.

జిల్లా విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం జవహర్ నవోదయ విద్యాలయం ఎంతో ఉపయోగకరమని, ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# పారదర్శకంగా రాజన్న కోడెల పంపిణీ

- **పక్కదారి పట్టించే వారి పై కఠిన చర్యలు తీసుకుంటాం**
- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
- **హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **అర్హతలు ఉన్నవారికే 120 జతల జీవాల పంపిణీ**



రాజన్న సిరిసిల్ల / వేములవాడ, జూన్ -24(మనం ప్రతినిధి ): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాల నుంచి అర్హులైన రైతులకు కోడెలను పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో రైతులకు బుధవారం 120 జతల కోడెలను ఉచితంగా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. దేశంలో ఎక్కడ లేని విధంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి కోడెను కట్టే సంస్కృతి ఇక్కడ ఉందని గుర్తు చేశారు. భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు చెల్లింపు అని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు తిప్పాపూర్ గోశాల లో ఉచితంగా స్వామివారి కోడెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పంపిణీ చేసిన కోడెలను దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖ ఇతర శాఖల అధికారులతో నిత్యం తనిఖీ చేయిస్తామని స్పష్టం చేశారు. కోడెలను పక్కదారి పట్టించి ఇతర అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వేములవాడ నియోజకవర్గంలోని మర్రిపల్లిలో అధునాతన సౌకర్యాలతో 40 ఎకరాల స్థలం గోశాలకు కేటాయించిందని తెలిపారు. త్వరలోనే గోశాల పనులకు శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. కోడెలను సన్న, చిన్న కారు రైతులకు పంపిణీ చేస్తున్నామని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని అర్హులైన రైతులకు త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. కోడెలను సంరక్షించి.. వ్యవసాయ పనులకు వినియోగించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆన్లైన్ లో అన్ని పత్రాలతో దరఖాస్తు చేసుకున్న రైతులకు పశువైద్య, ఆలయ, వ్యవసాయ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా కోడెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాజన్న ప్రసాదంగా స్వీకరించి.. కోడెలను రైతులు వ్యవసాయ పనులకే వినియోగించాలని సూచించారు. నిరంతరం కోడెలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఎప్పటికప్పుడు కోడెలను తనిఖీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, ఆర్డీఓ కె. ఎస్ బి. కుమారి, ఆలయ ఈఓ రమాదేవి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమీషనర్ లోకేష్, వ్యవసాయ, రెవెన్యూ, ఆలయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి విద్యా అభివృద్ధికి హెచ్ఏఎల్ చేయూత

- **సి ఎస్ ఆర్ నిధులతో రూ.10 కోట్ల డిగ్రీ కళాశాల నిర్మాణం**
- **సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కృషికి ఫలితం**



హైదరాబాద్, జూన్ 24( మనం ప్రతినిధి)ః జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో ఉన్నత విద్యా అవకాశాల విస్తరణకు మరో కీలక అడుగు పడింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ ఏ ఎల్) తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) నిధుల కింద రూ.10 కోట్ల వ్యయంతో ధర్మపురిలో నూతన డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి ముందుకు వచ్చింది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ ఫలితంగా బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో హెచ్ ఏఎల్ ప్రతినిధులు, జగిత్యాల జిల్లా యంత్రాంగం మధ్య అవగాహన ఒప్పందం (ఎం ఓ యు) కుదిరింది. జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, హెచ్ ఏ ఎల్ హైదరాబాద్ చీఫ్ ఆఫ్ ప్రాజెకట్స్ శ్రీ ఎ.వి. మురళీకృష్ణ, డీజీఎం (హెచ్ఆర్) శ్రీ సూర్యకాంత్ రౌత్, సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్) శ్రీ ఎస్. సత్యనారాయణ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ విద్యాభివృద్ధే సమాజ అభ్యున్నతికి మూలాధారమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా మౌలిక వసతుల కల్పన ద్వారా సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ధర్మపురి, వెల్గటూరు, పెగడపల్లి, గొల్లపల్లి తదితర మండలాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు ఈ డిగ్రీ కళాశాల వరంగా మారనుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ, పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుందని అన్నారు. నూతన కళాశాల భవనం ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలతో నిర్మించబడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయ యువతలో ఉన్నత విద్యపై ఆసక్తి పెరిగి, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. సి ఎస్ ఆర్ నిధులను సామాజికాభివృద్ధికి వినియోగిస్తూ విద్యా రంగానికి హెచ్ ఏ ఎల్ సంస్థ అందిస్తున్న సహకారం ఆదర్శప్రాయమని పేర్కొంటూ, ఏ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె. రవి, యాక్సెసరీస్ కాంప్లెక్స్ (ఏసి) ముఖ్య కార్యనిర్వాహణ అధికారి (సీఈవో) శ్రీ ఎం. సత్యనారాయణ, హెచ్ ఏ ఎల్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామమోహనరావు, హెచ్ ఏ ఎల్ హైదరాబాద్ చీఫ్ ఆఫ్ ప్రాజెకట్స్ ఎ.వి. మురళీకృష్ణతో పాటు హెచ్ ఏ ఎల్ యాజమాన్యానికి మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ధర్మపురి ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సి ఎస్ ఆర్ నిధుల కింద ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సహకరించిన హెచ్ ఏ ఎల్ సంస్థ ప్రతినిధులను మంత్రి ఈ సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల అదనపు కలెక్టర్ రాజాగౌడ్, మంత్రి ఓఎస్డీ వై.జె. విజయ్ కుమార్, జిల్లా అధికారులు, హెచ్ ఏ ఎల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

- **ప్రాణాంతకంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్**



సుల్తానాబాద్, జూన్ 24 (మనం న్యూస్) సుల్తానాబాద్ మున్సిపాలిటీ 2వ వార్డు పరిధిలోని సెయింట్ మేరీస్ పాఠశాల వెనుక ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రమాదకర స్థితికి చేరుకోవడంతో స్థానిక రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ట్రాన్స్ఫార్మర్ వద్ద భద్రతా చర్యలు లేకపోవడంతో ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. బుధవారం ఉదయం ట్రాన్స్ఫార్మర్కు అనుసంధానించిన ఎర్త్ వైర్కు విద్యుత్ ప్రవహించడంతో సమీపంలోని సాయిరాం ఫంక్షన్ హాల్కు చెందిన పెంపుడు కుక్క విద్యుత్ షాక్కు గురై మృతి చెందింది. ఈ ఘటన స్థానికులను కలవరపాటుకు గురి చేసింది. స్థానిక రైతుల కథనం ప్రకారం, ట్రాన్స్ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె లేదా కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు, సంబంధిత ఏఈకి వినతిపత్రాలు అందించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ట్రాన్స్ఫార్మర్కు సమీపంలోనే పాఠశాల ఉండటంతో విద్యార్థులు ప్రతిరోజూ ఆ ప్రాంతంలో రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం తరచూ అక్కడికి వెళ్లడం, పశువులు, గొర్రెలు ఆ ప్రాంతంలో మేస్తుండటం వల్ల ప్రమాదం మరింత పెరిగిందని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్ఫార్మర్కు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు భద్రతా కంచె ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. 'ఒక మూగజీవి ప్రాణం బలైంది.. ఇకనైనా అధికారులు స్పందించి మానవ ప్రాణాలను కాపాడాలి' అని స్థానిక రైతులు కోరుతున్నారు.

# వాస్కులర్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



- **యశోద హాస్పిటల్ సీనియర్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్**

పెద్దపల్లి,జూన్ 24 (మనం ప్రతినిధి): కాళ్ల నొప్పులు కేవలం మోకాళ్ల నొప్పులు లేదా నరాల బలహీనత అని భావించి నిర్లక్ష్యం చేయడం ప్రాణాపాయానికి దారితీయవచ్చునని,కాళ్లకు రక్త ప్రసరణ తగ్గే వాస్కులర్ డిసీజ్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ సీనియర్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన యాంపుటేషన్ ఫ్రీ ఇండియా ప్రచారంలో భాగంగా ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఛాతీ నొప్పిని గుండె సమస్యగా ఎలాగైతే గుర్తిస్తారో, అలాగే కాళ్లలో తీవ్రమైన నొప్పి, నడిచినప్పుడు కాళ్లు బిగుతుగా మారడం, చర్మం రంగు మారడం,కాళ్ల వాపులు లేదా వేళ్లు నల్లబడటం వంటి లక్షణాలు కనిపిస్తే అది రక్తనాళాల సమస్య కావచ్చని గుర్తుంచుకోవాలి.ముఖ్యంగా 50 ఏళ్లు దాటిన వారు,ధూమపానం చేసేవారు,మద్యం అలవాటు ఉన్నవారు, అధిక రక్తపోటు,కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నవారు మరియు ఎక్కువ సేపు కదలకుండా కూర్చుని పనిచేసే వారు వాస్కులర్ వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువని ఆయన వివరించారు.వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే 80 నుండి 90 శాతం వరకు మందుల ద్వారానేనయం చేయవచ్చు.సమస్య తీవ్రమైతే శస్త్రచికిత్స అవసరమవుతుంది,కానీ సకాలంలో చికిత్స పొందితే కాలును తొలగించాల్సిన పరిస్థితిని పూర్తిగా నివారించవచ్చని,అకస్మాత్తుగా కాళ్లలో తీవ్రమైన నొప్పి వచ్చినప్పుడు 24 గంటల లోపు స్పందించి సరైన చికిత్స అందితే,రక్తనాళాల్లోని గడ్డలను కరిగించి కాలును కాపాడుకునే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ప్రజలు ఏదైనా సమస్య ఉన్నప్పుడు స్థానిక వైద్యులను సంప్రదించి,పరిస్థితి తీవ్రతను బట్టి వెంటనే వాస్కులర్ నిపుణులను సంప్రదించాలని కోరారు.పెద్దపల్లి జిల్లాలోని రోగుల కోసం యశోద హాస్పిటల్లో ప్రత్యేక అపాయింట్మెంట్ సౌకర్యం అందుబాటులో ఉందని,ఈ అవగాహన సదస్సు ద్వారా జిల్లాలో యాంపుటేషన్ రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమని డాక్టర్ ప్రభాకర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డాక్టర్ ప్రభాకర్ తోపాటు యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ సిబ్బంది లక్ష్మణ్ లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

# జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలి

- **ఎంపీ సురేష్ షెట్కర్**
- **అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి.**
- **ఎంపీ రఘునందన్ రావు**



సంగారెడ్డి, జూన్ 24 మనం న్యూస్ ప్రతినిధి :- ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ సురేష్ షెట్కర్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం నిర్వహించారు. మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావుతో కలిసి కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల పనుల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపడుతున్న పనుల్లో జాప్యాన్ని నివారించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అమృత్ పథకం కింద కొనసాగుతున్న పనులను వేగవంతం చేయడంతో పాటు కొత్తగా ఏర్పడిన కోహీర్ మున్సిపాలిటీకి అవసరమైన తాగునీటి కనెక్షన్ల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రోడ్లు మరియు భవనాల శాఖ, జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనుల్లో ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. పీఎం స్వనిధి పథకం కింద అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేసి, డ్రోన్ సాంకేతికత వినియోగంపై అవగాహన కల్పించాలని, ప్రతి గ్రామంలో మహిళా సంఘాలకు డ్రోన్లు అందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద చెరువుల సుందరీకరణ పనులను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు నారింజవాగు సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులను పారదర్శకంగా, సమర్థవంతంగా వినియోగిస్తూ అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని అధికారులను కోరారు. జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. ముత్తంగి నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు జాతీయ రహదారి పనులు ఆలస్యం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులను ఆదేశించారు. పెద్దాపూర్ రోడ్డు పనులు పెండింగ్లో ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి-పటాన్చెరు మార్గంలో అవసరమైన రహదారి అభివృద్ధి పనులకు సీఆర్ఎఫ్ కింద ప్రతిపాదనలు పంపాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. పీఎం కుసుం, పీఎం సూర్యఘర్ యోజన పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించి రైతులు, ప్రజలు సౌర విద్యుత్ వినియోగం వైపు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టరేట్ భవనంలో కూడా సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కలెక్టర్ను సూచించారు. జిల్లాకు మంజూరైన 12 ఆహార ధాన్య నిల్వ గోదాముల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. సంగారెడ్డి-పటాన్చెరు రింగ్ రోడ్డు పరిసర ప్రాంతంలో ఆధునిక చేపల మార్కెట్ ఏర్పాటు కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి జిల్లా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ టీబీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా తండాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, కార్యాలయాలు, నివాస మరియు వాణిజ్య భవనాలలో పీఎం సూర్యఘర్ యోజన కింద సోలార్ వ్యవస్థల ఏర్పాటుపై విస్తృత అవగాహన కల్పించి ప్రోత్సహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ జ్యోతి, జిల్లా స్థాయి అధికారులు, జాతీయ రహదారుల సంస్థ ప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, దిశా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో హోటళ్లు, దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

- **తనిఖీల్లో పలు లోపాలు గుర్తించిన ఆహార భద్రతా అధికారి జి. విక్రమ్.**
- **వండిన ఆహారాన్ని రిఫ్రిజిరేటర్లలో అపరిశుభ్రంగా నిల్వ.**
- **అనుమానిత ఆహార నమూనాల సేకరణ.**



కామారెడ్డి, జూన్ 24 (మనం ప్రతినిధి): కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని పలు హోటళ్లు, రిటైల్ ఆహార దుకాణాల్లో ఆహార భద్రత అధికారి జి. విక్రమ్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా ఆహార భద్రత ప్రమాణాలు, పరిశుభ్రత, నిల్వ విధానాలను పరిశీలించి పలు లోపాలను గుర్తించారు. తనిఖీల్లో కొన్ని హోటళ్లలో వండిన ఆహార పదార్థాలను రిఫ్రిజిరేటర్లలో అపరిశుభ్రంగా నిల్వ ఉంచడం, ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులను వినియోగించడం గుర్తించినట్లు ఆహార భద్రత అధికారి తెలిపారు. అంతేకాకుండా హోటళ్ల పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది వ్యక్తిగత శుభ్రత విషయంలో కూడా నిర్లక్ష్యం కనిపించిందని పేర్కొన్నారు. ల్యాబ్ నివేదికల ఆధారంగా చర్యలు.ఈ నేపథ్యంలో సంబంధిత హోటల్, దుకాణాల నిర్వాహకులను తీవ్రంగా హెచ్చరించిన అధికారులు, ఆహార భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అనుమానాస్పదంగా ఉన్న ఆహార పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్లోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు. ఈ సందర్భంగా హోటల్ యజమానులు, ఆహార వ్యాపారులు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించాలని, సిబ్బంది వ్యక్తిగత శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే రిటైల్ వ్యాపారులు ఎఫ్ఎస్ఎస్ఏఐ లేబులింగ్ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. ఆహార భద్రతకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆహార భద్రత అధికారి తెలిపారు.

# ఆరోగ్యంతోనే సేవలలో సామర్థ్యం పెరుగుతుంది

- **ఉద్యోగులు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి**
- **కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**
- **263 మంది ఐకేపీ, డీఆర్డీఏ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఐడీఓసీలో ఉచిత వైద్య శిబిరం**
- **బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, కంటి పరీక్షలు నిర్వహణ**




కామారెడ్డి, జూన్ 24 (మనం ప్రతినిధి)ః ప్రజాసేవలో నిమగ్నమై ఉన్న ఉద్యోగులు తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఐకేపీ, డీఆర్డీఏ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ప్రత్యేక ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో, సెర్ప్, ఎస్.ఆర్.డి.ఎస్ ఎలక్షన్ ఇన్సూరెన్స్ టి పి ఏ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 263 మంది ఉద్యోగులు పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, ఈసీజీ, 2డీ ఎకో, కంటి పరీక్షలు తదితర పరీక్షలను నిపుణులైన వైద్యులు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి వైద్య సూచనలు, తదుపరి చికిత్సలపై సలహాలు అందించారు.క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ., విధి నిర్వహణలో పని ఒత్తిడి, తరచూ ప్రయాణాలు, క్షేత్రస్థాయి బాధ్యతల కారణంగా ఉద్యోగులు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. కార్యాలయ ప్రాంగణంలోనే వైద్య సేవలు అందించడం వల్ల ఉద్యోగులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఆరోగ్య భద్రత పెరుగుతుందన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థ సీఈవో, రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ దివ్య దేవరాజన్ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమం, సేవల సామర్థ్యం పరస్పరం అనుసంధానమై ఉన్నాయని, ఇలాంటి శిబిరాలు తరచూ నిర్వహించడం ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెరిగి పనితీరు మెరుగుపడుతుందని చెప్పారు.శిబిరంతో ఉద్యోగుల్లో ఆరోగ్య చైతన్యం.శిబిరాన్ని అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరి, డీఆర్డీఓ దామోదర్ రెడ్డి, అదనపు డీఆర్డీఓ విజయలక్ష్మి సందర్శించి వైద్య సేవల అమలును పరిశీలించారు. కార్యక్రమ నిర్వహణలో ఎలక్షన్ కోఆర్డినేటర్ పవన్ కీలక పాత్ర పోషించారు. యశోద ఆసుపత్రి వైద్య బృందంతో పాటు నిజామాబాద్కు చెందిన మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శిబిరంలో పాల్గొని సేవలందించారు. ఉద్యోగుల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడంతో పాటు ముందస్తు ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేయడంలో ఈ శిబిరం ఉపయోగకరంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

# డ్రగ్స్ వాడకం ద్వారా యువత జీవితాన్ని కోల్పోతున్నారు




యాదాద్రి భువనగిరి, జూన్ 24 (మనం ప్రతినిధి): జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వారి సూచనల మేరకు అంతర్జాతీయ మాధక ద్రవ్య నిషేధ దినోత్సవం మరియు అక్రమ రవాణ అవగాహన కార్యక్రమములో భాగంగా బుధవారం రోజు అరోరా యూనివర్సిటీలో కళాశాల వారు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ, డ్రగ్ అవగాహన మరియు సంరక్షక యూనిట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శి వి. మాధవి లత మాట్లాడుతూ డ్రగ్ వాడకం, దానికి ఆకర్షితులు కావటం యువత ఒక ప్యాషన్ గా ఈ దురలవాటులోకి వస్తున్నారని, మరికొందరు మానసిక వత్తిడి తగ్గుతుందని అలవాటు చేసుకోవటం జరుగుతుందని, ఇది వ్యసనంగా మారి జాతీయ సంపద అయిన యువత తమ జీవితాన్ని కోల్పోతుందని అన్నారు. ఒక్కసారి ఈ మాధక ద్రవ్య నేరములో చిక్కుకుంటే చట్టం నుండి తప్పించుకోవటం జరగదని, యువత ముఖ్యంగా దీనికి దూరంగా ఉండాలని తెలిపారు, ర్యాగింగ్ కూడా ఒక అనాగరిక చర్య అని, ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే చట్టం విధించే శిక్షలే కాకుండా కళాశాల నుండి డీబార్ కూడా చేయటం జరుగుతుందని అన్నారు. జాతీయ న్యాయ సేవ సంస్థ డ్రగ్ అవేర్నెస్, వెల్నెస్ నావిగెషన్ అనే న్యాయ సేవల పథకాన్ని రూపొందించిందని, ఈ పథకం క్రింద ప్రత్యేక జిల్లా యూనిట్ ఉందని ఇందులో జిల్లా వైద్యాధికారి, జిల్లా విద్యాధికారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు ఉంటారని వీరు తగిన న్యాయ సేవలు, సహాయం అందేలా తోడ్పడుతారని తెలిపారు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఆసిడ్ దాడులు కూడా ఒక అనాగరిక చర్యే అని సూచించారు, న్యాయ సేవ సంస్థ బాదితులకు న్యాయ సహాయంతో పాటు నష్ట పరిహారం కూడా అందచేస్తుందని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి తమ శాఖ ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, తనిఖీలు కూడా నిర్వహిస్తున్నట్లు, ముద్దాయిలకు, అక్రమ రవాణా చేసేవారిపై కేసులు పెట్టి శిక్షలు పడేలా కృషి చేస్తుందని తెలిపారు. భువనగిరి డి. ఎస్. పి బి రవీందర్ యువత నేర ప్రవృత్తి మానుకోవాలని, పొగ త్రాగడం, మద్యం సేవించటం వ్యాసనాలకు లోనైతే జీవితానికి అర్థం ఉండదని తెలిపారు. జిల్లా మానసిక ఆరోగ్య ప్రాజెక్ట్ అధికారి డా. ప్రీతి స్వరూప్ డ్రగ్ అలవాటు మార్చుకోవటానికి ఏవిదంగా మన జీవన నడవడిని మార్చుకోవాలో, డ్రగ్ అలవాటు వలన మనకలిగే దుష్పలితాలపై వివరించారు.ట్రైని ఎక్సైజ్ ఇ ఎస్ వికాస్, ఎక్సైజ్ సి. ఐ లు రాధ కిషన్, బాలోజీ నాయక్ లు ఎక్సైజ్ శాఖ విధులు, మాధకద్రవ్య నిషేధంపై వారి శాఖ చేసే కృషిని వివరించారు. కళాశాల డైరెక్టర్ డా. చంద్రశేఖర్ తమ అరోరా విద్యా సంస్థలు కేవలం చదువు మీదే శిక్షణ కాక, క్రమశిక్షణ రేపటి జీవితానికి కావాల్సిన విద్యా నైపుణ్యత కూడా నేర్పిస్తున్నామని, ఇలాంటి చైతన్య కార్యక్రమాలు నిర్వహించటానికి మా విద్యా సంస్థలు ఎప్పుడు ముందు ఉంటుందని తెలిపారు. న్యాయ సహాయ న్యాయవాదులు ఎస్ సాయి శ్రీనివాస్, బి. వెంకటేష్, ప్యానల్ లాయర్ జె భాస్కర్ రెడ్డిలు న్యాయ సహాయం, చట్టం పరిధులు, శిక్షల అమలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో డ్రగ్ వలన కలిగే నష్టాలపై లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఎక్సైజ్ శాఖ వారు రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ, సివిల్ పోలీసు వారు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్లు డబుల్ బెడ్ రూమ్‌లో ఇవ్వాలి

హైదరాబాద్, జూన్ 24(మనంన్యూస్)ః గోపాల్పూర్ గుడిసెలు వాసులకు ఇందిరమ్మ ఇండ్లు డబుల్ బెడ్ రూమ్ లో ఇవ్వాలని సమావేశము జరిగింది రాష్ట్ర ప్రభుత్వము ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నది ఇప్పుడు మాత్రం గుడిసెలు కురుస్తుంది బడా బాబులు జోలికి వెళ్లట్లేదు గోపాల్ పూర్ చెరువు పారకము లేకున్నా చెరువులో మొరము తీసి అమ్ముకుంటున్నారు అధికారా యంత్రాంగము నిద్రలో ఉంది చెరువు దగ్గర కట్టే డ్రాప్ తెగిపోతే దాదాపు 18 కాలనీలు మునుగుతాయి అసలు వడ్డేపల్లి చెరువు నుండి తులసి భారీ వరకు కాల్వకు యూ షేప్లో డ్రాప్ వాల్ కట్టాలి గతంలో వరదతో కొట్టుకో పట్టుకుపోయిన కాలువను తులసిబార్ నుండి సమ్మె నగర్ వరకు ఎట్లా కూలిపోయింది అలానే వదిలేశారు 100 ఫీట్ నుండి పోయేటువంటి కాలువ కు డ్రాప్ ఆల్ కట్టి కాలువలు కూరుకుపోయిన మట్టిని కాలువలు పడిపోయిన గోడలను వెంటనే తీసి మరమ్మత్తులు చేయాలి ప్రజా ఉద్యమాలు నిర్మిద్దాం అందుకోసం మరో భూ పోరాటానికి సిద్ధమవుదాం జూన్ 27న ఏకశిలా పార్కు నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు నిరసన ర్యాలీలో వామపక్ష పార్టీలతో పాటు అన్ని గుడిసె సెంటర్స్ పాల్గొంటున్నాయి ఇండ్ల స్థలాలు వచ్చేవరకు ప్రభుత్వం మెడల్వంచుదాం పేదవాడితో పెట్టుకుంటే ప్రభుత్వాలే కూలుతాయి ఓటు ద్వారా అందుకు కలిసికట్టుగా పేదోలంతా పట్టణాలు ఉన్న వాళ్ళందరూ ఏకమవుదాం ఈ కార్యక్రమంలో హనుమకొండ సిపిఎం మండల కార్యదర్శి వీరన్న డీసీఎం ఎల్ దీపా మండల నాయకులు కే రవీందర్ వీ రాజు రాధిక స్వప్న సబిత పావని శృతి పద్మ సమ్మయ్య రాధా సురేష్ పాల్గొన్నారు

## విద్యుత్ ఉద్యోగుల భద్రతకై వన్ మినిట్ రూల్ పోస్టర్ ఆవిష్కరణ



జగిత్యాల, జూన్ 24(మనం న్యూస్)ః ఇటీవల ఎన్పీడీసీఎల్ పరిధిలో ప్రమాదాల నివారణ కోసం ఏ పనినైనా చేసేముందు వన్ మినిట్ రూల్ ని తీసుకువచ్చారు దీని ఉద్దేశం విద్యుత్ ఉద్యోగులు ఏ పనినైనా మొదలుపెట్టేముందు ఆ యొక్క పరిసరాలలో విద్యుత్ సరఫరా లేదని నిర్ధారించుకున్న తర్వాతనే పనిని ప్రారంభించాలని దానివల్ల విద్యుత్ ఉద్యోగులకు ఇటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉంటాయని ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఎన్పీడీసీఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి ఇటీవల వన్ మినిట్ రూల్ ని ప్రతిపాదించారు దానికి సంబంధించి వన్ మినిట్ పోస్టర్ని జగిత్యాల జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ బి సుదర్శనం, మెట్పల్లి డివిజన్ కార్యాలయంలో ఆవిష్కరించారు ఆయనతో పాటు డివిజనల్ ఇంజనీర్ మధుసూదనం, ఏడీలు ఏఈలు మరియు విద్యుత్ కార్మికులు సిబ్బంది పాల్గొన్నారు.

## కొమురవెల్లిలో అంతర్జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- రూ.7 లక్షల సొత్తు స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్టు
- బంగారం, వెండి, రెండు వాహనాలు, మొత్తం 7 లక్షల విలువగల సొత్తు స్వాధీనం




సిద్దిపేట, జూన్ 24మనం న్యూస్: కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసును పోలీసులు చేదించారు. ఫిర్యాదారుడు సార్ల సురేష్ (39) తన ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఇంట్లో ఉన్నటువంటి బంగారు, వెండి ఆభరణాలు దొంగతనం జరిగినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 30/05/2026 రోజున కొమురెల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చెయ్యగా...ఈ క్రమంలో నిన్న అనగా తేదీ 23-06-2026 న కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేచరేణి గ్రామ శివారులో గుర్జకుంట కమాన్ వద్ద ఎస్.ఐ. టి. మహేష్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో నిందితులు ఏ -1. డొంగరి రాజు (31) తండ్రి లింగం , ఏ -2: పొట్ట ప్రవీణ్(29) తండ్రి రాజు, ఏ -3: బొద్దుల శ్రీనాథ్(28) తండ్రి ప్రభాకర్, మెదక్ జిల్లా కుల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో చేపల దుకాణంలో మహిళ మెడలో నుండి బంగారు పుస్తెల తాడు మరియు ఒక మొబైల్ ఫోన్ను అపహరించినట్లు, నిజామాబాద్ జిల్లా జక్రాన్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మొబైల్ షాపులో నుండి హెచ్పీ ల్యాప్టాప్ మరియు సీసీ కెమెరా మానిటర్ను దొంగిలించినట్లు, అలాగే కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ చేసి బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు మరియు నగదును అపహరించినట్లు అంగీకరించారు. దొంగిలించిన బంగారు ఆభరణాలలో కొంత భాగాన్ని హైదరాబాద్లో విక్రయించగా, కుల్చారం కేసుకు సంబంధించిన బంగారు పుస్తెల తాడును నిజామాబాద్లోని ఎఫ్ ఈ డి బ్యాంకులో కుదువ పెట్టినట్లు విచారణలో వెల్లడైంది.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- ఇందిరమ్మ 100% పూర్తి కావాలి
- ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెరగాలి
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



సిద్దిపేట జూన్ 24; మనం ప్రతినిధి: అభివృద్ధి పనులను వేగం పెంచి వెంటనే పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని వివిధ శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ గాయమవుతుంది సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గం లో పంచాయతీ రాజ్ శాఖల లో చేపడుతున్న ఏంజిఎన్ఆర్ఈజీఎస్ సీసీ రోడ్, బిటి రోడ్, హెల్త్ సబ్ సెంటర్, అంగన్వాడి టాయిలెట్స్, ప్రైమరీ హెల్త్ సెంటర్ రిపేర్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, కింద సీసీ రోడ్స్, జీపి బిల్డింగ్, అంగన్వాడి సెంటర్స్, వివిధ రహదారుల నిర్మాణంలో ఉన్నవి పూర్తి చెయ్యాలని అలాగే పనులు మొదలు కానివి ప్రారంభించాలని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కాంట్రాక్టర్ లు వేగంగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం కింద చేపట్టిన పిఎచ్సి ల మేజర్ మైనర్ రిపేర్లు వేగంగా పూర్తి చెయ్యాలి. అర్ అండ్ బి శాఖ అధికారులు చేస్తున్న రోడ్ నిర్మాణాలు పూర్తి చెయ్యాలి. హుస్నాబాద్ నుండి కొత్తపల్లి నాలుగు వరసల రోడ్ నిర్మాణంలో వేగం పెంచాలని ఆదేశించారు. మున్సిపల్ లో జంక్షన్ డెవలప్మెంట్, ఎల్లమ్మచెరువు వెళ్ళేందుకు రోడ్ నిర్మాణం, సుందరీకరణ పనులు ఇతరత్ర పనులు నిర్ణిత కాలం లో పూర్తి చేయాలని ఆదేశించారు. నేషనల్ హైవే సిద్దిపేట- ఎల్కతుర్తి 85% రోడ్ పనులు పూర్తి చేశామని పందిళ్ళ టోల్ ప్లాజా నిర్మాణం, బస్వాపూర్ ఫారెస్ట్ క్లియరెన్స్ చేసుకుని రోడ్ నిర్మాణం, రోడ్ వెంబడి గల పలు విగ్రహాల తొలగింపుకు ఆయా గ్రామాల సర్పంచ్, సెక్రటరీ లను కలిసి అందరి సమక్షంలో రోడ్లపై నుండి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి. విద్యుత్ శాఖ ఆయా గ్రామంలో నిర్మాణంలో ఉన్న విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణం పూర్తి చెయ్యాలని తెలిపారు. గౌరవెల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో చేపడుతున్న మిషన్ భగీరథ పనులు నిర్ణిత కాల వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాలను ఆయా స్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేస్తూ 100 శాతం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయిల్ ఫామ్ సాగు గూర్చి మీకు ఇచ్చిన టార్గెట్ ను తప్పనిసరిగా పూర్తి చెయ్యాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి ఆయిల్ ఫామ్ సాగు చేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. అలాగే రైతువేదికలలో విత్తన మేళలో రైతులు సన్న వడ్లను వేసేలా అలాగే ఎక్కువ మొత్తంలో పప్పుదినుసులు, కూరగాయలు లాంటి ఆరుతడి పంటలను వేసుకునేలా ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులు ఆదేశించారు.

## ఇండస్ట్రియల్ కార్పొరేషన్ అడిషనల్ డైరెక్టర్‌ను కలిసిన టీఐసీసీఐ రాష్ట్ర నాయకులు



హైదరాబాద్, జూన్ 24(మనంన్యూస్)ః ట్రైబల్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టీఐఇఐఐ) తెలంగాణ చాప్టర్ ప్రతినిధులు తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ కమిషనరేట్/ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అదనపు డైరెక్టర్ను మర్యాదపూర్వకంగా కలిసి గిరిజన పారిశ్రామికవేత్తల అభివృద్ధి, పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూముల కేటాయింపు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా టీఐసీసీఐ రాష్ట్ర అధ్యక్షులు ధరవాత్ శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజన యువతలో పారిశ్రామిక రంగంపై అవగాహన పెంపొంది ంచడం, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించడం, గిరిజన పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక పారిశ్రామిక పార్కులు, భూ సేకరణలో సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు అదేవిధంగా గిరిజన సమాజ ఆర్థికాభివృద్ధికి పారిశ్రామిక రంగం కీలకమని, ఈ దిశగా టీఐఇఐఐ తెలంగాణ చాప్టర్ ప్రభుత్వం మరియు గిరిజన పారిశ్రామికవేత్తల మధ్య వారధిగా పనిచేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో టీఐఇఐఐ తెలంగాణ చాప్టర్ రాష్ట్ర కోఆర్డినేటర్ సంతోష్ నాయక్, ప్రధాన కార్యదర్శి రాంచందర్ నాయక్, యూత్ ఎంటర్ప్రెన్యూర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి అశోక్ నాయక్ మరియు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి

- డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- సంచార కేంద్రం ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ ,24 (మనం బ్యూరో): మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని, వివిధ సంక్షేమ పథకాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో, మోవో స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో బుధవారం గట్టు మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనం వద్ద మహిళా సంచార కేంద్రం ప్రారంభోత్స కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా గట్టు మండలంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నాలుగు ఎలక్ట్రికల్ స్కూటీలు, ఒక ఆటో, సైకిల్ ను కొనుగోలు చేసి డ్రైవింగ్ లో కిశోర బాలికలు, మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. మహిళలు డ్రైవింగ్ నేర్చుకునేందుకు వారి కుటుంబ సభ్యులు ప్రోత్సహించి సహకరించాలని కోరారు. మహిళా సమాఖ్య తరపున ఈ వాహనాలను అద్దెకు ఇచ్చి కూడా సభ్యులు ఆదాయం పొందవచ్చన్నారు. మహిళా సంఘాలు ఇప్పటికే వరి ధాన్యం కొనుగోలు, తదితర కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తెలంగాణ ఇంక్లూజివ్ లైవ్లీహుడ్ ప్రోగ్రాంకు జిల్లాలో అత్యంత వెనుకబడ్డ గట్టు మండలంను ఎంపిక చేసినందున ఇక్కడి 14 గ్రామాల్లో 1033 కుటుంబాలను ఇప్పటికే గుర్తించామన్నారు. ఈ కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అన్ని సంక్షేమ పథకాలను వర్తింపజేయడమే కాక ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకుల నుంచి సబ్సిడీ రుణాలను కూడా ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మోవో స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

### గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూ

ఒకప్పుడు గట్టు మండలంలో వలసలు ఎక్కువగా ఉండేవని, ప్రజలు పేదరికంతో ఇబ్బంది పడే వారని, ప్రస్తుతం ఈ ప్రాంత అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. మహిళల సాధికారత, స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గట్టు ప్రాంత మహిళల సంక్షేమం, రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం మహిళా మొబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలన్నారు. గట్టు మండలంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే వాహనాలను ప్రారంభించి, ఆటోలో కాసేపు ప్రయాణించారు.

### స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలించిన కలెక్టర్....

అనంతరం జిల్లా కలెక్టర్ సమీపంలో అసంపూర్తిగా నిర్మించబడ్డ స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలించారు. అలాగే పలువురు విద్యార్థులు చుట్టుపక్కల వివిధ ప్రభుత్వ విద్యాలయాల్లోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గట్టులోని జడ్పీహెచ్ఎస్ ను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వివిధ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గట్టు సర్పంచ్ నాగరాజు, మోవో స్వచ్ఛంద సేవా సంస్థ సీఈఓ జయ భారతి, తహసిల్దారు విజయ్ కుమార్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటేశ్వరి, ఏపీడి శ్రీనివాస్, డిపిఎం సలోమి, శిక్షకురాలు నందిని, ఇతర అధికారులు, నేతలు, మహిళా సంఘాల సభ్యులు, కిశోర బాలికలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా అభివృద్ధి చెందుతున్న హిల్టన్




హైదరాబాద్, జూన్ 24(మనంన్యూస్)ః బెంగళూరు, గోవాలో స్పార్క్ బై హిల్టన్ హోటళ్ల ప్రారంభోత్సవాన్ని ప్రకటించింది, దీనితో ఈ బ్రాండ్ ఆసియా పసిఫిక్లోకి ప్రవేశించింది. దేశవ్యాప్తంగా 150 స్పార్క్ బై హిల్టన్ హోటళ్లను ప్రారంభించేందుకు ఆలివ్ హాస్పిటాలిటీతో హిల్టన్ కుదుర్చుకున్న వ్యూహాత్మక ఒప్పందంలో భాగంగా ఈ ప్రారంభోత్సవాలు జరిగాయి.2023లో ప్రారంభించబడిన స్పార్క్ బై హిల్టన్, ప్రపంచవ్యాప్తంగా హిల్టన్ యొక్క అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బ్రాండ్లలో ఒకటి. అందుబాటు ధరలో నమ్మకమైన, నాణ్యమైన బసను కోరుకునే ప్రయాణికుల డిమాండ్ను తీర్చడానికి ఇది రూపొందించబడింది. విస్తృతమైన వినియోగదారుల అంతర్ద ృష్టుల మద్దతుతో, ఈ బ్రాండ్ స్థిరపడిన మరియు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో వేగంగా విస్తరించింది. యూఎస్, యూకే, కెనడా మరియు ఇతర అంతర్జాతీయ మార్కెట్లలో 240కి పైగా హోటళ్లు పనిచేస్తుండగా, దాదాపు 230 ప్రాపర్టీలు నిర్మాణ దశలో ఉన్నాయి. భారతదేశంలో దీని ప్రారంభం, స్పార్క్ బై హిల్టన్ యొక్క ప్రపంచవ్యాప్త విస్తరణలో ఒక కీలక ఘట్టాన్ని సూచిస్తుంది. ఇది సౌకర్యం లేదా సేవలో రాజీ పడకుండా, సరళత, స్థిరత్వం మరియు విలువను ఎక్కువగా కోరుకునే మధ్యతరగతి ప్రయాణికుల పెరుగుతున్న విభాగానికి హిల్టన్ యొక్క విశ్వసనీయమైన ఆతిథ్య ప్రమాణాలను అందిస్తోంది.స్పార్క్ బై హిల్టన్ బెంగళూరు మారతహళ్లి ఔటర్ రింగ్ రోడ్, 82 గదులు గల ఈ హోటల్, నగరంలోని అత్యంత చురుకైన వాణిజ్య మరియు సాంకేతిక కారిడార్లలో ఒకటైన మారతహళ్లి నడిబొడ్డున ఉంది. ఇది ఎక్స్పోర్ట్ ప్రమోషన్ ఇండస్ట్రియల్ పార్క్, ఎంబసీ టెక్ విలేజ్, ఎకో వరల్డ్, సలార్పురియా సాఫ్ట్జోన్ మరియు హీలియోస్ టెక్ పార్క్కు ఆనుకొని ఉంది. నగరంలోని ఈ ప్రాంతానికి ప్రత్యేకతను ఇచ్చే కార్పొరేట్ మరియు ఐఇఉ డిమాండ్కు అనుగుణంగా సేవలు అందించడానికి ఈ హోటల్ సరైన ప్రదేశంలో ఉంది. మరోవైపు, 64 గదుల స్పార్క్ బై హిల్టన్ గోవా కలంగుటే, భారతదేశంలోని అత్యంత ప్రజాదరణ పొందిన విహార ప్రదేశాలలో ఒకటైన గోవాకు ఈ బ్రాండ్ను తీసుకువస్తోంది. హిల్టన్, సౌత్ ఏషియా రీజినల్ హెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అయిన జుబిన్ సక్సేనా మాట్లాడుతూ, ఆధునిక భారతీయ ప్రయాణికుడు వేగంగా అభివృద్ధి చెందుతున్నాడు. అతిథులు నాణ్యత, సౌకర్యం మరియు స్థిరత్వాన్ని అందించే బ్రాండెడ్ బసలను ఎక్కువగా కోరుకుంటున్నారు. స్పార్క్ బై హిల్టన్ ఆ అవసరాన్ని నేరుగా తీరుస్తుంది, మరియు ఆలివ్ హాస్పిటాలిటీతో మా భాగస్వామ్యం ఈ మార్కెట్కు తగిన వేగంతో ముందుకు సాగడానికి మాకు ఒక వేదికను అందిస్తుంది. ఈ మొదటి రెండు ప్రారంభోత్సవాలతో, హిల్టన్ యొక్క విశ్వసనీయ సేవా ప్రమాణాలను కొనసాగిస్తూనే, నేటి ఆచరణాత్మక ప్రయాణికుడికి బలంగా నచ్చే ఒక ఉత్పత్తిని మేము పరిచయం చేస్తున్నాము. భారతదేశంలో ప్రారంభం కోసం, స్పార్క్ బై హిల్టన్ను స్థానిక ప్రయాణికుల అవసరాలు మరియు అంచనాలకు అనుగుణంగా ఆలోచనాత్మకంగా రూపొందించారు. ప్రత్యేకమైన ఫ్రిడ్జ్ దోసె స్టేషన్లను కలిగి ఉండే ఉచిత అల్పాహారంతో పాటు, కొత్త స్పార్క్ బై హిల్టన్ హోటళ్లు ప్రాంతీయ సేవా కేంద్రాలను అందిస్తాయి. వీటిలో సెల్ఫ్-సర్వ్ చాయ్ కార్ట్లు, ఎంపిక చేసిన ప్రదేశాలలో జిమ్ మరియు ఇన్-రూమ్ డైనింగ్ వంటి సౌకర్యాలు, అలాగే ఛార్జర్లు, బ్యాటరీలు మరియు శీఘ్ర చిరుతిళ్ల వంటి నిత్యావసరాలతో నిండిన వెండింగ్ మెషీన్లు ఉంటాయి. ఈ సదుపాయాలన్నీ బస అంతటా ఇబ్బందులను తగ్గించి, మరింత సౌలభ్యాన్ని అందించేలా రూపొందించబడ్డాయి. డిజిటల్ చెక్-ఇన్, డిజిటల్ కీ, సేవా అభ్యర్థనల మద్దతు మరియు హిల్టన్ ఆనర్స్ యాప్ అనుసంధానాలు వంటి సాంకేతికత ఆధారిత ఫీచర్లు అతిథులకు మరింత నిరాటంకమైన అనుభవాన్ని అందించడానికి రూపొందించబడ్డాయి.

# రైతుల ప్రయోజనాలను కాపాడమే మా లక్ష్యం

ఎమ్మెల్యే మందుల సామెల్





యాదాద్రి భువనగిరి, జూన్ 24 (మనం ప్రతినిధి): రైతుల ప్రయోజనాలను కాపాడడమే తన ముఖ్య ఉద్దేశమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామిల్ అన్నారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడ్డగూడూర్ మండలం రేపాక గ్రామ శివారు లో గల ఇండిస్ట్రియల్ పార్క్ నిర్మాణం కోసం భూమి కోల్పోయిన 10మంది రైతులకు ఎకరానికి 12 లక్షలు చొప్పున ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి చేతుల మీదుగా రైతులకు చెక్ లను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏమ్మెల్యే మాట్లడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూసేకరణ చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ముఖ్య ఉద్దేశమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ స్పష్టం చేశారు. డి రేపాక గ్రామ రైతుల భూములకు సంబంధించిన పరిహారం విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో నిర్ణయించిన రేటు ప్రకారం ఎకరాకు కేవలం రూ. 6 లక్షలు మాత్రమే ఇచ్చే అవకాశం ఉండేదన్నారు. అయితే, దశాబ్దాలుగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న రైతుల పరిస్థితిని వివరించడానికి తాను స్వయంగా జిల్లా కలెక్టర్తో ప్రత్యేకంగా సమావేశమయ్యానని పేర్కొన్నారు. రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని, నిర్ణయించిన రూ. 6 లక్షలకు తోడుగా మరో రూ. 6 లక్షలు కలిపి అందించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇందుకు అంగీకరించిన కలెక్టర్కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రైతులతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి, ఈ ప్రక్రియను వేగవంతం చేసినందుకు స్థానిక ఆర్డీఓకు, అలాగే ఇందుకు పూర్తిగా సహకరించిన మోత్కూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డికి, సర్పంచ్కు, గ్రామ రైతులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి,తహసీల్దార్ ఎ. శేషగిరి రావు,డిప్యూటీ తహసీల్దార్ నరసింహ రావు, నగేష్ కుమార్,రెవిన్యూ ఇన్స్పెక్టర్,మాదవి ఎ్కరేపాక గ పాల్గొన్నారు.

## 57వ డివిజన్ బూత్ లెవెల్ ఎన్నికల బాధ్యుల సమావేశం



హైదరాబాద్, జూన్ 24 (మనం న్యూస్)ః సిపిఎం పార్టీ జిల్లా ఆఫీసులో ఎల్ దీపా అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చుక్కయ్య పాల్గొని మాట్లాడుతూ 57వ డివిజన్లో అనేక ప్రాంతాల్లో ఇండస్థలాల పోరాటం చేసి ఇండ్లు ఇండ్ల పట్టాలు ఇప్పించడం జరిగింది ఇంకా ఇండ్ల పట్టాలు రానటువంటి ఇంజనీరింగ్ కాలనీ ప్రజల కోసం పోరాటం నడుస్తుందని సమ్మయ్య నగర్ లో ఇంకా ఇల్లు పట్టాలు ఇవ్వలేదని వాజ్పేయి కాలనీలో కూడా హౌస్ నెంబర్స్ ఇవ్వలేదని ప్రజల సమస్యలు పట్టుకొని నిత్యం పోరాడుతున్నామని అన్నారు అందుకోసం ఎర్రజెండా నాయకత్వంలో 57వ డివిజన్లో సిపిఎం పార్టీ కార్పొరేటర్ గా పోటీ చేస్తుందని అన్నారు 57 డివిజన్ ఎన్నికల కోఆర్డినేటర్ గా వి వీరన్న కో కన్వీనర్ గా పి ఉప్పలయ్య ఎల్ దీప బూత్ లెవెల్ బ్లాక్ ఇంజనీరింగ్ కాలనీ కన్వీనర్ గా కే రవీందర్ సమ్మె నగర్ కన్వీనర్ గా ఎల్ దీపా గాంధీనగర్ కన్వీనర్ గా వీ రాజు తో పాటు 15 మంది బాధ్యులను ఎన్నుకోవడం జరిగింది ప్రజా సమస్యలపై ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలుకై పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు కె రవీందర్ జి అరుణ బి లతా అనిత స్వప్న రాధిక వి రాజు శాఖ కార్యదర్శిలు బి రవి తదితరులు పాల్గొన్నారు.



# రైతు బంధు లేదు... రాహుల్‌బంధు పడుతోంది

## కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాలకూ అన్యాయం

## ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా....ఒరిగింది శూన్యం

## మళ్లీ అధికారంలోకి వస్తే సీతారామ ప్రాజెక్టును పూర్తి చేస్తాం

## సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

## సత్తుపల్లి సభలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**సత్తుపల్లి, జూన్ 24(మనం న్యూస్):** రైతుబంధు మాత్రం పడడం లేదు. ఢిల్లీలో రాహుల్ బంధు మాత్రం ఠంచన్‌గా పడుతోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కేటిఆర్) ఆరోపించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ నలుమూలలా ఎక్కడికి వెళ్లినా.. ఈ దుర్మార్గ పాలన పోవాలి.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. కాంగ్రెస్ మాయమాటలు విని మోసపోతే గోస తప్పదని ఆనాడే కేసీఆర్ చెప్పారని, రెండున్నరేళ్ల అసమర్థ కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకూ నష్టం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో మోసపోని వర్గం లేదు, కుప్పకూలని రంగం లేదని అన్నారు. 60 ఏళ్లలో రైతులపై రకరకాల పన్నులు వసూలు చేసిన ప్రభుత్వాలనే చూశాం. తొలిసారి రైతుకు పెట్టుబడి సాయం అందించాలన్న ఆలోచన చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్ మాత్రమేనని అన్నారు. 72 లక్షల మంది రైతుల ఖాతాలో రూ.73 వేల కోట్లు వేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి 72 సార్లు ఢిల్లీకి పోయి.. పైసా తెచ్చింది లేదన్నారు. గతంలో ఖమ్మం జిల్లాలో రాజీవ్ సాగర్, ఇందిరాసాగర్ పేరిట కాంగ్రెస్ రైతులను మోసం చేసిందన్నారు. గోదావరిలోని ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి ఖమ్మం జిల్లా రూపురేఖలు మార్చాలని ఆనాడు కేసీఆర్ సంకల్పించారు. పదివేల కోట్లతో సీతారామ ప్రాజెక్టు చేపట్టి 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కార్యక్రమం చేపట్టారు. సీతారామ ప్రాజెక్టుతో మొట్టమొదటి ఫలితం అందుకునే నియోజకవర్గం సత్తుపల్లి. ఈ ప్రాజెక్టు కోసం 8 వేల కోట్ల రూపాయలను బీఆర్ఎస్ ప్రభుత్వమే ఖర్చుచేసింది. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని గెలిపించినా రెండున్నరేళ్లలో ఏం పట్టించుకోలేదు. మళ్లీ కేసీఆర్ అధికారంలోకి రాగానే సీతారామ ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

**జిల్లాకు ఒరిగింది శూన్యం...**

రాష్ట్రంలో పవర్ ఫుల్ శాఖలన్నీ ఖమ్మంలోని ముగ్గురు మంత్రుల చేతిలోనే ఉన్నాయి. ఈ ముగ్గురు మంత్రులతో ఖమ్మం జిల్లాకు ఒరిగింది శూన్యం. రూ.50 వేల కోట్ల రూపాయల రుణమాఫీని చివరికి రూ.20 వేల కోట్లకు తెచ్చారు. కేసీఆర్ 11 సార్లు రైతుల ఖాతాలో పెట్టుబడి సాయం వేశారు. గత రెండున్నరేళ్లలో మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిన దివానా గాడు ఎవరని ప్రశ్నించారు. అన్నిరకాల వడ్లకు బోనస్ అని ఎన్నికల్లో మాటిచ్చి చివరికి ఏడు రకాలకు కుదించి దగా చేశారన్నారు. సంచులన్నీ ఢిల్లీకి పోతున్నై కాబట్టే కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గన్నీ బ్యాగులు దొరకని దుస్థితి నెలకొందన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ రాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారన్నారు. బూతులు, ఎగవేతలు, కూల్చివేతలు తప్ప ఈ రెండున్నరేళ్లలో చేసిందేమిటని ప్రశ్నించారు. గ్యారెంటీ కార్డును భద్రంగా పెట్టుకోమని చెప్పిన డిప్యూటీ సీఎం భట్టి ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. షాపుల్లో లేని యూరియా.. యాప్‌లో ఎక్కడ ఉంటుంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు మెజారిటీ స్థానాలు కట్టబెడితే..యూరియా యాప్ ను బంగాళాఖాతంలో పడేస్తామన్నారు. మళ్లీ ఆటో అన్నకు ఫోన్ చేస్తే, పొలం కాడికి యూరియా ఇచ్చి పోయే రోజులు తెస్తామన్నారు. కోటి మందిని కోటీశ్వరులను చేస్తామన్న ముఖ్యమంత్రి కనీసం మహిళలను లక్షాధికారులను చేశారా. కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలకు ఒక్కొక్కరి ఖాతాలో లక్షా 50 వేలు వేస్తే, శాశ్వతంగా రాజకీయాలు వదిలేస్తానన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 60 ఏళ్లలో.. ఒక్కటంటే ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదు. రాష్ట్ర రెవెన్యూ పడిపోతోంది. రెవెన్యూ మంత్రి సంపద మాత్రం పెరుగుతోందన్నారు. బుగ్గపాడు ఫుడ్ పార్కులో ఏం జరుగుతోందో ప్రజలు గమనించాలన్నారు. ఎకరానికి 60 లక్షల మార్కెట్ విలువ ఉన్న భూములను రూ.21 లక్షలకే ఎందుకు రాసిచ్చారు. సీతారామ ప్రాజెక్టు నుంచి వంద కోట్ల మట్టి దోపిడీ చేస్తున్నది వ్యవసాయ మంత్రినేనని ఆరోపించారు. కాంట్రాక్టుల రూపంలో పొంగులేటి వేల కోట్ల దోపిడీ చేస్తున్నారని, పొంగులేటికి తప్ప ఎవరికైనా కాంట్రాక్టులు వస్తున్నాయా అని ప్రశ్నించారు. ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని కార్యకర్తలు సీరియస్ గా తీసుకోవాలని, ఒక్క అర్హులైన ఓటరు పేరు కూడా పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను ఇంటింటికీ వెళ్లి చేపట్టండి, డిజిటల్ రూపంలో అత్యంత సులువుగా పార్టీ సభ్య నమోదు చేపట్టేందుకు ప్రత్యేకంగా యాప్ తెచ్చామని అన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ ను త్వరలో కాటికి పంపడమే ఇక మిగిలిందన్నారు.

మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎంపీ నామా నాగేశ్వర రావు, తక్కెళ్లపల్లి రవీందర్, మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషణం, దిండిగాల రాజేందర్, ఏనుగుల రాకేశ్ రెడ్డి, బొమ్మెర రామ్మూర్తి ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## ఆటో వర్కర్స్ యూనియన్ ఐఎన్టీయూసీలో
# భారీగా ఆటో డ్రైవర్ల చేరిక

**కొత్తగూడెం టౌన్ జూన్ 24 (మనం న్యూస్):** కొత్తగూడెం పట్టణంలోని సూపర్ బజార్ ప్రాంతంలో ఆటో వర్కర్స్ యూనియన్ ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిపిఐ అనుబంధ సంఘ ఏఐటియుసి నుండి మరియు వివిధ సంఘాలకు చెందిన 100 మంది ఆటో డ్రైవర్లు అడ్డాల బాధ్యులు ఐ ఎన్ టి యు సి యూనియన్లో చేరారు. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు అధ్యక్షత వహించగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోనేరు చిన్ని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్ బజార్లో ఏర్పాటు చేసిన ఆటో అడ్డా జెండాను కోనేరు చిన్ని ఆవిష్కరించారు . అనంతరం యూనియన్లోకి ఆటో డ్రైవర్లకు కండువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోనేరు చిన్ని మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఆటో డ్రైవర్ల సంక్షేమానికి అండగా ఉంటుందని తెలిపారు. కొత్తగూడెం ప్రాంతంలోని ఆటో డ్రైవర్లు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి తమ పూర్తి సహకారం అందిస్తామని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ఆటో డ్రైవర్లకు అందేలా కృషి చేస్తామన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు మాట్లాడుతూ, ఆటో డ్రైవర్ల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఐఎన్టీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. కొత్తగూడెం ప్రాంతంలో రాపిడో వ్యవస్థ రద్దు కోసం, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు, ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం అందరికీ విదితమేనన్నారు. ఆటో కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే విధానాలకు వ్యతిరేకంగా యూనియన్ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని, డ్రైవర్ల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావి రాంబాబు ,యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు చల్లంగి శ్రీనివాస్ ,భాష పాషా,కిషోర్, గంగులు, శోభన్, శివ, శ్రీను ,సర్వయ్య, సురేష్, క్రిస్టఫర్, రమేష్ ,రంజిత్, చింటూ, ముంజి ,కుమార్ ,రమేష్, వంశీ, అనిల్, జీడి శ్రీనివాస్, అల్లావుద్దీన్ ,గంగరాజు, ఇస్మాయిల్, వేణు, హథిరాం, శంకర్ ,రవి ,రాజు, చిన్ను, నాగరాజు, లక్ష్మణ్ ,మోహన్, సతీష్ ,సంతోష్ ,రాకేష్, దుర్గ, మధు ,వెంకన్న, అముల్ రాజ్, ప్రసాద్ ,గణేష్, బాలు ,జగదీష్, సాత్విక్ ,సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 24 (మనంప్రతినిధి):** జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటికి వెళ్లినప్పుడు అనుసరించాల్సిన విధానాలు, ఫారాల సమర్పణ ప్రక్రియ, ఆన్లైన్ మరియు ఆఫ్లైన్ విధానాలు, ఆన్లైన్లో ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ దశలు, సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ఆఫ్లైన్ ఫారాల పూర్తి విధానం తదితర అంశాలను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జూన్ 25 నుండి జూలై 24 వరకు బీఎల్వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ధృవీకరించి నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూలై 24 నుండి 30 వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతామని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించబడుతుందని, అనంతరం అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తప్పు సమాచారం సమర్పించిన సందర్భాల్లో వెంటనే తొలగింపు చేయకుండా, ముసాయిదా జాబితా అనంతరం నోటీసులు జారీ చేసి విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వలస వెళ్లిన, మరణించిన, డూప్లికేట్ ఓటర్లను జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిపారు. ప్రస్తుత జాబితాలో పేరు లేని అర్హులైన కొత్త ఓటర్లు తప్పనిసరిగా ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారిన వారు ఫారం-8 ద్వారా వివరాల సవరణ చేసుకోవచ్చని అన్నారు. ప్రతిరోజు బీఎల్వోలు గరిష్ఠంగా 50 ఫారాల వరకు సమర్పించే అవకాశం ఉందని తెలిపారు. బీఎల్వోలు, బీఎల్ఏలు సమన్వయంతో ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసే యువత కూడా కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించాలని సూచించారు. అనంతరం రాజకీయ నాయకులు పార్టీ ప్రతినిధులకు తలెత్తిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ సూపరింటెంట్ రంగ ప్రసాద్, టిఆర్ఎస్ పార్టీ వెంకటేశ్వర నాయక్, అన్వర్, కాంగ్రెస్ పార్టీ నుండి లక్ష్మణ్ అగర్వాల్, సిపిఐ పార్టీ నుండి అన్నవరపు సత్యనారాయణ, బిజెపి పార్టీ నుండి రవి నాయక్ తదితరులు, ఎన్నికల శాఖ సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభను జయప్రదం చేయాలి

## డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క

## ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**వైరా, జూన్ 24( మనం న్యూస్):** ఈ నెల 30న చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను జయప్రదం చేయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. బుధవారం ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమ ప్రభుత్వమని ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని, ఆనాటి ప్రధాన మంత్రులు జవహర్లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్ల తో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాల లోనే కృంగిపోయిందని విమర్శించారు. కెసిఆర్ చేసిన అప్పులకు ఇప్పటివరకు 76 వేల కోట్ల రూపాయలు అప్పు చెల్లించామని అన్నారు. ప్రతిపక్ష నేతలైన తండ్రి ,కొడుకు అల్లుడు కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని ప్రజలు నమ్మవద్దని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని, కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం, ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్ళు, రైతు రుణమాఫీ రైతు భరోసా కింద వేలకోట్ల రూపాయలు ఇచ్చామన్నారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన సర్ ప్రోగ్రాం ప్రమాదకరమైందని బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఓటు హక్కు ఎంతో విలువైనది పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలని, జూన్ 30న మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురం లో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని రైతులకు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

- జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహణ
- మీడియా సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం, జూన్ 24(మనం బ్యూరో):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై మీడియా ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి జిల్లా కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. బూత్ లెవల్ అధికారులకు (బీఎల్వోలు) శిక్షణలు నిర్వహించడంతో పాటు అవసరమైన పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. జూన్ 25, 2026 నుంచి జూలై 24, 2026 వరకు బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారంలు రెండు అందజేస్తారని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో ఉండి వివరాలను సక్రమంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. బీఎల్వోలు, బీఎల్ఏలు ఓటర్లకు ఫారాలు నింపడంలో సహాయపడతారని, ఇంటింటి సర్వే సమయంలో బీఎల్ఏలు బీఎల్వోలతో కలిసి వెళ్లవచ్చని తెలిపారు. బీఎల్వోలకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందించగా, బీఎల్ఏలు తమ రాజకీయ పార్టీలు జారీ చేసిన గుర్తింపు కార్డులను కలిగి ఉండాలని సూచించారు. విదేశాల్లో, ఇతర నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, సైన్యంలో విధులు నిర్వహిస్తున్న ఓటర్లు ఆన్లైన్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించవచ్చని, లేదా వారి కుటుంబ సభ్యులు సంబంధిత బీఎల్వోకు వివరాలు అందించవచ్చని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఎస్ఐఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని, ఓటరు పేరు లేకపోవడం లేదా ఇతర అభ్యంతరాలపై ఆగస్టు 30, 2026 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అందిన అన్ని అభ్యంతరాలను సెప్టెంబర్ 28, 2026 నాటికి పరిష్కరించి అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని వెల్లడించారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఎలా నింపాలో వివరించే ట్యుటోరియల్ వీడియోలను సిద్ధం చేశామని, ఫారాలతో పాటు వివరణాత్మక కరపత్రాలను కూడా అందజేస్తామని తెలిపారు. ఒకే పేరు, ఇంటి పేరు, తండ్రి పేరు వంటి వివరాలతో ఉన్న డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీలను గుర్తించి, బీఎల్వోలు క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి వివక్ష ఉండదని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని వారి పేర్లు ముసాయిదా ఓటరు జాబితాలో ఉండవని స్పష్టంచేశారు. ఫారం సమర్పించిన ఓటరు పేరును నిబంధనల ప్రకారం తొలగించబోమని వెల్లడించారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వివిధ మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమగ్రంగా సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ అన్సారీ, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత

- 25 పోస్టులకు గాను 6 ఖాళీలు
- సింగిల్ టీచర్స్ తో పలు పాఠశాలల నిర్వహణ
- సర్దుబాటుతో సరిచేయాలంటున్న స్థానికులు





**చర్ల, జూన్ 24 (మనం న్యూస్) :** గిరిజన సంక్షేమ శాఖ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేదిస్తోంది. ఈ పాఠశాలలు మారుమూల గ్రామాలలో ఉండటం, అవి కూడా పలు వలస ఆదివాసీ గ్రామాలలో అరాకొరా సౌకర్యాల నడుమ ఉండటంతో ఇక్కడి విద్యార్థుల చదువులు అంతంతమాత్రంగానే ఉంటోంది. దీనికి తోడు విద్యా బుద్దులు నేర్పించే గురువులు కరువవడంతో చదువులలో మరింత వెనకబాటుకు గురవుతున్నారు. మారుమూల అటవీశాఖ గ్రామాలలోని గిరిజన చిన్నారులకు విద్యా బుద్దులను నేర్పించి వారిని ఉన్నత స్థితికి తీసుకువచ్చేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుకారుస్తోంది. చర్ల మండల వ్యాపితంగా 13 గిరిజన సంక్షేమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉండగా వీటిలో 329 మంది 1 నుండి 5 వ తరగతి వరకు గల విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి పాఠాలను బోదించేందుకు 25 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా కేవలం 19 మంది తోనే చదువుల బండి లాగిస్తున్నారు. వీటిలో పలు పాఠశాలలు సింగిల్ టీచర్స్ తోనే కొనసాగుతున్నాయి. మారుమూల అటవీప్రాంత గ్రామమైన ఎర్రంపాడు పాఠశాలలో 33 మంది విద్యార్థులు ఉండగా వారికి విద్యాబుద్ధులు నేర్పించే రెండు ఉపాద్యాయపోస్టులు గత రెండేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. రెండేళ్ల క్రితం ఇక్కడ నియమితులైన ఇద్దరు ఉపాధ్యాయులు పైరవీలు చేసుకొని తమ ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో అప్పటి నుండి డిప్యుటేషన్ పై ఉపాధ్యాయులను నియమించి పాఠశాలను నిర్వహిస్తున్నారు. గత ఏప్రిల్ 24న అన్ని రకాల డిప్యుటేషన్లను ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రద్దు చేసారు. దీంతో ప్రస్తుతం అక్కడ ఉపాధ్యాయులు ఎవరూ లేకుండా పోయారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన ఈ నెల 15న ఉయ్యాలమడుగు పాఠశాల ఉపాధ్యాయుడిని ఎర్రంపాడు వెళ్లాలని సంబంధిత పే స్కేల్ ప్రధానోపాధ్యాయురాలు ఆదేశించినప్పటికి సదరు ఉపాధ్యాయుడు పాఠశాలకు వెళ్లలేదు. దీంతో సెలవుల అనంతరం పాఠశాల తెరుచుకోలేదు. పాఠశాల పునఃప్రారంభమైన రోజు తప్పనిసరిగా తెరవాలనే నిబంధన ఇక్కడ అమలు కాలేదు. **ఈ విషయమై 'మనం' దినపత్రికలో వార్తా కథనం ప్రచురితం కావడంతో పే స్కేల్ ప్రదానోపాధ్యాయురాలితో పాటు మరొకరికి ఐటిడిఏ అదికారులు మెమోలు జారీ చేయగా ఆదేశాలను పాటించని ఉపాధ్యాయుడిపై విచారణ కొనసాగుతోంది.** చెన్నాపురంలో ప్రస్తుతం ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. కత్తిగూడెం పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు ఉండగా ఇక్కడ రెండు ఉపాధ్యాయ పోస్ట్ లకు గాను రెండూ ఖాళీగా ఉన్నాయి. దీంతో సుందరయ్య కాలని పాఠశాల నుండి ఒకరిని ఇక్కడికి డిప్యూటేషన్ పై పంపడంతో ప్రస్తుతం సుందరయ్యకాలనిలో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. గన్నవరం గ్రామంలో సుమారు 20 మంది వరకు విద్యార్థులు ఉండగా గ్రామంలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో మొదటి నుండి ఉపాధ్యాయుల కొరత ఉండటంతో ఇక్కడ తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడక పక్కనే గల ఉప్పరిగూడెం ఎంపిపి పాఠశాలకు పంపిస్తున్నారు. ఇలా 15 మంది వరకు పక్క పాఠశాలకు వెలుతుండటంతో ప్రస్తుతం గన్నవరం పాఠశాలలో కేవలం 5 గురు విద్యార్థులే ఉన్నారు. ఇక్కడ గల ఒక ఉపాధ్యాయుడి పోస్ట్ ఖాళీగా ఉండటంతో ఒక ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్ పై నియమించి నడిపిసున్నారు. ఉంజుపల్లి పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ రెండు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ఒకరితోనే నడిపిస్తున్నారు. ఒద్దిపేట పాఠశాలలో 23 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ రెండు ఉపాధ్యాయ పోస్ట్ లకు గాను ఒక పోస్ట్ ఖాళీగా ఉండటంతో ఒక్కరితోనే నెట్టుకొస్తున్నారు. ఇలా అనేక పాఠశాలలు సింగిల్ టీచర్స్ తో నిర్వహిస్తుండటం విద్యార్థులకు శాపంగా మారింది. ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతులకు బోదించాల్సి రావడంతో ఒత్తిడికి గురైన సదరు ఉపాధ్యాయులు మొక్కుబడిగా చదువులను చెవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే మారుమూల గ్రామాల ఉపాధ్యాయులు పర్యవేక్షణా లోపం కారణంగా తరచూ విదులకు గైర్హాజరవుతారనే విమర్శలు ఉన్నాయి. దీనికితోడు సింగిల్ టీచర్స్ ఉండటం వారు అంతంత మాత్రపు చదువులను బోధించడంతో అక్కడి విద్యార్థులు బాగా వెనుకబడి ఉన్నారనే చెప్పాలి. జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆద్వర్యంలో నడుస్తున్న అనేక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి మిగులు ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలుస్తోంది. పలువురు ఉపాధ్యాయులు తమ పలుకుబడి ఉపయోగించి సంవత్సరాల తరబడి అక్కడే విదులను నిర్వహిస్తున్నారు. ఇటువంటి వారిపై ఐటిడిఏ ప్రాజెక్టు అదికారి దృష్టి సారించి మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి ఉపాధ్యాయులు కొరత ఉన్న పాఠశాలలో నియమించాలని పలువురు కోరుతున్నారు. ఈ దిశగా చర్యలు చేపడితే తమ పిల్లల భవిష్యత్ బాగుపడుతుందని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

# కరీంనగర్ జిల్లాను ప్రభుత్వ పథకాల అమలులో అగ్రభాగాన నిలపండి

- మానవీయ కోణంలో ప్రజల సమస్యలు పరిష్కరించండి
- నిత్యం ప్రజలతో మమేకం కావాలి
- అర్హులైన వారందరికీ వివిధ అభివృద్ధి , సంక్షేమ పథకాలు అందించాలి
- ప్రజలకు సేవ చేయడం అధికారుల అదృష్టంగా భావించాలి
- సమస్యలను గుర్తించడం, పరిష్కరించడం నిరంతర ప్రక్రియగా కోన సాగాలి
- ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా
- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై కరీంనగర్ జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రెసెంటేషన్



కరీంనగర్, జూన్ 24(మనం బ్యూరో): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో కరీంనగర్ జిల్లాను అగ్రభాగాన నిలపాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా హైదరాబాద్ నుండి నేరుగా కరీంనగర్ కలెక్టరేట్ కి చేరుకున్నారు . అనంతరం కలెక్టరేట్ లో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అధ్యక్షతన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను గుర్తించి పరిష్కరించడమే అధికారుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. ప్రజలకు సేవలు అందించడం అధికారుల అదృష్టంగా బావించాలని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు . జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని సమస్యల పరిష్కారం ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగాలని అని అన్నారు , రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని, ప్రజలకు పాలనను చేరువ చేసేందుకే ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని తెలిపారు.ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు విజయవంతం చేయడమే కాకుండా , అధికారులు పథకాల సద్వినియోగం పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రా స్థాయి లో ప్రభుత్వ పథకాల అమలు పై నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందికి కూడా ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు.

మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్, అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారని కొనియాడారు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయాలని సూచించారు. మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, అద్దె బస్సుల నిర్వహణ వంటి కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోందని తెలిపారు.

గ్రామాలు, పట్టణాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదేనని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు నిధుల కొరత లేదని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 10 ప్రధాన అంశాలపై జిల్లాలో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారంలో భాగంగా 4,290 ఫైళ్లు పరిష్కరించగా, 3,835 దరఖాస్తులు స్వీకరించామని, అరైవ్-అలైవ్ కార్యక్రమంలో 318 గ్రామపంచాయతీల్లో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు . వ్యవసాయ రంగంలో 1.93 లక్షల మంది రైతులకు రూ.143.35 కోట్లు రైతు భరోసా, 206 రైతు కుటుంబాలకు రూ.14 కోట్ల రైతు బీమా అందించగా, 319 కొనుగోలు కేంద్రాల ద్వారా మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.554 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది అని అన్నారు . సంక్షేమ పథకాల కింద 45,920 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయగా, 96,775 కొత్త సభ్యుల పేర్లు చేయడం జరిగింది అని అన్నారు . మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.334 కోట్ల ప్రయోజనం, గృహజ్యోతి ద్వారా రూ.153.10 కోట్ల లబ్ధి కల్పించామని , ఇందిరమ్మ ఇండ్ల పథకంలో 10,209 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, 7,220 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి అని అన్నారు.

మెగా జాబ్ మేళాలో 292 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని, ప్రజావాణి ద్వారా వచ్చిన 2,995 దరఖాస్తుల్లో 2,144 దరఖాస్తులు పరిష్కరించినట్లు కలెక్టర్ వివరించారు. బడిబాట కార్యక్రమం ద్వారా 9435 మంది ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను చేర్పించడం జరిగింది అని అన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో జిల్లాలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక విజయవంతమైందని, కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ పవర్ ప్రజెంటేషన్ విశేషంగా ఆకట్టుకుంది. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం , నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో పాటు ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖలకు సంబంధించి 99 రోజుల కార్యక్రమం పై ప్రజెంటేషన్ ఇచ్చారు.

# విద్యార్థినిలు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

## ప్రభుత్వ కళాశాలలలో ప్రవేశాలు పెరగాలి

## జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 24 (మనం బ్యూరో): విద్యార్థినిలు చదువులు మధ్యలో ఆపేయకుండా ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం గద్వాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పలు తరగతి గదుల్లోని విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలను తెలుసుకున్నారు. ఎంతమంది ఇంప్రూవ్మెంట్ కోసం సప్లమెంటరీ పరీక్షలను రాసారని అడిగారు. విద్యార్థులు నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో రాణించేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక సాధన చేయాలన్నారు. ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీకి సంబంధించిన ఆన్లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటేలా ప్రత్యేక తరగతులు నిర్వహించి, శిక్షణ ఇవ్వాలని అధ్యాపకులను ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, రాత పుస్తకాలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలలలో ప్రవేశాలు పెరగాలన్నారు. అడ్మిషన్స్ కోసం వచ్చే విద్యార్థులను కళాశాలలో చేర్చుకోకుండా వేరే విద్యాలయాలకు రేఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

అనంతరం కలెక్టర్ కళాశాల పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డిజిటల్ బోర్డులను తరగతి గదుల్లో ఇన్స్టాల్ చేయించి వినియోగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామన్నారు. ఈ పర్యటనలో డిఐఈఓ హృదయ రాజ్, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణ, అధ్యాపకులు తదితరులున్నారు.

# ఆర్టీఐ అమలులో లోపాలు బట్టబయలు

## 17 నెలలుగా సమాచారం కోసం పోరాటం...

## బాధ్యులపై చర్యలు, జరిమానా విధించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి



కొణిజర్ల, జూన్ 24 (మనం న్యూస్): ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావాలనే లక్ష్యంతో అమలులోకి వచ్చిన సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలులో ఉన్న లోపాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. కొణిజర్ల గ్రామ పంచాయతీకి సంబంధించిన సమాచారాన్ని కోరిన ఒక దరఖాస్తుదారు దాదాపు 17 నెలలుగా పూర్తి సమాచారం కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఆర్టీఐ చట్టం అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

సీసీఆర్ కార్యకర్త ఎస్.కె. నాగుల్ షరీఫ్ తన ఇంటికి విధించిన రూ.10,739 ఇంటి పన్నుకు సంబంధించిన పూర్తి వివరాలను కోరుతూ 2025 జనవరి 15న సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు సమర్పించారు. చట్టం ప్రకారం 30 రోజుల్లో సమాచారం అందించాల్సి ఉండగా, అధికారులు నిర్ణీత గడువులో స్పందించలేదు. అనంతరం అందించిన సమాచారం కూడా అసంపూర్ణంగా ఉండటంతో ఆయన మొదటి అప్పీల్కు వెళ్లారు. అక్కడ కూడా పూర్తి సమాచారం అందకపోవడంతో తెలంగాణ సమాచార కమిషన్ను ఆశ్రయించారు. ఈ కేసుతో పాటు మరో కేసుపై కూడా జూన్ 24న సమాచార కమిషన్ ఎదుట విచారణ జరిగింది. మొదటి విచారణ సందర్భంగా కమిషనర్ పూర్తి సమాచారంతో హాజరు కావాలని అధికారులను ఆదేశిస్తూ వాయిదా ఇచ్చారు. అయితే రెండోసారి కూడా అధికారులు పూర్తి రికార్డులు సమర్పించకపోవడం గమనార్హం. ఇంటి పన్ను విధింపులో పొరపాటు జరిగిందని అంగీకరించినప్పటికీ, ఆర్టీఐ దరఖాస్తులో కోరిన ఇతర ముఖ్యమైన వివరాలను మాత్రం అందించలేకపోయారు.

ఈ సందర్భంగా కమిషన్ ఎదుట ఎస్.కె. నాగుల్ షరీఫ్ తన వాదనలు వినిపిస్తూ, 2025 జనవరి 15 నుంచి ఇప్పటివరకు సమాచారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని, అధికారులు చట్టబద్ధంగా అందించాల్సిన సమాచారాన్ని ఇవ్వకుండా తనను ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ వరకు పలుమార్లు ప్రయాణించి విచారణలకు హాజరుకావాల్సి రావడం వల్ల అనవసర ఖర్చులు, సమయ నష్టం ఎదురైందని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. సమాచార హక్కు చట్టం సెక్షన్-20 ప్రకారం సమాచారం ఇవ్వడంలో జాప్యం చేసినా, కావాలనే సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం ప్రదర్శించినా సంబంధిత అధికారులపై రోజుకు రూ.250 చొప్పున జరిమానా విధించే అవకాశం ఉందని గుర్తుచేస్తూ, ఈ కేసులో బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ను కోరినట్లు తెలిసింది. అంతేకాకుండా, తనకు ఇప్పటికీ పూర్తి సమాచారం అందించని అధికారులపై శాఖాపరమైన చర్యలు కూడా తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. వరుసగా రెండు విచారణల్లోనూ పూర్తి సమాచారం సమర్పించకపోవడం, కమిషన్ ఆదేశాల అనంతరం కూడా నిర్లక్ష్య వైఖరి కొనసాగడం పట్ల పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక సాధారణ పౌరుడు చట్టబద్ధమైన సమాచారాన్ని పొందేందుకు నెలల తరబడి పోరాడాల్సి రావడం ఆర్టీఐ చట్టం అమలులో ఉన్న లోపాలను స్పష్టంగా చూపుతోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజాస్వామ్యంలో సమాచార హక్కు ఒక కీలక ప్రజా సాధనం. ఆ హక్కును కాలయాపన, నిర్లక్ష్యంతో నిర్వీర్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే చట్టంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని ఆర్టీఐ కార్యకర్తలు పేర్కొంటున్నారు. కమిషన్ ఆదేశాల అమలుపై మరింత కఠిన పర్యవేక్షణ ఉండాలని, బాధ్యులపై జరిమానాలు విధించి జవాబుదారీతనం పెంచాలని వారు కోరుతున్నారు. అయితే ఈ కేసులో సమాచార కమిషన్ ఇంకా తుది ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. విచారణ సందర్భంగా ఇరుపక్షాల వాదనలు నమోదు చేసిన కమిషనర్, కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం తదుపరి ఆదేశాలు వెలువరించే అవకాశం ఉందని తెలుస్తోంది. సమాచారం అందించడంలో జరిగిన జాప్యం, కమిషన్ ఆదేశాల అమలులో అధికారుల వైఖరి, దరఖాస్తుదారు చేసిన ఫిర్యాదులపై కమిషన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ కె. సంగ్మా, మేఘాలయ సీఎం సతీమణి మెహతాబ్ చండీ అగిటోక్ సంగ్మా, ఉప ముఖ్యమంత్రులు స్నియాభలాంగ్ ధర్, ప్రెస్టోన్ టిన్సాంగ్.

# రూ.15 లక్షల నగదు దోపిడీ కేసును ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసులు

## 8 మంది నిందితుల అరెస్ట్ - రూ. 3,00,000/- నగదు, నాలుగు వాహనాల స్వాధీనం.

## కర్ణాటక, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన నిందితుల ముఠాగా గుర్తింపు.



తిరుపతి జూన్24 మనం న్యూస్: అంతర్ రాష్ట్ర 8 మంది దొంగల ముఠాను అరెస్టు చేసి వారి నుంచి మూడు లక్షల నగదు నాలుగుకారులను స్వాధీనం చేసుకున్నట్లు ఏ ఎస్ పి శ్రీనివాసులు తెలిపారు.తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పరిధిలోని శ్రీకాళహస్తి-తిరుపతి జాతీయ రహదారి లో అంజిమేడు బస్ స్టాప్ సమీపంలోని దీప్ పంజాబీ దాబా వద్ద జూన్ 2026న జరిగిన రూ.15 లక్షల నగదు దోపిడీ కేసును తిరుపతి జిల్లా పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో 8 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి నగదు నేరానికి వినియోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ (పరిపాలన) ఆర్ల శ్రీనివాసులు వెల్లడించారు. కేసు దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టు, స్వాధీనం చేసుకున్న నగదు, వాహనాల వివరాలను మీడియాకు వివరించారు.ఫిర్యాదుదారు రవీంద్రరెడ్డి అలియాస్ వేణు తన వద్ద ఉన్న రూ.15 లక్షల నగదుతో ప్రయాణిస్తుండగా, నిందితులు ముందస్తు పథకం ప్రకారం అతనిని అడ్డగించి కత్తితో బెదిరించి నగదును అపహరించారు. అనంతరం ఫిర్యాదుదారుతో పాటు ఉన్న బాబురెడ్డిని ఇన్నోవా వాహనం నుండి బలవంతంగా దింపివేసి అక్కడి నుంచి పరారయ్యారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఏర్పేడు పోలీసులు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. అదనపు ఎస్పీ (పరిపాలన) ఆర్ల శ్రీనివాసులు పర్యవేక్షణలో, రేణిగుంట ఎస్డీపీవో వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం ఏర్పాటైంది. దర్యాప్తులో భాగంగా మంగళవారం సాయంత్రం ఏర్పేడు మండలం నీలాద్రి అపార్ట్మెంట్స్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో కేసులోని ఎ-2 నుండి ఎ-9 వరకు ఉన్న ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. విచారణలో వారు నేరానికి పాల్పడినట్లు అంగీకరించారు.

అరెస్టు చేసిన నిందితుల వద్ద నుండి దోచుకున్న నగదులో భాగంగా సుమారు రూ.3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నేరానికి వినియోగించిన ఒక ఇన్నోవా వాహనం, రెండు స్విఫ్ట్ డిజైర్ కార్లు, ఒక స్విఫ్ట్ కారు సహా మొత్తం నాలుగు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రధాన నిందితురాలు ఎ-1 లక్ష్మీకాంతమ్మ ప్రస్తుతం పరారీలో ఉండగా, ఆమెను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. దర్యాప్తులో నిందితులు కర్ణాటక రాష్ట్రంతో పాటు చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. వీరిలో కొందరిపై గతంలో మోసం, దోపిడీ, దొంగతనం తదితర కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

# నంది సర్కిల్ సమీపంలో ఎరువుల దుకాణంపై అధికారుల దాడి

- దుకాణదారుడికి షోకాజ్ నోటీసు.. 10 రోజుల పాటు లైసెన్స్ సస్పెన్షన్

శ్రీకాళహస్తి, జూన్ 24,మనం న్యూస్: ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, రైతులకు నిర్ణీత ధరల కంటే ఎక్కువ రేట్లకు ఎరువుల బస్తాలను విక్రయిస్తున్న పట్టణంలోని ఒక ప్రముఖ దుకాణంపై వ్యవసాయ శాఖ అధికారులు కొరడా ఝులిపించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని నంది సర్కిల్ సమీపంలో గల ఒక ఫెర్టిలైజర్ షాపులో ఎం.ఆర్.పి ధరల కంటే అదనపు ధరలకు ఎరువులు అమ్ముతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి.ఈ నేపథ్యంలో అగ్రికల్చర్ ఏడీఏ రమేష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సురేంద్ర రెడ్డి తమ సిబ్బందితో కలిసి సదరు దుకాణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వ్యాపారి అక్రమంగా, అధిక ధరలకు ఎరువుల బస్తాలను విక్రయిస్తున్నట్లు ఆధారాలతో సహా పట్టుబడింది.

**కఠిన చర్యలు - లైసెన్స్ సస్పెన్షన్:**


నిబంధనల ఉల్లంఘనపై తీవ్రంగా స్పందించిన ఏడీఏ రమేష్ రెడ్డి, ఎంఏఓ సురేంద్ర రెడ్డిలు సదరు దుకాణదారుడికి తక్షణమే షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పక్కనబెట్టి అక్రమాలకు పాల్పడినందుకు గాను సదరు దుకాణం లైసెన్స్ను 10 రోజుల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. రైతులను నిలువుదోపిడీ చేస్తే సహించం - అధికారులు ప్రస్తుత సీజన్లో రైతులను ఆసరాగా చేసుకుని ఏ వ్యాపారి అయినా బ్లాక్ మార్కెట్కు పాల్పడినా, కృత్రిమ కొరత సృష్టించినా లేదా అధిక ధరలకు విక్రయించినా ఊపేక్షించేది లేదు. ప్రతి దుకాణంలోనూ స్టాక్ వివరాలు, ధరల పట్టికను రైతులకు కనిపించేలా బోర్డుపై ప్రదర్శించాలి.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు పెడతాం.'అధికారుల మెరుపు తనిఖీలు మరియు కఠిన చర్యలతో పట్టణంలోని అలాగే నియోజకవర్గంలోని మిగిలిన ఎరువుల వ్యాపారుల్లో ఒక్కసారిగా వణుకు మొదలైంది.

# చిన్నగొట్టిగల్లులో రూ.3 కోట్లతో నిర్మించిన విద్యాసంస్థ ప్రారంభం

చిన్నగొట్టిగల్లు జూన్24మనంన్యూస్: చిన్నగొట్టిగల్లు మండలంలో విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా ఇంచార్జి మంత్రి, రెవిన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు మండలంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన వి.సిద్ధ రామి రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమల్ల ప్రసాద్ రావు, చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని, పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి లతో కలసి జిల్లా ఇంచార్జి మంత్రి, రెవిన్యూ, రిజిస్ట్రేషన్ ,స్టాంప్స్ శాఖ మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారభించారు.

ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి, రెవిన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి మాట్లాడుతూ.... చిన్నగొట్టిగల్లు మండలంలో విద్యా, సావూజిక అభివృద్ధి కోసం సేవా కార్యక్రమాలు చేపడుతున్న దాతలు, ప్రజాప్రతినిధులను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అభినందించారు. తాము పుట్టి పెరిగిన ప్రాంతాల అభివృద్ధికి ముందుకు వస్తున్న దాతల సేవా భావం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.



# మహారాష్ట్రను ముంచెత్తిన వర్షాలు.. విరిగి పడిన కొండ చరియలు





**ముంబయి/ఈటానగర్, జూన్ 24:** మహారాష్ట్ర రాజధాని ముంబయితోపాటు ఠాణె, పాల్ఘర్‌లను భారీ వర్షాలు ముంచెత్తాయి. పలు ప్రాంతాలు, రహదారులు జలదిగ్బంధం కావడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఠాణె-పుణె మధ్య కీలక మార్గమైన మాల్‌షేజ్ ఘాట్లో చెట్లు, కొండ చరియలు విరిగిపడటంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. భారీ వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ముంబయిలోని పలు ప్రాంతాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో అంధేరి ప్రాంతంలోని సబ్‌వేలు పూర్తిగా నీట మునిగింది. దీంతో ముందస్తు చర్యగా ఈ అండర్‌పాస్‌లో వాహనాల రాకపోకలను బీఎంసీ నిలిపివేసింది. మరోవైపు వాతావరణం అనుకూలంగా లేనందున విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నట్లు ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. విమానాల సమయాలను సంబంధిత వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని ప్రయాణికులకు సూచించారు. కాగా.. అరుణాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు వణికిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కీపన్యూర్ జిల్లాలో మెరుపు వరదలు ముంచెత్తాయి. యాజాలి సర్కిల్ పరిధిలోని పూసా సమీపంలో నీప్‌కో ప్రాజెక్టు కాలనీ వద్ద వరద పోటెత్తడంతో ముగ్గురు గల్లంతయ్యారు. నిర్మాణంలో ఉన్న రక్షణగోడ కూలిపోవడంతో భారీగా వరద నీరు చుట్టుపక్కల లోతట్టు ప్రాంతాల్లోకి ప్రవేశించింది. కనీసం 18 నివాస గృహాలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

# ఆ రోజంతా ఏడ్చా.. సువేందు ధైర్యం చెప్పారు

- ఎంపీ మహువా




కోల్‌కతా, జూన్ 24: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే పెద్ద సంఖ్యలో టీఎంసీ ఎమ్మెల్యేలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. టీఎంసీ నేతల ఫిరాయింపుల వేళ ఆ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకుటున్నాయి. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మహువా బెంగాల్ సీఎం సువేందు అధికారిని ప్రశంసించారు. పార్టీల గురించి పక్కనపెడితే సువేందు అధికారితో తనకు మంచి అనుబంధం ఉందని అన్నారు. టీఎంసీలో ఉన్న సమయంలో అనేక విషయాల్లో ఆయన తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు. 2014 ఎన్నికల్లో తనకు లోక్‌సభ టికెట్ దక్కనప్పుడు తాను ఎంతో బాధపడ్డానని మొయిత్రా పేర్కొన్నారు. రోజంతా ఏడ్చానని ఆ సమయంలో సువేంద్ అధికారి ధైర్యం చెప్పారని గుర్తు చేసుకున్నారు. 2016 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాను నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మద్దతిచ్చారన్నారు. అయితే, బీజేపీలో చేరిన తర్వాత సువేందును మళ్లీ కలవలేదన్నారు. కానీ, ఆయన చేసిన సాయాన్ని తాను ఎప్పటికీ మర్చిపోనన్నారు. టీఎంసీ విషయంలో మమతా బెనర్జీ చేయలేని పని సువేందు చేశారని పార్టీ పట్ల నిబద్ధత లేని నేతలు ఎవరో ఆయన వల్లే తమకు తెలిసిందని పేర్కొన్నారు. సొంతంగా గెలిచే సామర్థ్యం లేని వారిని కూడా పార్టీలోకి తీసుకోవడం వల్లే నేడు టీఎంసీ ఈ స్థితికి చేరిందని ఆమె అభిప్రాయపడ్డారు. మమతకు ఎంతో నమ్మకస్తురాలిగా పేరున్న మహువా.. సువేందును ప్రశంసించడంతో ఆమె కూడా పార్టీ మారనున్నారనే ఊహాగానాలు బెంగాల్ రాజకీయ వర్గాల్లో జోరందుకున్నాయి.

# వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు.. మోదీకి పిలుపు



**ఢిల్లీ, జూన్ 24:** అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో మృతిచెందిన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు వచ్చే నెలలో జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని భారత ప్రధాని నరేంద్ర మోడీని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు దౌత్య వర్గాలు బుధవారం వెల్లడించాయి. అయితే, దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటనేదీ రాలేదు.

జులై 5 నుంచి 9 వరకు ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమం జరగనుంది. తొలుత టెహ్రాన్, ఖోమ్ పట్టణాల్లో అంతిమ సంస్కారాలకు సంబంధించి కొన్ని కార్యక్రమాలు చేపట్టనున్నారు. 9వ తేదీన ఖమేనీ స్వస్థలం మషాద్‌లో ఆయనను ఖననం చేయనున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టిన తొలి రోజే 86 ఏళ్ల అలీ ఖమేనీ, మరో 40 మంది అత్యున్నత సైనికాధికారులు మృతి చెందారు. ఖమేనీ కుటుంబంలో కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు మృతి చెందగా కుమారుడు మొజ్తాబా కూడా గాయపడినట్లు వార్తలు వచ్చాయి. అలీ ఖమేనీ మరణంతో మొజ్తాబాను సుప్రీం లీడర్‌గా ఎన్నుకొన్న సంగతి తెలిసిందే.

# కుప్పకూలిన గోదాం.. శిథిలాల కింద 30 మంది



- ఇరువురు మృతి

**కోల్‌కతా, జూన్ 24:** కోల్‌కతాలోని తారాతలా ప్రాంతంలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఓ మూడు అంతస్తుల గోదాం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. శిథిలాల కింద 30 మందికిపైగా చిక్కుకున్నట్లు సమాచారం. వీరిలో ఇప్పటివరకు పది మందిని రక్షించగా మిగతావారిని వెలికి తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నిర్మాణంలో భారీ ఇనుప స్తంభాలు వాడడంతో సహాయక చర్యలు కష్టంగా మారాయి.

## ఇ-20 పెట్రోల్ సురక్షితమే

# వాహన బీమాపై ప్రభావం ఉండదు: కేంద్రం ప్రకటన




**ఢిల్లీ, జూన్ 24:** ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడటం వల్ల వాహనాల పనితీరు దెబ్బతింటుందని, వాహన బీమా వర్తించదంటూ జరుగుతోన్న ప్రచారంపై కేంద్రం స్పందించింది. ఇ20 పెట్రోల్ ఉపయోగించడంతో ఇంజిన్ నాణ్యతపై ఎలాంటి దుష్ప్రభావం ఉండబోదని, వాహన బీమా కూడా రద్దు కాదని స్పష్టం చేసింది. ఇ20 పెట్రోల్ ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇంజిన్ పాడైపోవడం, వాహనాలు ఆగిపోవడం వంటి సమస్యలు తలెత్తలేదని పేర్కొంది.

బ్లెండెడ్ ఇథనాల్‌ను అమెరికా, బ్రెజిల్ వంటి దేశాల్లోనూ వినియోగిస్తున్నారని కేంద్ర పెట్రోలియం, చమురు మంత్రిత్వ శాఖ పేర్కొంది. ''చెరకు రసం, మొలాసిస్, మొక్కజొన్న, బ్రౌన్ రైస్ వంటి ఉత్పత్తుల నుంచి ఇథనాల్ తీస్తారు. డిస్టిలేషన్ వంటి ఇండస్ట్రియల్ ప్రక్రియలో ఇథనాల్ మిశ్రమాలు పూర్తిగా మారిపోతాయి. ఇథనాల్ బ్లెండింగ్ వల్ల చమురు దిగుమతులు తగ్గడమే కాకుండా విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుంది. కర్బన ఉద్గారాలు తగ్గుతాయి'' అని కేంద్రం ఓ ప్రకటనలో పేర్కొంది. బ్లెండెడ్ ఇథనాల్‌పై సోషల్ మీడియా జరుగుతున్న వదంతులను నమ్మొద్దని, శాస్త్రీయపరమైన ఆధారాలను విశ్వసించాలని సూచించింది. ఇటీవల ఇ-20 ఇథనాల్ నింపిన ఫ్యూయల్ ట్యాంకులకు చీమలు పట్టాయన్న ప్రచారాన్నీ కేంద్రం కొట్టిపారేసింది.



# సీయూఈటీ-2026: ఎమ్మెల్యే కుమార్తెకు

## ఆల్‌ఇండియా ఫస్ట్ ర్యాంకు

**ఢిల్లీ, జూన్ 24:** దేశ వ్యాప్తంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థల్లో యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన సీయూఈటీ (యూజీ) పరీక్షా ఫలితాల్లోబీజేపి ఎమ్మెల్యే కైలాశ్ గహ్లోత్ కుమార్తె దేవినా జాతీయస్థాయిలో తొలి ర్యాంకు సాధించారు. తాజాగా వెల్లడైన ఫలితాల్లో ఆమె టాప్‌స్కోర్‌గా నిలిచారు. మంచి ర్యాంకు వస్తుందని అనుకున్నానని కానీ, తొలిస్థానం దక్కించుకోవడం ఆశ్చర్యానికి గురిచేసిందని ఆమె సంతోషం వ్యక్తంచేశారు. ''జాతీయస్థాయిలో ఫస్ట్ ర్యాంకు ఇప్పటికీ కలగానే ఉంది. మళ్లీ మళ్లీ నా నంబర్ చెక్ చేసుకున్నాను. ప్రతి రోజూ ప్రతి సబ్జెక్ట్ చదివాను. ఒక అంశానికే పరిమితం కాలేదు. తరచూ రివిజన్ చేశాను. గత పేపర్లను సాధన చేశాను. బోర్డ్ ఎగ్జామ్స్ పూర్తయిన తర్వాత క్యూట్కు ప్రిపరేషన్ ప్రారంభించాను. నా భవిష్యత్తును నిర్ణయించే అంశం అది. ప్రిపరేషన్ విషయంతో కొంత టెన్షన్ పడ్డాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముందుకెళ్లాను. నాకు సాహిత్యమంటే ఇష్టం. జర్నలిజంపైనా ఆసక్తి ఉంది. నా తండ్రి చేస్తోన్న సేవను చూసి.. రాజకీయాలపైనా ఇష్టం ఏర్పడింది'' అని దేవినా మీడియాతో అన్నారు. కైలాశ్ గహ్లోత్.. ఢిల్లీ రవాణా, పర్యావరణ శాఖ మంత్రిగా పనిచేశారు. 2024లో ఆమ్‌ఆద్మీపార్టీ నుంచి బీజేపీలో చేరారు. బిజ్వాసన్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తన కుమార్తె హార్డ్ వర్క్ వల్లే ఈ ర్యాంకు సాధ్యం అయిందని కైలాశ్ సంతోషం వ్యక్తంచేశారు. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ -2026 మే 11 నుంచి 31వ తేదీ మధ్య, జూన్ 6, 7 తేదీల్లో మొత్తం 19 రోజుల పాటు 35 షిఫ్టుల్లో నిర్వహించారు. మంగళవారం ఫలితాలను ప్రకటించారు.

## ఉక్రెయిన్‌లోకి భారత్ దళాలు..

# వాన్స్ ప్రతిపాదనను కొట్టేసిన ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 24:** అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించేందుకు విస్తృత ప్రయత్నాలు చేశారు. ఇందుకోసం అగ్రరాజ్య సర్కారు అనేక ప్రతిపాదనలు రూపొందించింది. ఒక దశలో భారత బలగాలను కదనరంగంలోకి శాంతిదూతలుగా పంపించాలని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సూచించారు. అయితే, దీన్ని ట్రంప్ కొట్టిపారేశారు. తాజాగా విడుదలైన ఓ పుస్తకంతో ఈ కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'రెజీమ్ ఛేంజ్' పేరుతో ప్రముఖ రచయితలు మ్యాగీ హాబర్మాన్, జొనాథన్ స్వాన్ రాసిన పుస్తకం జూన్ 23న విడుదలైంది. ఇందులో ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు కోసం అమెరికా సర్కారు చేసిన ప్రయత్నాలను ప్రస్తావించారు. ఆ పుస్తకం ప్రకారం అగ్రరాజ్య అధ్యక్షుడిగా రెండోసారి ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన పది రోజుల తర్వాత ఓవల్ ఆఫీసులో కీలక సమావేశం జరిగింది.

ఆ భేటీలో ఉక్రెయిన్-రష్యాకు ప్రత్యేక రాయబారిగా ఉన్న రిటైర్డ్ ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ కీత్ కెలాగ్ యుద్ధం ముగింపునకు ఓ ముసాయిదా ప్రణాళికను సమర్పించారు. యుద్ధ క్షేత్రంలో విదేశీ సైనిక దళాలను ఉపయోగించి కాల్పుల విరమణను పర్యవేక్షించే ఏర్పాట్లు చేయాలని ప్రతిపాదించారు. ఫ్రాన్స్, బ్రిటన్, నెదర్లాండ్స్ వంటి ఐరోపా దేశాల నుంచి శాంతి పరిరక్షణ దళాలను పంపించే ప్రణాళికను పేర్కొన్నారు.

అయితే, దానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అభ్యంతరం తెలిపారు. నాటో సభ్య దేశాలకు చెందిన సైనిక బలగాలను ఉక్రెయిన్‌లోకి పంపితే అది రష్యాను రెచ్చగొట్టినట్లే అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దానివల్ల ఉద్రిక్తతలు మరింత పెరగడంతో పాటు.. అమెరికా ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనాల్సిన పరిస్థితి తలెత్తుందని అంచనా వేశారు. ఈ క్రమంలోనే ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించిన వాన్స్ ఐరోపాయేతర దేశాల బలగాలను పంపించొచ్చని పేర్కొన్నారు. భారత్, సౌదీ అరేబియా దేశాల పేర్లను ఆయన ప్రతిపాదించారు.

కాగా.. వాన్స్ ప్రతిపాదనలను అధ్యక్షుడు ట్రంప్ తోసిపుచ్చినట్లు ఆ పుస్తకంలో పేర్కొన్నారు. ''భారత ప్రధాని మోడీతో నాకు బలమైన అనుబంధం ఉంది. ఆయన నన్ను ఎంతగానో ఇష్టపడతారు. కానీ, భారత్ ఎప్పటికీ దీనికి అంగీకరించదు. ఇలాంటి విషయాల్లో జోక్యం చేసుకుని మూల్యం చెల్లించుకోవాలని అనుకోదు'' అని నాడు ట్రంప్ అన్నట్లు తాజా పుస్తకంలో వివరించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీరును కూడా ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారట. ఆయనో అసమర్థ నేత అని, అమెరికా నుంచి నిధులు పొందుతూ కూడా.. సొంత దేశాన్ని నాశనం చేసుకుంటున్నారని నాడు జెలెన్‌స్కీపై మండిపడినట్లు తెలిసింది.

## ఇదో చెత్త డేటా భారత సుంకాలపై నాడు ట్రంప్ ఫైర్

**వాషింగ్టన్, జూన్ 24:** రెండోసారి అధికారం చేపట్టిన అనంతరం ట్రంప్ భారత సుంకాల విషయంలో సొంత యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాపై భారత్ విధించే సుంకాలను తక్కువ చేసి చూపినందుకు వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాజాగా విడుదలైన 'రెజీమ్ ఛేంజ్' పుస్తకంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. పుస్తకంలోని వివరాల ప్రకారం.. ట్రంప్ అధికారం చేపట్టిన వెంటనే విదేశాలు తమ దేశంపై విధించే సుంకాల వివరాలను అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం ట్రంప్ ముందు ఉంచింది. ఆ గణాంకాల్లో భారత్.. అమెరికాపై విధించే సుంకాలు తక్కువ మొత్తంలో ఉన్నట్లు చూపించడంతో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ కనీసం 175 శాతం సుంకాలు విధించిందని వాదించారు. భారత్, చైనాలు.. అమెరికాపై ఎంత సుంకాలు విధిస్తున్నాయనే కచ్చితమైన గణాంకాలు తెలియజేయకుండా చెత్త డేటాను ఇస్తున్నారని ట్రంప్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని వివరించడానికి లుట్నిక్ ప్రయత్నించగా.. అదంతా తప్పుడు డేటా అని కొట్టిపడేశారు. అమెరికా ఎగుమతులపై భారత్ అధిక సుంకాలు విధిస్తోందని ట్రంప్ పలుమార్లు ఆరోపించారు. అనంతరం ఇరుదేశాల మధ్య జరిగిన వాణిజ్య చర్చల్లోనూ ప్రపంచ దేశాలన్నింటిలో భారత్ మాత్రమే తమపై అధికంగా సుంకాలు విధిస్తోందని మండిపడ్డారు. ఈ విషయంపై ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో సైతం పలుమార్లు భారత్పై విమర్శలు చేశారు. అనంతరం ట్రంప్ భారత్పై భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే.

# హర్మూజ్లో ఎటువంటి సుంకాలేవ్ - ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 24:** హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. జలసంధి మార్గంలో ప్రయాణించే నౌకల నుంచి ఎటువంటి సుంకాలు, బీమా ఖర్చులు లేదా ఇతర ఏవిధమైన రుసుములూ వసూలు చేయమని ఇరాన్ హామీ ఇచ్చిందన్నారు. ఒకవేళ ఇది తప్పుడు సమాచారమైతే, వారితో చర్చలను వెంటనే నిలిపివేస్తామన్నారు.

ఇక ఇరాన్‌కు నేరుగా ఎటువంటి నిధులు విడుదల చేయడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. మొక్కజొన్న, గోధుమ, సోయాబీన్ తదితర ఆహార పదార్థాలను కొనుగోలు చేసేందుకు వారికి సంబంధించిన నిధుల్లోంచి కొంత మొత్తాన్ని అమెరికా రైతులు, పశుపోషకులకు విడుదల చేస్తామని అన్నారు. ప్రస్తుతం ఇరాన్‌కు ఆహార పదార్థాలు అత్యవసరమని, వాటిని ప్రత్యేకంగా అమెరికా నుంచే కొనుగోలు చేసి సరఫరా చేస్తామన్నారు.

హర్మూజ్‌లో ఇటీవల ట్రాఫిక్ పెరిగిందని, రికార్డు స్థాయిలో చమురు రవాణా జరుగుతోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నారు. వీటికి సంబంధించి మీడియాలో వచ్చిన కథనాలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఓ అమెరికా వార్తా సంస్థ పేర్కొన్న వివరాల ప్రకారం జూన్ 12-14 తేదీల్లో 32 నౌకలు హర్మూజ్‌ను దాటగా 19-21 తేదీల్లో 93 నౌకలు సురక్షితంగా జలసంధిని దాటినట్లు తెలుస్తోంది.

# గోల్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో సీఎంతో పాల్గొన్న మంత్రి టీజీ భరత్ గుప్తా



**కర్నూలు జూన్ 24మనం న్యూస్‌:** గోల్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేసేందుకు కర్నూల్ జిల్లా జొన్నగిరికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా హెలిప్యాడ్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గోల్ మైనింగ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం మైనింగ్ జరిగే ప్రాంతంలో భారీ వాహనాలు నడిపేలా సిమ్యులేటర్ యంత్రాలపై మహిళలకు, యువతకు శిక్షణ ఇచ్చే కేంద్రాన్ని సీఎంతో కలిసి మంత్రి సందర్శించారు. అనంతరం ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండవ ప్లాంటుకు శంకుస్థాపన చేశారు.

# రాష్ట్రంలో సువర్ణాధ్యాయం ప్రారంభం

## ఏపీలో పండని పంటలు లేవు... దొరకని ఖనిజాలు లేవు



- సీమకు గ్రోత్ ఇంజన్‌గా జొన్నగిరి గోల్ ఫీలడ్స్
- జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో ఏపీ సీఎం చంద్రబాబు

**జొన్నగిరి, జూన్ 24మనం న్యూస్‌:** రాష్ట్రంలో సువర్ణాధ్యాయం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. జొన్నగిరి గోల్ ఫీల్డ్సులో బంగారం వెలికితీతతో సీమకు పునర్ వైభవం రానుందని అన్నారు. బుధవారం సీఎం చంద్రబాబు కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరిలో పర్యటించారు. జొన్నగిరి గోల్ ఫీల్డ్సులో జియో మైసూర్ - డెక్కన్ గోల్ మైన్స్ సంస్థలు ఏర్పాటు చేసిన గోల్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించారు. ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బంగారం శుద్ధి కోసం బంగారు ఖనిజంతో కూడిన మట్టిని తీసుకెళ్లే భారీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. మైనింగ్ జరిగే ప్రాంతంలో భారీ వాహనాలు నడిపేలా సిమ్యులేటర్ యంత్రాలపై మహిళలకు, యువతకు శిక్షణ ఇచ్చే కేంద్రాన్ని సీఎం సందర్శించారు. రూ.405 కోట్ల పెట్టుబడితో జొన్నగిరిలో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్ మైన్స్ సంస్థలు బంగారాన్ని మైనింగ్ చేసి, ప్రాసెస్ చేసి విక్రయించనున్నారు. జొన్నగిరి గోల్ ఫీల్డ్సులో తొలి ఏడాది 400 కేజీలతో మైనింగ్ ప్రారంభించి తదుపరి దశలో 900 కేజీలు, అనంతరం 2 టన్నుల వరకూ బంగారాన్ని ఉత్పత్తి చేసే ప్రాజెక్టును సీఎం ప్రారంభించారు. జియో మైసూర్ - డెక్కన్ గోల్ మైన్స్ సంస్థలు జొన్నగిరిలో తవ్వకాలు జరిపి ముడి ఖనిజం నుంచి బంగారం ఉత్పత్తి చేసే ప్రక్రియను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. ఉత్పత్తి యూనిట్లోని వేర్వేరు విభాగాలను పరిశీలించారు. బంగారు బిస్కట్లు సహా వివిధ రూపాల్లోని తుది ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ నుంచి తుది ఉత్పత్తి వరకూ జరిగే ప్రక్రియలను జియో మైసూర్ సంస్థ చైర్మన్ ప్రభాకరన్, ఎండీ నవీన్ లాల్ చంద్ర సీఎం చంద్రబాబుకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఉద్దేశించి ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం మొదలైంది. ఈ సువర్ణ అధ్యాయానికి రతనాల సీమ రాయలసీమ కేంద్రమైంది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ గోల్ మైనింగ్ ప్రాజెక్టును లాంచ్ చేయడం శుభపరిణామం. విస్తరణ యూనిట్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. ఈ ప్రాజెక్ట్ చేపట్టిన సంస్థల యాజమాన్యాలకు, ఉద్యోగులకు, కార్మికులకు అభినందనలు. జొన్నగిరి ఘనత నేటిది కాదు. ఈ ప్రాంతానికి ఎంతో చరిత్ర ఉంది. ఈ ప్రాంతాన్ని సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి కాలంలో ప్రసిద్ధి చెందిన ప్రాంతంగా ఉన్న సువర్ణగిరే ఈనాటి జొన్నగిరి. వందల సంవత్సరాల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. ఇక్కడకు దగ్గరలో లభించిన అశోకుడి ఎర్రగుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చెబుతున్నాయి. రాయలసీమ అంటేనే రతనాల సీమ. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో సీమలో రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారు. ప్రపంచానికి

# ఖద్దర్ చేతిలో... ఖాకీలా...?



**అనంతగిరిలో పోలీస్ రాజ్యం ప్రశ్నిస్తే కేసు నమోదు బైండోవర్**

**పోలీసులపై రాజకీయ పెత్తనం అధికార పార్టీ ఆదేశాలు వెంటనే కేసు నమోదులా**

**అధికార పార్టీకి పోలీసుల అండదండలు ప్రతిపక్షం ప్రజలపై కేసుల బెదిరింపులు**

**ఇప్పటికైనా స్థానిక పోలీసుల తీరుపై ఉన్నత అధికారులు దృష్టి పెట్టేనా**

**అనంతగిరి జూన్ 24 (మనం న్యూస్):** అధికార పార్టీ రాజకీయ నాయకులు చెబితే చాలు కొంతమంది పోలీసులకు... శిలా శాసనంగా మారింది... ఇటీవల వీరి తీరును చూస్తే ఖద్దర్ హస్తంలో... ఖాకిలా...అన్న చందంగా తయారైంది అనే విమర్శలు స్థానిక ప్రజల నుండి పెద్ద ఎత్తున వినపడుతోంది... వివరాల్లోకి వెళితే... జిల్లా పరిధిలోని అనంతగిరి మండలం లో పోలీస్ రాజ్యం ప్రశ్నిస్తే కేసు, మాట్లాడితే బైండోవర్.. అనే చర్చ స్థానికుల నుంచి వినపడుతుంది...ఎమ్మెల్యే నుండి ఫోన్ వస్తేనే కేసు అనంతగిరి పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు తలెత్తుతున్నాయి..పోలీస్ స్టేషన్లో ప్రజలకు న్యాయం దొరకదు.. అధికార పార్టీకి పూర్తి మద్దతు.. ఇటీవల జరుగుతున్న వరుస పరిణామాలు చూస్తే ఖాకీలతో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయా లేదా అనే సందేహం కలుగుతుంది...అధికార పార్టీ ఆగడాలను అడ్డుకునేవారిపై కేసుల పరంపర... ప్రజల్లో భయం మొదలవుతుంది... ఈ నేపథ్యంలో స్థానిక పోలీసుల పనితీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష నాయకులు, సామాన్య ప్రజలపై వరుసగా కేసులు నమోదు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అక్రమాలు, ఆగడాలను ప్రశ్నించిన వారిపైనే ఏదో రకంగా కేసులు నమోదవుతున్నాయని చర్చ ప్రజల్లో జోరుగా వినపడుతుంది.. దీంతో జనంలో పోలీసుల వ్యవహార శైలి ప్రశ్నార్థకంగా మారింది.. ఇందులో భాగంగా ఇటీవల అనంతగిరి పోలీస్ స్టేషన్లో పూర్తి స్థాయి ఎస్సై లేకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది.నెల రోజులుగా ఎస్సై పోస్టు ఖాళీగా ఉండడం మండలంలో పెద్ద ఎత్తున..చర్చనీయాంశమైంది.మొన్నటి వరకు అనంతగిరి ఎస్సైగా పనిచేసిన నవీన్ కుమార్ మేళ్లచెరువు ఎస్సైగా బదిలీపై వెళ్లడం తెలిసిందే.. ఈనేపథ్యంలో అనంతగిరి ఇన్చార్జి బాధ్యతలలో కూడా ఆయనే కొనసాగిస్తున్నారు.రెండు మండలాల బాధ్యతలు ఒకే అధికారిపై పడడంతో.. సమర్ధవంతమైన పర్యవేక్షణ కష్టమైందని అదే స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కొందరి పోలీసులలో చర్చ జరుగుతుండటం గమనార్హం దీనికి తోడు వరుస సంఘటనలు చూస్తే శాంతిభద్రతల పరిరక్షణలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పలువురు నెట్ంజర్లుఅభిప్రాయపడుతున్నారు చిన్న చిన్న వివాదాలు సైతం పెద్ద సమస్యలుగా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా.. కోదాడ రూరల్ సీఐగా ఉన్న రామకృష్ణారెడ్డి మునగాల సీఐ బాధ్యతలు అదనంగా నిర్వర్తిస్తున్నారు.రెండు సర్కిళ్లను ఒకే సీఐ పర్యవేక్షించడం వల్ల కొంత మేరకు వ్యవస్థ బలహీనపడుతోందనే విమర్శలు లేకపోలేదు.. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక సమస్యలపై ఫిర్యాదులపై తక్షణ స్పందన లేకపోవడం ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది అనడానికి ఒక కారణంగా తెలుస్తోంది..అనంతగిరి పోలీస్ స్టేషన్లో ఇన్చార్జిగా ఉన్న ఏఎస్ఐల వ్యవహార శైలిపై పలు అనుమానాలకు దారితీస్తుంది.. అధికార పార్టీ నాయకుల నుంచి చెరవాళ్ళు కాల్ వచ్చిందంటే.. వెంటనే చర్యలు అది ఏ సమస్య అయినా.. పరిశీలించకుండానే వెంటనే కేసులు నమోదు చేస్తున్నారని.. ఆరోపణలు వినపడడం ఆశ్చర్యానికి




కలిగిస్తుంది...ముఖ్యంగా ఎమ్మెల్యే నుంచి వచ్చే ఫోన్ కాల్స్కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే గుసగుసలు చక్కర్లు కొడుతున్నాయి అధికార పార్టీ నేతలు ఇచ్చే ఫిర్యాదులు వెంటనే కేసులుగా మారుతున్నాయని...అదే సామాన్య ప్రజల ఫిర్యాదులు చేస్తే నిర్లక్ష్య ధోరణి కనపడుతుందని బహిరంగంగానే చర్చ నడుస్తోంది.. ఇక మరో కొత్త విశేషం ఏంటంటే... పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న... ఓ ఏఎస్సై తన చేతివాటానికి పని చెబుతూ డబ్బు వసూల పరువానికి చెరలేపాడని పుకార్లు షికార్లు కొడుతుండటం కోసమేరుపు.. గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకుల పెత్తనం పెరిగిందని వారి అనుచరులు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ చర్యలను ప్రశ్నించిన వారిని లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలు అలాగే కొంతమందిపై బైండోవర్ చర్యలు తీసుకోవడం ద్వారా భయపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడటానికే వెనుకంజ వేస్తున్నారు. ఇటీవల వాయిలసింగారం గ్రామంలో జరిగిన ఒక ఘటన మరింత చర్చకు దారి తీసింది.ఒక ఉద్యోగి విధుల్లో అవినీతికి పాల్పడుతున్నారంటూ వాట్సాప్లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది.సోషల్ మీడియా వేదికగా ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.ఈ చర్చపై స్థానిక రాజకీయ వర్గాల్లో కలకలం సృష్టించింది..ఆ సందేశాలపై కొంతమందిపై కేసు నమోదు చేయాలని రాజకీయ ఒత్తిడి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.ఎమ్మెల్యే ఫోన్ చేసి కేసు పెట్టాలని పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయం ప్రస్తుతం మండల వ్యాప్తంగా పాకింది.. దీనితో పోలీసులు స్వతంత్రంగా పనిచేస్తున్నారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.రాజకీయ ఒత్తిడితో నిర్ణయాలు తీసుకుంటున్నారనే అనుమానాలు పెరుగుతున్నాయి.ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సామాజిక కార్యకర్తలు బహిరంగంగానే విమర్శన హస్త్రాలు గుప్పిస్తున్నారు.అమీనాబాద్ గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు మరింత వివాదాస్పదంగా మారాయి ఒక మహిళ ఇంటికి అర్ధరాత్రి సమయంలో విచారణ పేరుతో ఏఎస్ఐ వెళ్లి అసభ్యంగా ప్రవర్తించారని, మహిళ కానిస్టేబుల్ లేకుండా విచారణ జరిపారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, కోదాడ డీఎస్పీకి ఫిర్యాదు చేసినా స్పందన సరిగా లేకపోవడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని సమాచారం... అదే గ్రామంలో మరో ఘటనలో ఒక మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి దాడి ప్రయత్నం చేయబోగా భర్త అడ్డుపోవడంతో పెద్ద ఘర్షణ నెలకొంనీ ఇరువర్గాలు దాడులు చేసుకున్నారు దీనిపై ఇరువర్గాలు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు దర్యాప్తు చేయకుండా రాజకీయ నాయకుల ఒత్తిళ్ల మేరకు బాధితులపైనే కేసులు నమోదు చేశారని అధికార పార్టీ నాయకుల ఒత్తిడితోనే కేసు నమోదు జరిగిందని స్థానికంగా వినపడుతున్న ప్రశ్న... ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ అభిప్రాయం చెప్పే హక్కు ఉంది.ప్రశ్నించడం నేరం కాదని న్యాయ నిపుణులు చెబుతున్నారు.అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించినందుకు కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.చట్టం ముందు అందరూ సమానమనే రాజ్యాంగ సూత్రం అమలులో ఉండాలి.పోలీసులు రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహించాల్సి ఉంది.. కానీ పేదలు, రైతులు, కూలీలు, నిరుద్యోగ యువత తమ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వెళ్తున్నారు. వారి ఫిర్యాదులకు సరైన స్పందన రావడం లేదని అభిప్రాయం ఏర్పడుతుండటంతో... ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల నమ్మకం కోల్పోతే పోలీస్ వ్యవస్థ బలహీనపడుతుంది.న్యాయం ఆలస్యమైతే అన్యాయం పెరుగుతుందని పలువురు హెచ్చరిస్తున్నారు.ఈ మండల పోలీస్ స్టేషన్ సిబ్బంది ఇది నిర్వహణ పని తీరుపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సాధించి ఇలాంటి ఆరోపణలకు తావు లేకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.. దీనితోపాటు..మండలంలో పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయాలని స్థానిక ప్రజల నుండి డిమాండ్ పెరుగుతోంది.ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి నిష్పక్షపాతంగా చట్టాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజల హక్కులను కాపాడటమే పోలీసుల అసలు బాధ్యత అని ఆ ప్రాంత ప్రజలు మరో మారు గుర్తు చేస్తున్నారు..


## బిఎల్ఓలకు సామాగ్రి పంపిణీ



**తిరుమలగిరి, జూన్ 24 (మనం న్యూస్):** తిరుమలగిరి మండల తహసిల్దార్ కార్యాలయంలో సర్ సర్వే లో పాల్గొనే బి ఎల్ ఓ లకు సామాగ్రి ను తహసిల్దార్ బి. హరిప్రసాద్ బుదవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ఈ నెల 25 గురువారం నుండి మండలంలో సర్ కార్యక్రమం ప్రారంభం అవుతుందని, సర్వేలో పాల్గొనే సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఓటర్ నమోదు కార్యక్రమము డబల్ ఓట్లను తొలగించుట కొత్త ఓటర్లను చేర్చుట, చనిపోయిన, ఓట్లను తొలగించుటకు కార్యక్రమానికి వెళ్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతమగుటకు అందరూ బిఎల్ ఏ లు బిఎల్వోలు సమన్వయంతో పనిచేసి అర్హత గల ఓట్లు ఏవి కూడా పోకుండా అందరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్య క్రమాలో నాయబ్ తాసిల్దార్ జాన్ మొహమ్మద్, సూపర్వైజర్లు, బిఎల్వోలు, పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**కల్యాణోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి**



**నల్లగొండ, జూన్ 24 (మనం ప్రతినిధి):** బుధవారం మంత్రి నల్గొండ జిల్లా, కనగల్ మండలం, ధరేవేశిపురం లో జరుగుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా దేవాలయం నుండి కల్యాణ మండపం వరకు మంత్రి మేళతాళాలతో ఊరేగింపు గా పట్టు వస్త్రాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులతో కలిసి శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి జమదగ్ని మహర్షి వారి దివ్య కల్యాణ మహోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని, జిల్లా ,రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా ఆశీర్వదించాలని మంత్రి కోరారు. దరవేశిపురం రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి, ఆలయ ఈవో అంబటి నాగిరెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పాల్గొన్నారు.

## డ్రగ్స్ జీవితాన్ని ఆగం పట్టిస్తది


- **ఉన్నత ఆశలతో చదువు భవిష్యత్ కు బంగారు బాటలు వేస్తది**
- **డ్రగ్స్ కి బానిస కావొద్దు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు**
- **కోదాడ డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి**




**నేరేడుచర్ల, జూన్ 24 మనం న్యూస్:** డ్రగ్స్ వాడకం జీవితాన్ని నాశనం చేస్తుందని ఉన్నత ఆశయాలతో చదువు భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని డ్రగ్స్ కన్నా విద్యార్థి భవిష్యత్తు మిన్న అని కోదాడ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నాడు నేరేడుచర్ల పోలీస్ వారు విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం వల్ల కలిగే నష్టాలు, దుష్పరిణామాలు చట్టపరమైన చర్యలపై అవగాహన కలిగించారు. మాదకద్రవ్యాల అలవాటు వల్ల కలిగే శారీరక, మానసిక ఆరోగ్య నష్టాలను విద్యార్థులకు వివరించారు. క్షణికానందం కోసం వ్యసనాల బారిన పడి బంగారు భవిష్యత్తును, నాశనం చేసుకోవద్దు అని . డ్రగ్స్ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడితే చట్టపరంగా కఠినమైన శిక్షలు ఉంటాయని, క్రిమినల్ కేసులు నమోదైతే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతారని స్పష్టం చేశారు. చదువుపై దృష్టి పెట్టి సమాజంలో ఉన్నత స్థానాలు అధిరోహించాలని, ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఏ సైదిరెడ్డి కాలేజీ ప్రిన్సిపాల్ వెంకట రమణ బోధన సిబ్బంది మద్దె మడుగు సైదులు వనపర్తి శ్రీనివాస్ తదితరు పాల్గొన్నారు.

## గుండె జబ్బుకు వయసుతో సంబంధం లేదు

**సూర్యాపేట టౌన్, జూన్ 24, మనం న్యూస్:** గుండె జబ్బుకు వయసు తో సంబంధం లేదని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పొలమూరి ప్రణీత్ అన్నారు. బుధవారం పట్టణంలోని ట్రిపుల్ ఆర్ ఫంక్షన్ హాలులో గుండె జబ్బుకు సంబంధించిన అవగాహన పై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...... మారుతున్న జీవన శైలి కారణంగా పలు వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మందస్తు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ తమ హెల్త్ రిస్క్ గురించి తెలుసుకోవాలన్నారు. గుండె జబ్బులకు వయసుతో సంబంధం లేదని, ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల గుండెకి హాని జరుగుతుందన్నారు. గుండె ఆరోగ్యానికి సంబంధించిన ముఖ్య విషయాలపై దృష్టి పెట్టాలని, ముందు నుంచే జాగ్రత్తలు తీసుకుంటే గుండె జబ్బులను నివారించవచ్చని పేర్కొన్నారు. ఛాతిలో నొప్పి లేదా ఏదో బరువుగా ఉండటం, కొద్దిపాటి శ్రమకే లేదా విశ్రాంతి సమయంలో శ్వాస ఆడకపోవడం, స్పృహ కోల్పోవడం, అలసటగా అనిపించడం, తరచూ తల తిరగడం, ఎడమ చేతి, మెడ, దవడ,వీపులో నొప్పి వంటి లక్షణాలు అనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న వైద్యున్ని సంప్రదించాలన్నారు. రోజువారీ వ్యాయామం, యోగా, నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. ఉప్పు, అధికంగా నూనె, జంక్ ఫుడ్స్, నిల్వ ఉండే పదార్థాలను తినడం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్, కర్నె సుదర్శన్ రెడ్డి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కోకా ప్రవీణ్ పాల్గొన్నారు.




## విద్యార్థులు సమయాన్ని వృధా చేయవద్దు

- **సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి**
- **చెడు వ్యసనాలకు స్నేహాలకు దూరం పెట్టాలి**
- **డ్రగ్స్ గంజాయి నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి**
- **జిల్లా ఎస్పీ నరసింహ**




**సూర్యాపేట, జూన్ 24 (మనం ప్రతినిధి):** డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాలలో భాగంగా డ్రగ్స్ నిర్మూలనపై ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన సూర్యాపేట పట్టణ పోలీసులు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ....మంచి విద్యార్థి ఎల్లప్పుడూ ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేస్తారని, ఉపాధ్యాయుల తల్లిదండ్రుల కలలను నిజం చేయడానికి, లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమిస్తారని ఎస్పి అన్నారు. సమయం చాలా విలువైనదని విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోవద్దని అనునిత్యం లక్ష్యం కోసం సాధన చేయాలని అన్నారు, చెడు వ్యసనాలకు చెడు అలవాట్లకు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని మంచి స్నేహితుని మంచి పుస్తకాన్ని ఎంచుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ప్రభావంతో చదువులను అశ్రద్ధ చేస్తున్నారని సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని కోరారు. విద్యార్థులు యువత భద్రతల పోలీస్ శాఖల నిత్యం పనిచేస్తుందని తెలిపారు. గంజాయి సంబంధత కేసుల్లో ఉన్న వారిపై పోలీసు శాఖ పూర్తి నిగా ఉంచిందని అన్నారు. డ్రగ్స్ కు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని అర్థాంతరంగా జీవితాన్ని కోల్పోతారని తెలిపారు. దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉన్నదని, గంజాయి మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత యువశక్తిని కోల్పోతుందని గంజాయి లాంటి డ్రగ్స్ ను జీవితాలలోకి రానివ్వకూడదని అన్నారు, డ్రగ్స్ రహిత సమాజ స్థాపన డ్రగ్స్ రహిత సూర్యాపేట జిల్లా స్థాపన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని డ్రగ్ సంబంధింత సమాచారాన్ని స్థానిక పోలీసులకు లేదా 1908 కు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమం నందు సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మహిళా బాలల పట్ల వేధింపులు పాల్పడితే చర్యలు**

మహిళలు, బాలల భద్రత మరియు రక్షణకు అన్ని ప్రభుత్వ సంక్షేమ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ భరోసా టీమ్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని పోలీస్ అధికారులు, శిశు సంక్షేమ శాఖ, మహిళా సంక్షేమ శాఖ, జిల్లా చైల్ లైన్ మరియు చైల్ వెల్ఫేర్ కమిటీ అధికారులతో ఎస్పీ గారు ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మహిళా, బాల బాధితుల పట్ల అధికారులు మానవతాదృక్పథంతో వ్యవహరించాలి. మహిళలు, బాలలపై దాడులు, వేధింపులు, లైంగిక దాడుల వంటి ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించి బాధితులకు నైతిక అండగా నిలవాలి, వారిలో భరోసా, ధైర్యం కల్పించాల తెలిపారు.పోలీస్ భరోసా సెంటర్ సిబ్బంది ఎల్లప్పుడూ బాధితుల పక్షాన నిలబడి, అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆదేశించారు. ఇలాంటి కేసుల దర్యాప్తులో భాగంగా వాంగ్మూలాలు, సాక్ష్యాలను నమోదు చేయడంలో ఆధునిక శాస్త్ర సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోర్టు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ బాధితులకు త్వరగా న్యాయం అందేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులు ఏ పోలీస్ స్టేషన్కు వచ్చినా, స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా తక్షణమే కేసులు నమోదు చేసి, వారికి తగిన రక్షణ కల్పించాలని పోలీసు అధికారులను తెలిపినారు. మహిళలు, బాలల రక్షణలో నిర్లక్ష్యం వహించకుండా, వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.మహిళలు బాలల పట్ల వేధింపులు జరిగినట్లయితే డయల్ 100, 112, హెల్ప్ లైన్ నెంబర్ 1098 కు సమాచారం ఇవ్వాలి, ఫిర్యాదులు చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, చైల్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ రమణారావు, జిల్లా జువెనల్ ప్రోహిబిషన్ అధికారి, డిసిపిఓ రవి కుమార్ ఇతర అధికారులు చైతన్య, బిక్షం, పోలీస్ భరోసా సెంటర్ మహిళా ఎస్ఐ మౌనిక, ఏఎస్ఐ సైదాబి, చైల్ కేర్ హెల్ప్ లైన్ అధికారులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## యాప్‌లలో లేని యూరియా .. షాపులలో ఎలా ఉంటుంది

- **బ్లాక్ మార్కెట్లలో యూరియా అక్రమ దందా**
- **మెట్రో ట్రైన్‌పై ప్రభుత్వ నిర్ణయం దారుణం**
- **తెలంగాణను ఆగం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు**
- **హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి**



**నేరేడుచర్ల, జూన్ 24 మనం న్యూస్:** యాప్‌లలో లేని యూరియా ఫర్టిలైజర్ షాప్ లలో ఎలా దర్శనమిస్తుందని రైతులకు న్యాయంగా దక్కాల్సిన యూరియా బ్లాక్ మార్కెట్లకు ఎలా తరులుతుందని అక్రమాలకు అడ్డాగా మారిన యూరియా యాప్ ను రద్దు చేయాలని హుజూర్నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో గల బీ ఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ బిజెపి ఆడుతున్న కుటిల రాజకీయాలు తెలంగాణ ప్రజలకు తెలుసని మెట్రో రైలు పై తీసుకున్న నిర్ణయాలు ప్రజలకు తెలుసు అని తెలంగాణ వనరులను రేవంత్ రెడ్డి ఆగం పట్టించారని గతం కంటే నేడు ఎక్కువ ధాన్యం కొనుగోలు చేశామని చెబుతున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి లెక్కలు అర్థం కావడం లేదని గతంతో పోలిస్తే నేడు కొనుగోలు శక్తి తగ్గిందని ఎద్దేవా చేశారు. నేడు రైతుల దగ్గర ధాన్యపు రాశులు ఉన్నాయని ధాన్యాన్ని కొనుగోలు చేయలేని దౌర్భాగ్య స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులు సంతోషపడ్డారని నేటి రేవంత్ రెడ్డి హయాంలో రైతులు బాధపడుతున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కేవెల్ రెడ్డి, సురేష్ బాబు చన్నబోయిన సైదులు.. మాజీ మున్సిపల్ చైర్మన్ జయ బాబు, మున్సిపల్ కౌన్సిలర్ దొండపాటి అప్పిరెడ్డి జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి.. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కడియం వెంకట్ రెడ్డి, నాగండ్ల శ్రీధర్ బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరావు, నాగ సైదులు..పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# క్రీడా రంగంలో ములుగు జిల్లా సత్తా చాటుతోంది




**జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ములుగు క్రీడాకారులు**

**క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రజా ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుంది**

**క్రీడాకారుల కోసం అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు**

**మంత్రి సీతక్క**

**ములుగు, జూన్ 24, మనం ప్రతినిధి:** క్రీడా రంగంలో ములుగు జిల్లా సత్తాను చాటుతుందని,జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ములుగు క్రీడాకారులు రాణిస్తున్నారని,క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రజా ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని,క్రీడాకారుల కోసం అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. బుధవారం ములుగు ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, భారత ఒలింపిక్ సంఘం, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ తో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లా మారుమూల ప్రాంతం అయినప్పటికీ క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో గుర్తింపు పొందుతోందన్నారు. జిల్లాకు చెందిన అనేక మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి దేశ విదేశాల్లో ములుగు ఖ్యాతిని చాటుతున్నారని తెలిపారు. పేదరికం, వెనుకబడిన పరిస్థితులు ఉన్నప్పటికీ జిల్లాలోని పిల్లల్లో ఉన్న ప్రతిభ అపారమని,వాలీబాల్, ఆర్చరీ వంటి క్రీడల్లో ములుగు జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించిన చరిత్ర ఉందన్నారు. క్రికెట్ సహా ఇతర క్రీడల్లో కూడా విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జిల్లాలో క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అథ్లెటిక్స్ స్టేడియం ఏర్పాటు కోసం వచ్చిన ప్రతిపాదన మేరకు రూ.4 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయించామని, భవిష్యత్తులో అవసరమైన అదనపు సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటు క్రీడలపై పూర్తి ఏకాగ్రతతో ముందుకు సాగాలని సూచించారు.

ప్రతి విద్యార్థి తాను ఎంచుకున్న క్రీడలో విజయం సాధించి ములుగు జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని,తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షిస్తూ మంత్రి అనసూయ సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఈవో సిద్ధార్థ రెడ్డి, డి.ఎస్.పి రవీందర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పగడాల వెంకటేశ్వర రెడ్డి, పీడీలు, పి ఈ టి లు , సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## మహిళా సాధికారత కార్యక్రమంలో పాల్గొన్న సరిత




**మహాదేవపూర్ జూన్ 24మనం న్యూస్:** మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ సరిత బుధవారం హైదరాబాద్లోని జూబ్లీహిల్లో నిర్వహించిన ఉమెన్ఎంపవర్మెంట్ తెలుగు అసోసియేషన్ వేట్ ఇండియా ఆధ్వర్యంలోని కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళాసాధికారతకు సంబంధించిన కార్యక్రమంలో ఆమె చురుకుగా పాల్గొనగా, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు ఝాన్సీ రెడ్డి చేతుల మీదుగాసర్టిఫికెట్నుఅందుకున్నారు.ఈసందర్భంగాసరిత మాట్లాడుతూ, మహిళల సాధికారత, గ్రామాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లోమహిళలభాగస్వామ్యం మరింతపెరగాలనిఆకాంక్షించారు.

# ఓటరు జాబితా స్వచ్ఛత, ఖచ్చితత్వ పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

- **ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్ట విరుద్ధం**
- **తప్పుడు సమాచారం, ద్వంద్వ నమోదులపై కఠిన చర్యలు తప్పవు**
- **జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు, జూన్ 24, మనం ప్రతినిధి:** ఓటరు జాబితా స్వచ్ఛత మరియు ఖచ్చితత్వాన్ని పరిరక్షించేందుకు ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్లు 17, 18 మరియు 31 నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో ఓటరు నమోదు నిషేధమని, సెక్షన్ 17 ప్రకారం, ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ అసెంబ్లీ నియోజకవర్గాలలో ఓటరుగా నమోదు కావడానికి అర్హుడు కాదని తెలిపారు.ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాలలో పేరు నమోదు అయినట్లు గుర్తించినట్లయితే, సంబంధిత నమోదులను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయి స్పష్టం చేశారు. ఒకే నియోజకవర్గంలో ద్వంద్వ నమోదులు అనుమతించబడవని,సెక్షన్ 18 ప్రకారం, ఒక వ్యక్తి ఒకే నియోజకవర్గంలో ఒకటి కంటే ఎక్కువసార్లు ఓటరుగా నమోదు కావడం నిషేధించబడిందని పేర్కొన్నారు. ద్వంద్వ నమోదులను గుర్తించి తొలగించడం ద్వారా ఓటరు జాబితా పారదర్శకత కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తప్పుడు సమాచారం, నకిలీ పత్రాల సమర్పణ శిక్షార్హమైన నేరమని, సెక్షన్ 31 ప్రకారం, ఓటరు నమోదు కోసం తప్పుడు సమాచారం ఇవ్వడం, నకిలీ పత్రాలు సమర్పించడం,ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రకటనలు చేయడం శిక్షార్హమైన నేరమని తెలిపారు.ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానా శిక్షలు విధించబడతాయని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీలో ప్రజలు సహకరించాలని ,ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించి, సరైన సమాచారం మాత్రమే అందించాలని, ఒకటి కంటే ఎక్కువ నమోదులు ఉన్నట్లయితే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. స్వచ్ఛమైన, పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో ప్రతి పౌరుడు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆ ప్రకటనలో కోరారు.

## డబుల్బెడ్రూం ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**వరంగల్, జూన్ 24(మనంన్యూస్):** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం గన్నారం,కాట్రపల్లి గ్రామంలోని 2బీహెచ్కే గృహాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా గృహాల నిర్మాణ స్థితి, మౌలిక వసతులు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2బీహెచ్కే ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించాలని, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఇందిరమ్మ ఇండ్ల నోడల్ అధికారి, జెడ్పీ సీఈవో రాంరెడ్డిని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హుల జాబితాను రూపొందించి, నిజమైన నిరుపేదలకు గృహాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, వరంగల్ ఆర్డీవో సుమ , రాయపర్తి తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, కలెక్టర్ వెంట ఉన్నారు.

# విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలి




- **జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, జూన్ 24(మనంన్యూస్):** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తెట్టేకుంట తండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం మరియు పూర్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న విద్యా బోధన, పోషకాహార కార్యక్రమాలు, మౌలిక వసతులను పరిశీలించారు. పిల్లల హాజరు, విద్యా ప్రమాణాలు, అంగన్వాడీ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రాలు మరియు పాఠశాలల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎంపీపీస్ తెట్టేకుంట తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలావస్థలో ఉన్నందున రానున్న వర్ష కాలం దృష్ట్యా సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. పరిసర ప్రజలకు ఏదైనా త్రాగునీటి సరఫరా సమస్య లు ఉన్నట్లు అయితే పరిష్కరించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారి నిర్మలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఆర్డీవో సుమ,రాయపర్తి తహసిల్దార్ శ్రీనివాస్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**వరంగల్, జూన్ 24(మనంన్యూస్):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడం, ఓటర్ల సందేహాలను నివృత్తి చేయడం లక్ష్యంగా వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హెల్ప్ డెస్క్ పనితీరును పరిశీలించి, ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన సేవలను వేగవంతంగా అందించాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం కావడానికి రెవెన్యూ, ఎన్నికల శాఖ అధికారులు సమన్వయంతో




పనిచేయాలని, ప్రజలకు అవసరమైన సమాచారం సకాలంలో అందించాలని కలెక్టర్ తెలిపారు. రేపటినుండి బి ఎల్ వో లు ఖిఐఖసర్వే పై ఇంటింటికి సందర్శించ నున్నందున ప్రజలు సహరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో సుమ, వర్ధన్నపేట తహసిల్దార్ విజయ్ సాగర్ సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు రాజుపేటలో ప్రజా దర్బార్ కార్యక్రమం

- **జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు, జూన్ 24, మనం ప్రతినిధి:** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసుకొని పరిష్కరించే ఉద్దేశంతో గ్రామాలలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగపేట మండలం రాజుపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం ఉదయం 8:00 గంటలకు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గం చూపేందుకు మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో మంగపేట మండల పరిధిలోని అక్కినేపల్లి మల్లారం, బ్రాహ్మణపల్లి, రాజుపేట, కత్తిగూడెం, నిమ్మగూడెం, దోమెడ, రామచంద్రునిపేట, వాడేగూడెం, రమణక్కపేట, చుంచుపల్లి, వాగుడుగూడెం గ్రామపంచాయతీల పరిధిలోని ప్రజల కోసం ఈ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా కోరారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ, డీఎఫ్ఓ, అదనపు కలెక్టర్లు,ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

## పాలంపేటలో ఘటమయ్య గుడి నిర్మాణ పనులకు శంకుస్థాపన



- **రూ.10 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణ పనులు చేపట్టనున్న ప్రభుత్వం**
- **ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత**
- **మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**ములుగు, జూన్ 24,మనం ప్రతినిధి:** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో కాటమయ్య గుడి నిర్మాణ పనులకు తెలంగాణ ప్రభుత్వం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎస్డీఎఫ్ 2025-26 నిధుల ద్వారా రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయ నిర్మాణం పూర్తయిన అనంతరం భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రామ ప్రజలకు ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

# ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించేందుకు సహకరించాలి

- **అన్నిరాజకీయ పార్టీల సహకారం అందించాలి**
- **సర్ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఆదర్శంగా నిలవాలి**
- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత**

**జగిత్యాల, జూన్ 24 (మనం ప్రతినిధి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, పకడ్బందీగా, పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత కోరారు. సర్ కార్యక్రమం అమలులో జగిత్యాల జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆమె అన్నారు.

బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ₹జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత మాట్లాడుతూ₹ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్వోలు ఇంటింటి సందర్శన చేపట్టి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి నింపిన ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి సేకరిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో బీఎల్ఏలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించి అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. జూలై 24న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ,




సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాల పరిష్కారం చేపట్టి అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. బీఎల్వోలు ఇంటింటి సర్వే సందర్భంగా ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని, ఫారం అందని వారు లేదా పొరపాటున జాబితాలో చేరని అర్హులైన ఓటర్లను గుర్తించి నమోదు చేయించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. బీఎల్వోలు, బీఎల్వో సూపర్వైజర్లు, ప్రత్యేక అధికారులు నెల రోజులపాటు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని తెలిపారు. బి ఎల్ వో లు బి ఎల్ ఏ లకు పూర్తిస్థాయిలో సర్ కార్యక్రమం పై శిక్షణ కల్పించారని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే సర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఎలాంటి అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించ బడకుండా, అనర్హులు జాబితాలో చేరకుండా చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ వాలంటీర్ల సహకారాన్ని కూడా వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పుల కోసం ఫారం-8, కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6 వినియోగించాలని సూచించారు. సర్ కార్యక్రమంపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జగిత్యాల, కోరుట్ల, మెట్ పెల్లి ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, మున్సిపల్ కమిషనర్ లు, రాజకీయ పార్టీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# యోగి వేమన ధ్రువ వాస్తు పుస్తకాన్ని ఆవిష్కరించిన బాదం ప్రవీణ్

**ములుగు, జూన్ 24, మనం ప్రతినిధి:** ప్రముఖ వాస్తు పండితుడు శ్రీ కొత్తపల్లి మొగిలి శాలివాహన గారు రచించిన యోగివేమన ధ్రువ వాస్తు పుస్తకమును జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ కార్యవర్గంతో కలిసి ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ మరియు కార్యదర్శి సహోదరి రెడ్డి కోశాధికారి ఎలగందుల మోహన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్ ఉపాధ్యక్షులు అక్కల రగోతం సహాయ కార్యదర్శి డేగల భద్రయ్య బి.ఎన్.రెడ్డి వల్లాల అనిల్. భావితరాలకు ఈ యోగివేమన ధ్రువవాస్తు పుస్తకం ఉపయోగపడాలని ఉపయోగపడుతుందని వాస్తు పుస్తకమును రచించిన కొత్తపెల్లి మొగిలి గారు ఆశాభావం వ్యక్తం చేశారు



**6ఇండ్లు కూలిపోయిన నిరుపేదలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేయూత అవసరమైన సామగ్రి పంపిణీ చేసిన చైర్మన్ డాక్టర్ ఏ. అప్పయ్య**

**ములుగు: జూన్ 24, మనం ప్రతినిధి:** వెంకటాపురం మండలం ఇంచన్చెరువుపల్లి గ్రామానికి చెందిన నూనావత్ మోహన్ దాస్, బండి నరసమ్మ ఇండ్లు దెబ్బతిని పూర్తిగా కూలిపోయాయి. విషయం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ములుగు జిల్లా చైర్మన్ డాక్టర్ ఏ. అప్పయ్య దృష్టికి రాగా, వెంటనే స్పందించి బాధిత రెండు కుటుంబాలకు అవసరమైన సామగ్రిని అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు టార్పాలిన్ కవర్లు, కిచెన్ సెట్స్, దుప్పట్లు, లుంగీలు, చీరలు, టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ ఏ. అప్పయ్య మాట్లాడుతూ, 'ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎల్లప్పుడూ నిరుపేదలకు, ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవడం మా ప్రథమ కర్తవ్యం. ఈ రెండు కుటుంబాలకు తక్షణ ఉపశమనం కల్పించేందుకే ఈ సామగ్రిని అందజేశాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గంగి శెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చుంచు రమేష్, కామా అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టల్ సర్వే నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు

**మహాదేవపూర్ జూన్ 24 మనం న్యూస్:** మహాదేవపూర్ మండల కేంద్రంలో ఉన్నటువంటి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలోబీసీ బాయ్స్ హాస్టల్ లో సర్వే నిర్వహించడం జరిగింది,హాస్టల్లో విద్యార్థులు 35 మంది కి పైగా ఉన్నప్పటికీ విద్యార్థులకు కనీసం మౌలికసదుపాయాలులేకపోవడం వల్లతీ వ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాదృష్టికి తీసుకురావడం జరిగిందిఈసమస్యలపైన సంబంధించిన అధికారులకు పలుమార్లు ఎస్ఎఫ్ఐ గా తెలియజేయడం జరిగింది కానీ లాంటిప్రయోజనం లేకుండా పోయింది,ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శికుమ్మరిరాజు మాట్లాడుతూహాస్టల్లో విద్యార్థులు గత కొన్ని నెలలుగా బాత్రూమ్స్ సౌకర్యం లేక ఇబ్బందిపడుతున్నటువంటి పరిస్థితి ఉందిదాంతోపాటుహాస్టల్లో చిన్నచిన్నమైన రిపేర్లకుసంబంధించి డబ్బులు కూడా రిలీజ్ అయినటువంటి పరిస్థితి ఉంది ఈ కాంట్రాక్ట్ ఎవరైతేతీసుకున్నారో పని పూర్తిస్థాయిలో చేయకుండా మధ్యలో వదిలేసి వెళ్లినటువంటి పరిస్థితి ఉందని హాస్టల్ వార్డెన్ మా దృష్టికి తీసుకురావడం జరిగింది, అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు అయ్యే విధంగా చేయాలని ఎస్ఎఫ్ఐగాడిమాండ్చేస్తున్నాము ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించే ఏడలో హాస్టల్ విద్యార్థులందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించడం జరిగింది ఈ కార్యక్రమంలో బీసీ హాస్టల్ వి ద్యార్థులుతదితరులుపాల్గొన్నారు



# ఇంగ్లాండ్ టూర్.. భారత డ్రెస్సింగ్ రూమ్ లోకి వైభవ్ కు నో ఎంట్రీ..!

కేవలం 15ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఎంపికైన వైభవ్ సూర్యవంశీకి ఇంగ్లాండ్ లో స్వల్ప అవరోధం కలగనుంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వైభవ్ తోపాటు అతడి తల్లిదండ్రులు వెళ్లేందుకు బీసీసీఐ అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఇంగ్లాండ్ లో మాత్రం వైభవ్ సూర్యవంశీకి భారత డ్రెస్సింగ్ రూమ్ లో ఉండే అవకాశం లేకుండా పోతుందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. దానికి కారణం అక్కడి నిబంధనలేనని తెలుస్తోంది. జులై 1 నుంచి ఇంగ్లాండ్ లో టీమ్ఇండియా పర్యటించనుంది. ఐసీసీ, ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు నిబంధనల ప్రకారం 16 ఏళ్లలోపు ఆటగాళ్లకు ప్రత్యేక గదులు కేటాయిస్తారు. అయితే, ఈ విషయంపై బీసీసీఐ అధికారులు ఇంగ్లాండ్ బోర్డు ప్రతినిధులతో చర్చించే అవకాశం ఉంది.

''ఇది ఐసీసీ ఈవెంట్. వారి అధికార పరిధి ఉన్నందున భద్రతా విధానాలు అమల్లో ఉంటాయి. 16 ఏళ్లలోపు ప్లేయర్లు పెద్దల ఛేంజింగ్ రూమ్స్ ను వాడేందుకు అనుమతి లేదు. కాబట్టి, సూర్యవంశీకి ప్రత్యేకంగా గదిని కేటాయించే అవకాశం ఉంది. అతడితోపాటు తల్లిదండ్రులు కూడా వస్తారు. వారికి కూడా ప్రతి వేదిక వద్ద వసతి సదుపాయం కల్పిస్తాం. మ్యాచ్ సమయంలోనే వైభవ్ కు డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్లేందుకు అనుమతి ఉంది. మ్యాచ్కు ముందు.. తర్వాత ఛేంజింగ్ కోసం వెళ్లడానికి అనుమతి ఉండదు'' అని ఈసీబీ క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

# మిడిలార్డర్, ఫీల్డింగ్ వైఫల్యాలను అధిగమిస్తేనే..



మహిళల ప్రపంచ కప్ లో వరుసగా రెండు విజయాలతో జోరుమీదున్న టీమ్ ఇండియాకు.. దక్షిణాఫ్రికా రూపంలో షాక్ ఎదురైంది. ఈ ఓటమిలో స్వయంకృతాపరాధాలదే ప్రధాన పాత్ర. గురువారం బంగ్లాదేశ్ తో కీలక మ్యాచ్ జరగనుంది. మిడిలార్డర్తోపాటు ఫీల్డింగ్ వైఫల్యం నుంచి బయటపడాల్సిన అవసరం ఉంది.

ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, నెదర్లాండ్స్ తో కూడిన గ్రూప్ అలో టీమ్ఇండియా ఉంది. ఇప్పటికే పాక్, నెదర్లాండ్స్ ఇంటిముఖం పట్టాయి. అన్ని జట్ల కంటే ఆసీస్ (8 పాయింట్లు) టాప్ లో ఉంది. ఆడిన నాలుగు మ్యాచుల్లోనూ గెలిచింది. ఇక భారత్ (4 పాయింట్లు) మూడు మ్యాచుల్లో రెండు విజయాలు, ఒక ఓటమితో రెండో స్థానంలో ఉంది. దక్షిణాఫ్రికా (4), బంగ్లాదేశ్ (4) కూడా సేమ్ పాయింట్లతో ఉన్నాయి. కానీ, నెట్ రన్ రేట్ మాత్రం టీమ్ఇండియాదే ఎక్కువ. భారత్ ఇంకా రెండు మ్యాచులు ఆడాలి. అదీనూ బంగ్లాదేశ్, ఆస్ట్రేలియాపైనే. రెండూ గెలిస్తే తిరుగులేకుండా సెమీస్ కు చేరుకోవచ్చు. ఒక్కటి ఓడినా.. నెట్ రన్ రేట్ కీలకమవుతుంది. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే ఇప్పుడు బంగ్లాపై భారీ విజయం నమోదు చేయాలి.

షెఫాలీ వర్మ లేదా స్మృతి మంధాననే పరుగులు చేయాలి అన్నట్లుగా ఉంది భారత పరిస్థితి. మిగతా బ్యాటర్ల నుంచి సహకారం పెద్దగా లభించడంలేదు. ఆఖర్లో రిచా ఘోష్ దూకుడుతో ఫినిషింగ్ టచ్ ఇస్తోంది. కానీ, మిడిల్ ఆర్డర్ నుంచి ఆశించిన పరుగులు రావడం లేదు. జెమీమా రోడ్రిగ్స్ ఆటతీరు గొప్పగా లేదు. ఓపెనర్లు రాణించినప్పటికీ.. ఆ తర్వాత వచ్చే జెమీమా ఆ దూకుడును కొనసాగించలేకపోతోంది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కూడా భారీ ఇన్నింగ్స్ బాకీ ఉంది. బంగ్లాదేశ్ తో మ్యాచ్ లో వీరిద్దరూ రాణించాల్సి ఉంది.

క్యాచులు ఎంత కీలకమో..

'క్యాచెస్ విన్ మ్యాచెస్'.. అంటే ఇప్పుడు భారత జట్టుకు బాగా తెలిసి ఉంటుంది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్ లో కాప్ ఇచ్చిన క్యాచ్ ను జారవిడవడంతో టీమ్ఇండియాకు ఓటమి తప్పలేదు. ఫీల్డింగ్ లోనూ గొప్ప ప్రదర్శన చూపించకపోవడం విమర్శలకు దారితీసింది. తదుపరి మ్యాచ్ లోనూ ఫీల్డింగ్ మెరుగు కాకపోతే భంగపాటు తప్పదు. ఇప్పుడీ మ్యాచులు నాకౌట్ లాంటివే. ఒక్కటి ఓడినా ఇబ్బందుల్లో పడినట్లే.

భారత్ కు ప్రధాన ఆయుధం స్పిన్. దాంతోనే రెండు మ్యాచుల్లో గెలిచింది. మూడో మ్యాచ్ లోనూ దక్షిణాఫ్రికాను ఓడించే అవకాశం వచ్చినా చేజారింది. మహిళల బౌలింగ్ విభాగంలో అగ్రస్థానానికి చేరిన తెలుగు అమ్మాయి శ్రీ చరణి మూడు మ్యాచుల్లోనూ అదరగొట్టింది. ప్రస్తుతం ఈ వరల్ కప్ లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో శ్రీచరణి టాపర్. మూడు మ్యాచుల్లో 10 వికెట్లు పడగొట్టింది. అయితే, ఆమెకు తోడుగా నిలిచే స్పిన్నర్ లేదా పేసర్ నిలకడ చూపించడం లేదు. దీప్తి శర్మ ఒక మ్యాచ్ లో ఐదు వికెట్ల ప్రదర్శన మినహా.. మిగతా రెండింట్లో ప్రభావం చూపించలేదు. ఇక పేసర్ల పరిస్థితి దయనీయం. అత్యధిక వికెట్లు తీసిన టాప్ -15 బౌలర్లలో భారత్ నుంచి శ్రీచరణి, దీప్తి మాత్రమే ఉండటం గమనార్హం.



# రొనాల్డో అదరహో..

### ఉజ్బెకిస్థాన్ పై పోర్చుగల్ విజయం

పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో చరిత్ర సృష్టించాడు. ఆరు ప్రపంచకప్పుల్లో స్కోర్ చేసిన తొలి ఫుట్ బాలర్ గా ఘనత సాధించాడు. రొనాల్డో (6వ, 39వ) రెండు గోల్స్ కొట్టడంతో మంగళవారం గ్రూప్-కె మ్యాచ్ (గ్రూప్-కె)లో పోర్చుగల్ 5-0తో ఉజ్బెకిస్థాన్ పై ఘనవిజయం సాధించింది. నునో మెండెస్ (17వ), రఫేలియో (87వ) పోర్చుగల్ కు చెరో గోల్ అందించారు. ఉజ్బెకిస్థాన్ ఆటగాడు నెమతోవ్ (60వ) ఓ సెల్ఫ్ గోల్ చేశాడు. ఈ మ్యాచ్ లో పోర్చుగల్ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. గోల్ పై పదే పదే దాడులు చేస్తూ ఉజ్బెకిస్థాన్ డిఫెన్స్ ను ఒత్తిడికి గురి చేసింది. కాంగో డీర్ తో ఆడిన తొలి మ్యాచ్ ను పోర్చుగల్ 1-1తో డ్రాగా ముగించిన సంగతి తెలిసిందే.

# 'వారణాసి' షూట్‌కి మహేష్ బ్రేక్..



దర్శకధీరుడు రాజమౌళి - మహేష్ బాబు కలయికలో రాబోతున్న సినిమా 'వారణాసి'. ఐతే, మహేష్ బాబు గత కొన్ని నెలలుగా 'వారణాసి' షూటింగ్ లో బిజీగా ఉన్నారు. కానీ, ఇప్పుడు, మహేష్ బాబు తన భార్య నమ్రత, పిల్లలు గౌతమ్, సితారలతో కలిసి ఒక చిన్న విహారయాత్రకు బయలుదేరుతూ, ఆర్జీఐఏ విమానాశ్రయంలో కనిపించారు. వారు విమానాశ్రయంలో కనిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో, మహేష్ బాబు 'వారణాసి' షూటింగ్ నుండి కొద్దికాలం విరామం తీసుకున్నారని క్లారిటీ వచ్చింది.

మళ్లీ మహేష్ జూలై 1, 2026 నాటికి తిరిగి వారణాసి షూట్ లో జాయిన్ అవుతారని తెలుస్తోంది. అన్నట్టు మహేష్ అభిమానులకు ఈ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్ కనుల విందుగా ఉంటుందని టాక్. ప్రియాంక ఈ సినిమాలో మందాకినిగా కనిపిస్తూ ఉండగా.. మహేశ్ రుద్రగా.. శ్రీరాముడిగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కాగా 'వారణాసి' చిత్రం రూ.1300 కోట్లకు పైగా భారీ బడ్జెట్ తో నిర్మితమవుతోంది. ఈ భారీ ప్రాజెక్ట్ ను కెఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు.


ఇప్పటికే విడుదలైన టీజర్ కు దేశవ్యాప్తంగా మంచి స్పందన లభించింది. ఈ చిత్రానికి సంగీతాన్ని ఎంఎం కీరవాణి అందిస్తుండగా, కథా కథనాన్ని విజయేంద్ర ప్రసాద్ రూపొందించారు. ఇక ఈ సినిమాకి దేవా కట్టా సంభాషణలు అందిస్తున్నారు. ఈ సినిమాను పూర్తిగా ఐమ్యాక్స్ ఫార్మాట్లో చిత్రీకరిస్తుండగా, పలు భాషల్లో విడుదల చేయనున్నారు.



# 'రవితేజ'తో యంగ్ బ్యూటీ స్పెషల్ సాంగ్ ?

హీరో రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో ఇరుముడి చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఐతే, తాజాగా ఈ సినిమా గురించి వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ను డిజైన్ చేశారు. ఈ సాంగ్ కోసం యంగ్ బ్యూటీ నభా నటేష్ ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. కమర్షియల్ ఎలిమెంట్స్ ను దృష్టిలో పెట్టుకుని శివ నిర్వాణ ఈ సాంగ్ ను పెట్టాడట. అన్నట్టు నభా నటేష్ ది కేవలం స్పెషల్ సాంగ్ మాత్రమే కాదు అని, ఆమెది ఒక గెస్ట్ రోల్ అని తెలుస్తోంది. ముఖ్యంగా రవితేజ - నభా పాత్రల మధ్య కొన్ని సన్నివేశాలు కూడా ఉంటాయట. ఇక 'కొన్ని కథలు జీవితంలో సరైన సమయంలో మనల్ని ఎంచుకుంటాయి. అలాంటి ఒక కథే ఈ ఇరుముడి. ఇందులో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. కొత్త ప్రయాణంలో ఉత్సాహంగా ఉన్నా'' అని రవితేజ ఆ మధ్య చెప్పుకొచ్చారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమాలో కథానాయికగా ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా.. జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో బేబీ నకాస్త్ర రవితేజ కుమార్తెగా నటిస్తోంది.

# దక్షిణాదిలో అంతగా ప్రశంసలు ఉండవు: తమన్నా



బాలీవుడ్ తో పోలిస్తే దక్షిణాది సినిమాల్లో మహిళా నటీమణులకు అంతగా ప్రశంసలు ఉండవని, హీరోలకి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందంటున్నారు నటి తమన్నా. సుమారు రెండు దశాబ్దాలుగా వివిధ భాషల్లో నటిస్తున్న ఆమె.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో దక్షిణాది, బాలీవుడ్ పరిశ్రమల మధ్య ఉన్న తేడాను వివరించారు. ''హిందీలో ప్రధానంగా రెండు రకాల నటులుంటారు. నటనకు ప్రాధాన్యమిచ్చే వారు. గ్లామరస్ పాటలకు, డ్యాన్సులకు ఆసక్తి చూపేవారు. హిందీ చిత్ర పరిశ్రమలో ఏదో ఒకటి ఎంచుకునే స్వేచ్ఛ ఉంటుంది. ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేసేవారే అక్కడ సూపర్స్టార్లు అవుతారు. కానీ, సౌత్లో కమర్షియల్ సినిమాలకు ఒక నిర్దిష్టమైన ఫార్మాట్ ఉంటుంది. ఇక్కడ పితృస్వామ్య భావజాలం ఎక్కువ. హీరోయిన్లను చూసే విధానం అంత ప్రశంసనీయంగా అనిపించదు. సౌత్ లోకి అడుగుపెట్టాకే నాకు అక్కడి పరిస్థితి అర్థమైంది. ఇది కేవలం నా వ్యక్తిగత అనుభవం మాత్రమే. ఇతరులకు భిన్నమైన అభిప్రాయాలు ఉండొచ్చు. నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలతో పాటు కమర్షియల్ హంగులను సమన్వయం చేసుకున్న నటీమణులే 10 నుంచి 15 ఏళ్ల పాటు కెరీర్ ను కొనసాగించగలరు'' అని విశ్లేషించారు.

ఇక, ప్రస్తుతం ఆమె 'వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' సినిమాలో నటిస్తున్నారు. దీపక్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్ మల్హోత్రా హీరో. మనీష్ పాల్, సునీల్ గ్రోవర్, శ్వేతా తివారీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా 2026 ఆగస్టు 26న థియేటర్లలోకి రానుంది. అదే రోజు శ్రద్ధా కపూర్ 'ఈత', యశ్ 'టాక్సిక్' చిత్రాలు కూడా బరిలో ఉండటంతో బాక్సాఫీస్ వద్ద పోటీ నెలకొననుంది.

# రామ్ పోతినేని నెక్స్ట్ ప్రాజెక్ట్ బడ్జెట్‌పై ఇంట్రెస్టింగ్ బజ్.. ఏకంగా అంతా..?

యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని కెరీర్ లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్రంగా రూపుదిద్దుకుంటోంది. రాపో సినిమాటిక్స్ బ్యానర్ పై నిర్మాత కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా భారీ బడ్జెట్తో నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ఈ సినిమాను రామ్ కెరీర్ లో ముందెన్నడూ లేని విధంగా అత్యంత భారీ స్కేల్ లో, అత్యున్నత నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తుండటం విశేషం.



అయితే, ఈ సినిమా కోసం ఏకంగా రూ.100 కోట్ల బడ్జెట్ ను కేటాయించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం కోసం టాలీవుడ్ లోని స్టార్ టెక్నీషియన్స్ రంగంలోకి దిగారు. ఈ చిత్రానికి నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ తిరు విజువల్స్ అందిస్తున్నారు. అలాగే టాప్ యాక్షన్ కొరియోగ్రాఫర్ అయిన పీటర్ హెయిన్ ఈ సినిమా కోసం హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ లను డిజైన్ చేస్తుండగా, ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ ఎ.ఎస్. ప్రకాష్ హైదరాబాద్ శివార్లలో భారీ సెట్లను నిర్మిస్తున్నారు.

కళ్లు చెదిరే యాక్షన్ ఎపిసోడ్స్, గ్రాండ్ ప్రొడక్షన్ డిజైన్, టాప్ టెక్నీషియన్స్ కలయికలో వస్తున్న RAPO23 రామ్ పోతినేని కెరీర్ లో ఒక మైలురాయిగా నిలిచిపోనుందని తెలుస్తోంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మిగతా నటీనటుల వివరాలను అధికారికంగా వెల్లడించనున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.